
రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై చర్యలేమిటి?
రాష్ట్రాన్ని వివరణ కోరిన హైకోర్టు

మున్సిపల్ ఎన్నికలెప్పుడు?
ప్రభుత్వ వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

03

సంపుటి 28, సంచిక: 73 | మంగళవారం | 2-09-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## 'కాళేశ్వరం అవినీతి'పై సిబిఐ విచారణ


- శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం
- అక్రమాలను నిగ్గుతేల్చేందుకు కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించడమే సముచితమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

జిస్టిస్ పి.సి ఘోష్ కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా 'కాళేశ్వరం ప్రాజెక్టు' అవినీతిపైన దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు (సిబిఐ) అప్పగించాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ప్రాజెక్టులో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలు పంచుకున్నాయని, ప్రాజెక్టు డిజైన్,నిర్మాణం,ఫైనాన్సింగ్‌లో వ్యాప్‌కోస్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు,పిఎఫ్‌సి, ఆర్ఇసి వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నా యని, అందుకే ఈ కేసును సిబిఐకి అప్పగించడమే తరువాయి 2లో

## పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ
# బిల్లులు ఆమోదించండి

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు కాంగ్రెస్, సిపిఐ, బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల బృందం విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిల రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసే తెలంగాణ పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టం సవరణ బిల్లులను ఆమోదించాలని కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల బృందం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను విజ్ఞప్తి చేశారు.బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచేందుకు అడ్డంకిగా మారిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఉన్న పంచాయతీ, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులను ఆమోదించి, బిసిలకు న్యాయం చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు శాసనసభలో ఆమోదించిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక సంస్థలల్లో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధన ఎత్తివేస్తూ శాసన సభలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్,మున్సిపల్ సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదంపొందిందని, మూడ్ ఆఫ్ హౌజ్ పరిగణనలోకి తీసుకుని బిసిల రిజర్వేషన్ల తరువాయి 12లో

## వరద నష్టంపై సమగ్ర నివేదిక

- వెంటనే సిద్ధం చేయండి
- వర్షాలతో దెబ్బతిన్న పనులను వేగవంతం చేయండి
- వరదలపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 82మండలాల్లో 2.36లక్షల ఎకరాల్లో పంట నష్టం



ప్రజాపక్షం/హైదరాబాద్

భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటల మరమ్మతు పనులతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని శాఖల నుంచి సమగ్ర నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ నెల 4వ తేదీన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఈ నివేదికలను అందజేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్‌డిఆర్‌ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం తరువాయి 2లో

## ఓట్లు తొలగించే అధికారం ఎవరికీ లేదు?

మీట్ ది ప్రెస్‌లోజస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి





## అత్యంత ప్రమాదంలో ఎన్నికల ప్రక్రియ

- దేశంలో వలసపాలన బానిసత్వం నుంచి విముక్తికి గుర్తింపు ఓటు హక్కు
- దానిని పరిహాసం చేస్తుంటే చూస్తూ ఉండలేకపోతున్నాం

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

- హైదరాబాద్‌లో విపక్షపార్టీ ఎంపిలు, పలువురు నేతలతో భేటీ



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కలిసిన వామపక్షనేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ నేడు దేశంలో అత్యంత ప్రమాదంలో పడనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. దేశంలో వలస పాలన బానిసత్వం నుంచి విముక్తికి గుర్తింపు ఓటు హక్కు అని, అంత విలువైన ఓటు హక్కును కేంద్ర పాలకులు తమ ఇష్టానుసారంగా పరిహాసం చేస్తుంటే గత 53 ఏళ్లుగా రాజ్యాంగాన్ని నమ్మి ఆచరిస్తున్న వ్యక్తిగా చూస్తూ ఉండలేకే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఎంపిలతో సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి నాజర్ హుస్సేన్, ఎంపి మల్లు రవి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టిజెసి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌తో పాటు కాంగ్రెస్ ఎంపిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ 1947లో ముందుగా ఓటర్లుగా గుర్తింపు పొందిన తర్వాతే దేశ పౌరులుగా గుర్తించబడ్డారన్నారు. ఆలాంటి ఓటు హక్కును చిత్తు కాగితంగా భావిస్తూ చించేస్తాం, తొలగిస్తామంటే ఎలా సాధ్యమవుతుందని తరువాయి 12లో

# హైడ్రోజన్ బాంబు పేలుస్తాం...



- ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు
- 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్ అడ్డగింత
- డాక్ బంగ్లా క్రాసింగ్ వద్దే బైఠాయింపు

**పాట్నా :** ఓట్ల చోరీకి సంబంధించి తాము ఇప్పటికే అణుబాంబు పేల్చామని, త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గడ్డ పరిస్థితులు ఎదుర్కొంటారని చెప్పారు. బిహార్‌లో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా సోమవారం పాట్నాలో 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్‌ను నిర్వహించారు. అయితే ఈ పాదయాత్రను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. భారతీయ కూటమి నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ఎస్ పి వర్మ రోడ్, ఎగ్జిబిషన్ రోడ్, డాక్ బంగ్లా క్రాసింగ్ గుండా సాగింది. యాత్రలో రాహుల గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముకేష్ సహానీ, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పార్టీ జాతీయ కార్యదర్శి అన్నీరా జా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, టిఎంసి ఎంపి యూ సుఫ్ పఠాన్, శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్, ఇతర ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా, 'గాంధీ సే అంబేద్కర్' పాదయాత్రను డా క్ బంగ్లా క్రాసింగ్ వద్ద అడ్డుకున్నట్లు ఎస్ఎస్‌పి కార్తికేయ శర్మ తరువాయి 2లో



## బిజెపి అక్రమాలను సహించం

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

ప్రజాస్వామ్యాన్ని దొంగిలించడానికి బిజెపి అవకతవకలను సిపిఐ, ఇండియా మహాఘట్బంధన్ అనుమతించవని, ప్రతి పౌరుడు తమ ఓటు వేస్తారని, ప్రజల ఐక్య బలం మోసపూరిత పాలనను ఓడిస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. ఓట్ అధికార్ యాత్ర ముగింపులో రాజాతో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, సిపిఐ బిహార్ కార్యదర్శి రాంనరేష్ పాండే, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. అయితే చరిత్రాత్మక ఓటర్ అధికారి యాత్ర ముగింపు కోసం ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వంలో వేలాది మంది సిపిఐ శ్రేణులు పాట్నాలోని గాంధీ మైదాన్ వైపు ర్యాలీగా కదిలారు. 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అంటూ దిక్కులు తరువాయి 2లో




# భూకంప విలయం

అఫ్గానిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూప్రకంపనలు

## 812 మంది మృతి

2,500 మందికి గాయాలు

కునార్ రాష్ట్రంలో వందల ఇళ్ళు నేలమట్టం
మూసుకుపోయిన దార్లు,హెలికాప్టర్లే దిక్కు



**కాబూల్:** తూర్పు అఫ్గానిస్థాన్ కునార్,లాఘ్‌మన్ రాష్ట్రాలలో భూ ప్రళయం సంభవించింది. భూమి తీవ్రంగా కంపించడంతో ఇళ్ళు నేలమట్టమై 812 మంది పైగా ప్రజలు మరణించారు. మరో 2,500 మంది గాయపడ్డారు. మృతులు,గాయపడినవారం సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. అనేకమంది శిథిలాల్లో చిక్కుకున్నారు. ఈ భూకంపం రిచ్‌టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో నమోదైనట్లు తాలిబన్ హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది. భూకంపం వచ్చాక తిరిగి తెల్లారేవరకూ మరో 13 సార్లు భూ ప్రకంపనలు సంభవించాయి. దీనివల్ల కాబూల్ నుండి ఇస్లామాబాద్ వరకూ ప్రకంపనలు విస్తరించాయి. తమ పిల్లలు,ఆత్మీయులను శిథిలాలనుండి బయటకు తీసేందుకు సహాయం లభించడంలేదని సజీవులు రోదిస్తున్నారు. ఐతే గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించేందుకు తాలిబన్ ప్రభుత్వం హెలికాప్టర్‌లను రంగంలోకి దించింది. కానీ ఎక్కడో మారుమూల ఉన్న గ్రామాలకు చేరుకోవడం సహాయబృందాలకు కష్టంగా మారింది. ఈ ప్రాంతాలో ఇప్పటికే గడచిన కొద్దిరోజులుగా తీవ్రమైన వరదలు బీభత్సం సృష్టించగా, కొండచరియలు విరిగిపడి రహదారులపై తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి హెలికాప్టర్ ఒక్కటే ఏకైక మార్గంగా ఉంది. సరైన మార్గాలు లేకపోవడంతో మరణాల సంఖ్య, ఉద్ధృతి వివరాలు తెలిసేందుకు జాప్యం జరుగుతోంది. కునార్ రాష్ట్రంలో ఎక్కువ నష్టం జరిగింది. ప్రధానంగా మూడు గ్రామాలు తీవ్రం గా నష్టపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కునార్ రాష్ట్రంలోని నూర్గల్, సోకీ, వాట్పూర్, మనోగీ, ఛాపదార్ తదితర జిల్లాలలో వందలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయి. నాన్‌గర్హార్ రాష్ట్రం జలాలాబాద్‌కు ఈశాన్యంగా 27 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉందని అమెరికా భూగర్భశాస్త్రాల పరిశోధనాకేంద్రం గుర్తించింది. కునార్ రాష్ట్రం పాకిస్థాన్ తరువాయి 2లో

హరీశ్‌రావు, సంతోష్ వల్లే
## కెసిఆర్‌కు అవినీతి మరక



- కాళేశ్వరం అవినీతిలో హరీశ్ పాత్ర లేదా.?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్

కెసిఆర్‌కు అవినీతి మరక అంటించడంలో మాజీ మంత్రి హరీష్ రావు, సంతోష్‌రావు, మెగా కృష్ణారెడ్డి పాత్ర ఉన్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అవినీతి అనకొండలు కెసిఆర్‌ను అప్రతిష్టపాలు తరువాయి 12లో


# ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

- ఎస్‌సిఒ సభ్యదేశాల ప్రతిన
- పహల్గాం ఉగ్రదాడికి ఖండన



**టియాంజిన్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని సోమవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. అయితే పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా ఉందని భారత దేశం చాలా కాలంగా చెబుతున్నప్పటికీ ఉమ్మడి ప్రకటనలో పాకిస్థాన్ పేరు ప్రస్తావించకపోవడం గమనార్హం. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం ముగిసిన తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటనలో, చైనా, టర్కీతో సహా సభ్య దేశాలు దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశాయి. అటువంటి చర్యలకు పాల్పడినవారు, చేయించినవారు, సాయం చేసినవారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని నొక్కిచెప్పాయి. ఏరూపంలో ఉన్నప్పటికీ ఉగ్రవా దం, వేర్పాటు వాదం, తీవ్రవాదంపై ఉమ్మడి పోరాటాన్ని కొనసాగించాలని ప్రతిన బూనాయి. అటువంటి బెదిరింపులను ఎదుర్కోవడంలో సార్వభౌమ ప్రభుత్వాలు , వాటి సంస్థలు ప్రాథమిక బాధ్యతను కలిగి ఉన్నాయని సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద , తీవ్రవాద గ్రూపులను కిరాయి ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని సభ్య దేశాలు స్పష్టం చేశాయి. వీటిని అణచివేసేందుకు సభ్య దేశాలు చేస్తున్న ప్రయత్నాలను గుర్తిస్తున్నామని వెల్లడించాయి. పాకిస్థాన్ జరిగిన ఉగ్రవాద దాడులను కూడా ఎస్‌సిఓ సభ్య దేశాలు ఖండించాయి. వాటిలో మే 21న జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ బాంబు దాడి, ఖుజ్‌దార్ దాడి కూడా ఉన్నాయి. ఇక ఉగ్రవాదాన్ని అణచివేస్తామని ప్రతినబూనిన సభ్య దేశాలు... గాజాలో ఇజ్రాయిల్ చేపడుతున్న సైనిక చర్యను ఖండించాయి. గ్లోబల్ కౌంటర్‌టెర్రరిజం స్ట్రాటజీని పూర్తిగా అమలు చేయడంలో ఐక్యరాజ్యసమితి ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎస్‌సిఒ పేర్కొంది. ఉగ్రవాద గ్రూపులను తరువాయి 2లో

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

(సిపిఐ ఆరంభకాలం విశేషాలు 6వ పేజీలో)

## 'స్థానికత' తప్పక ఉండాల్సిందే

వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ సర్కారు విధించిన నివాస నిబంధనలను సమర్థించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** రాష్ట్ర కోటా కింద వైద్య కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు తెలంగాణ నివాస నిబంధనల (స్థానికత)ను సోమవారం సుప్రీంకోర్టు సమర్థించింది.గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు రాష్ట్ర కోటా కింద మెడికల్ కాలేజీలు, దంత కళాశాలల్లో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

గాజా జర్నలిస్టులకు 70దేశాల్లో

## 250 మీడియా సంస్థల మద్దతు



**జెరూసలెం:** గాజాలో జర్నలిస్టులపై ఇజ్రాయెల్ చేస్తున్న ఉద్దేశపూర్వక దాడులు,హత్యలకు నిరసన తెలియజేస్తూ 70 దేశాలకు చెందిన 250 మీడియా సంస్థలు తమ తమ వెబ్‌సైట్ పత్రికలద్వారా ఫ్రంట్‌పేజీలలో ఒకే సారి నిరసన తెలియజేశాయి. ఇజ్రాయెల్ అకృత్యాలను మూకుమ్మడిగా ఖండించాయి. ఒక్క ఆగస్టు నెలలోనే దాదాపు 11 మంది జర్నలిస్టులు ఐడిఎఫ్ గగనతల దాడుల ద్వారా మరణించారు. గాజాలో జర్నలిస్టులకు ఈ 250 మీడియా సంస్థలూ పూర్తి సంఘీభావం ప్రకటించాయి. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ఫ్రీడమ్ గ్రూప్ జర్నలిస్టుల సంస్థ సోమ వారం ఈ విషయం ప్రకటించింది. జర్నలిస్టులందరినీ ఇలా చంపుకుని తింటే ఇక మీ ఉనికి గురించి కూడా ప్రపంచానికి చెప్పడానికి ఎవ్వరూ ఉండ రని ఆ గ్రూప్ డైరెక్టర్ తిబాట్ బ్రుట్టిన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

హౌతీల నిర్బంధంలో..

# 11 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది

**సనా:** యెమెన్‌రాజధాని సనాలో హౌతీ తిరుగుబాటు ఉగ్రవాదులు ఐక్యరాజ్యసమితి కార్యాలయాలపై దాడులు చేసి 11 మంది సిబ్బందిని నిర్బంధించి తీసు కుపోయారు. తమ ప్రధానమంత్రి అల్–రహవీ సహ పలువురు మంత్రులను ఇజ్రాయెల్ దాడిచేసి చంపిన తర్వాత హౌతీ ప్రభుత్వ అధికారులు తమ పాలనాప రిధిలో ఉన్న ప్రాంతాలలో దాడులు చేసి అనేకమందిని అరెస్టు చేశారు. ఇందులోభాగంగా ఐక్యరాజ్యసమితి కార్యాలయాలపైన కూడా దాడులు చేసి సిబ్బందిని తీసు కుపోయారు. ఈ దాడులపై హౌతీ ప్రభుత్వ అధికా రులు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. యెమెన్‌లోని ఐక్య రాజ్యసమితి దౌత్యవేత్త హాన్స్ గ్రండ్‌బెర్గ్ ఒక ప్రకటనలో తమ సిబ్బంది నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. సనా,హొడైడాలలో ఉన్న ఐక్యరాజ్యసమితి కార్యాలయాల లోకి బలప్రయోగంతో దూసకువచ్చి ఆస్తులు స్వాధీనం



చేసుకున్నారని, సిబ్బందిని నిర్బంధంలోకి తీసుకున్నారని చెప్పారు. బేషరతుగా తక్షణం వారిని విడుదల చేయాలని హాన్స్ గ్రండ్‌బెర్గ్ డిమాండ్ చేశారు. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు చెందిన ఏడుగురు సిబ్బందిని, యూనిసెఫ్‌కు చెందిన నలుగురు సిబ్బందిని హౌతీలు నిర్బంధించి తీసుకుపోయినట్లు భద్రతాసిబ్బంది చెప్పారు.

**ప్రధాని రహవీ, మంత్రులకు అంత్యక్రియలు**

సనాలో హౌతీ తిరుగుబాటు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో మరణించిన హౌతీ ప్రధానమంత్రి అహ్మద్ అల్–రహవీతోపాటు పలువురు మంత్రులకు సోమవారం యెమెన్‌లో అంత్యక్రియలు జరిగాయి. వంద లాదిమంది ప్రజలు సంతాపం ప్రకటించారు. గడచిన గురువారం ఐడిఎఫ్ దాడుల్లో హౌతీ ఉప–ప్రధానమంత్రి జలాల్ అల్ రోవైషాన్, విదేశాంగమంత్రి జమాల్ అమెర్, సమాచారమంత్రి హషిమ్ షరఫ్ అల్‌దిన్, స్థానిక ప్రభుత్వ మంత్రి అల్ మదానీ, ఆర్థికమంత్రి మునిన్ అల్ మహ్క్రి, న్యాయమంత్రి ముజాహిద్‌అహ్మద్ సహా రవాణామంత్రి, కార్మిక,విద్యా,క్రీడాశాఖలమంత్రులు మొత్తం 10 మంది దాడుల్లో మరణించారు. వారి అంత్యక్రియల సందర్భంగా ప్రజలు పాత్ మసీదువద్ద గుమిగూడి ప్రార్ధనలు చేశారు. హౌతీ అధికారులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అల్–రహవీ గత ఏడాది ఆగస్టు పదో తేదీన తిరుగుబాటుదా రుల ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఏడాదికా లంగా కొనసాగిస్తున్న కార్యకలాపాలపై సమీక్షా కార్యక్ర మంగా నిర్వహించిన సమావేశంలో రహవీ పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం గురిచూసి క్షిపణి దాడి చేసింది. దక్షిణ సనాలోని పురాతన కాల గ్రామం బెయిట్ బావ్స్‌లోని ఒక విల్లాలో సమావేశం జరుగుతుండగా ఐడిఎఫ్ దాడులకు పాల్పడింది. ఈనెల 21న హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై రెండేళ్ళ తర్వాత క్లస్టర్ బాంబులు ప్రయోగించారు. తర్వాత 24న, 28న ఐడిఎఫ్ వరుస దాడులు చేసింది.

ఆక్రమిత కశ్మీరులో

## నేలకూలిన పాకిస్థాన్ హెలికాప్టర్

ఐదుగురు సైనికులు మృతి

**ఇస్లామాబాద్:** ఆక్రమిత కశ్మీరు భూభాగం గిల్గిత్–బాల్టిస్తాన్ ప్రాంతం దయామర్‌జిల్లా ఛిలాస్ టౌన్‌లో పాకిస్థాన్ మిగ్–17 హెలికాప్టర్ కుప్ప కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు సైనికులు మరణించారు. వీరిలో ఇద్దరు అధికారులున్నారని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. థక్‌దాస్ కంటోన్మెంట్ ప్రాంతానికి 12 కి.మీ దూరంలో ఉన్న హుడోర్ గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట ప్రాంతంలో హెలికాప్టర్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో నేలకూలిపో యింది. పైలట్ ఇన్ కమాండ్ మేజర్ అతీఫ్, కో–పైలట్ మేజర్ ఫైజల్, ఫ్లైట్ ఇంజనీర్ నాయబ్ సుబేదార్ ముక్బూల్, హవల్దార్ జహంగీర్, క్రూ చీఫ్ నాయక్ అమీర్ మరణించినవారిలో ఉన్నారు. రోజువారీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నేలమీదకు దిగే ప్రయత్నం చేస్తుం డగా హెలికాప్టర్ కూలిపోయింది. దయామర్ పోలీసులు, సహాయ బృందాలు ఆ ప్రాంతానికి వెళ్ళాయి. ఆగస్టు నెలారంభంలో కూడా వరద సహాయచర్యల్లో భాగంగా ఆహారాన్ని తరలిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడంతో ఐదుగురు మరణించారు. అంతకుముందు 2024లో ఉత్తర వజిరిస్థాన్‌లోని షెవా చమురుక్షేత్రంలో ఉన్న ఒక పెట్రోలియం కంపెనీ హెలికాప్టర్ కూలిపోవడంతో ఆరుగురు మరణించారు.

## ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు టర్కీ కృషి

### పుతిన్‌కు చెప్పిన ఎర్డొగాన్

**అంకారా:** ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు టర్కీ కృషి చేస్తుందని ఆ దేశ అధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పారు. ఇస్తాంబుల్ నగరంలో జరుగుతున్న చర్చల్లో టర్కీ ప్రతిని ధులు ఉక్రేన్‌లో శాశ్వత శాంతి సాధనకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఉక్రేన్ సమస్యకు న్యాయబ ద్ధమైన పరిష్కారం సాధించి, శాశ్వత శాంతి సాధ నకు తమవంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఉత్తర చైనా తియాన్‌జిన్‌లో షాంఘై సహ కారసంస్థ (ఎస్‌సిఓ) సదస్సులో పాల్గొన్న ఎర్డొగాన్ రష్యా నేత పుతిన్‌తో సమావేశమయ్యారు. రెండు రోజుల ఎస్‌సిఓ సదస్సు సోమ వారం రాత్రి ముగిసింది. రష్యా–టర్కీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, అజర్‌బైజాన్, ఆర్మేనియాలో శాంతి ప్రయత్నాలు, గాజాలో పరిస్థితులతోపాటు సిరియాలో పరిస్థితులు, ఉక్రేన్‌లో శాంతి యత్నాల గురించి కూడా ఎర్డొగాన్–పుతిన్ మధ్య చర్చల్లో ప్రధా



నంగా ప్రస్తావనకు వచ్చాయి. టర్కీ అధ్యక్షభ వనం రాజధాని అంకారాలో ఈ మేరకు ఒక ప్రక టన విడుదల చేసింది. ఇజ్రాయెల్ యుద్ధ దాడులలో గడచిన 23 నెలలుగా 220 మంది జర్నలి స్టులు మరణించారు.

సామూహిక హత్యాకాండకు

## ఆచరణాత్మక నిర్వచనమిచ్చిన ఇజ్రాయెల్

**వెనిస్:** సామూహిక హత్యాకాండ అనే పదానికి ఇజ్రాయెల్, దాని సైన్యం గాజాలో ఆచరణాత్మక నిర్వచనం ఇస్తున్నాయని అంతర్జాతీయ చట్టాల నిపుణులు ప్రకటిం చారు. 1948లో ఐక్యరాజ్యసమితి 'జెనోసైడ్' నియంత్రణ, నిర్మూలన కోసం ఈ పదానికి ఒక నిర్వచనం ఇచ్చింది. ఈ నిర్వచనాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చిందని, సామూహిక హత్యాకాండ అంటే ఎంత అమానవీయంగా, ఎంత దారుణంగా, కిరాతకంగా ఉంటుందో కళ్ళకు కట్టినట్టుగా చూపించిందని 500 మంది సభ్యులతో కూడిన ఐఎజిఎస్ స్కాలర్లు ప్రకటించారు. 'జెనోసైడ్' అనే పదానికి ఆచరణాత్మక నిర్వచనాన్ని ఇచ్చిన ఇజ్రాయెల్ అకృత్యాలను పేర్కొంటూ ఈ మేరకు వారుఒక తీర్మానం చేశారు. ఐఎజిఎస్ అనేది 1994లో ఆవిర్భవించింది. ఆనాడు ప్రపంచ మేధావులతో ఇంటర్నేషనల్ జెనోసైడ్ స్కాలర్స్ (ఐఎజిఎస్) పేరుతో ఒక విద్యావేత్తల పీఠం ఏర్పడింది. జెనోసైడ్‌ను నిర్వచించేందుకు, దాని దుర్మార్గాలను అరికట్టేంకు విద్యావేత్తలు దీనిని ఏర్పాటు చేశారు. ఇటలీ నగరం వియన్నాలో ఆగస్టు 30వ తేదీన ఈ విద్యావేత్తల సమావేశంలో 'జెనోసైడ్' నిర్వచనంపై ఇజ్రాయెల్‌ను ఉటంకిస్తూ ఒక తీర్మానం చేశారు. పశ్చిమ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ లా ప్రొఫెసర్, ఐఎజిఎస్ అధ్యక్షురాలు మెలానీ ఓ బ్రియానీ రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, 'జెనోసైడ్' అధ్యయనాలలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణ మానవ మారణహోమం భవిష్యత్‌లో ఒక స్థిరమైన నిర్వచనంగా మిగిలిపో తుందని అన్నారు.

## సమగ్ర నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. వరదలకు తీవ్రంగా నష్టపోయిన జిల్లాల కలెక్టర్లకు తక్షణ ఉపశమనం కింద రూ. 10 కోట్లు, ఇతర జిల్లాల కలెక్టర్లకు రూ.5 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిని వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం అందించాలని ఆదేశించారు.

**నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణ**

రాష్ట్రంలో 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. చిన్న నీటిపారుదల వనరుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్‌ఆర్‌ఆర్, ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని, చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సిఎం సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. నివేదికపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

**పంట నష్టం అంచనా**

రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి వివరాలతో రెండు రోజుల్లో నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సిఎం తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో భవిష్యత్తులో అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమా దం ఉందని, అందువల్ల అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. విపత్తు సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాల సేవలను సిఎం అభినందించారు. వీరికి మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేసి ప్రారంభ తేదీలు నిర్ణయించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు.

## భూకంప విలయం

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రాంతానికి సమీపంగా ఉంటుంది. ఈ ప్రాంతాలన్నీ పర్వతమయం మారుమూల గ్రామాలు, నిస్తంత్రీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. కావడంతో ప్రజలు ఎత్తైన ప్రదేశాలలోనే ఇళ్ళు నిర్మించుకున్నారు. భూకంపంవల్ల ఇళ్ళు ఒకదానిమీద ఒకటి పడి మరింత విధ్వంసం జరిగింది.

కునార్‌లో 610 మంది మరణించగా నాన్‌గర్హార్‌లో 12 మంది మరణించారు. గాయపడినవారిలో ఎక్కువమంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఇంకాచాలామంది సజీవులు శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని తాలిబాన్ ప్రభుత్వం భయాందోళన చెందుతోంది. శిథిలాల నుండి సజీవులను వెలికితీసేందుకు సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. గాయపడినవారిని హెలికాప్టర్లపై సమీపంలో ఉన్న అతిపెద్ద జలాలాబాద్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.47 గంటలకు సంభవించిన భూకంపంలో కునార్ రాష్ట్రంలోని మారుమూల గ్రామాలు నష్టపోయాయి. గాయపడినవారిని జలాలాబాద్ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఐతే కునార్ ప్రాంతం సాంస్కృతికంగా, మతపరంగా మతఛాంధన వాద భావాలు ఉండటంలో ఈ ఆసుపత్రిలో ముందుగా పురుషులకే చికిత్సలు చేస్తున్నారు. ప్రమాద ప్రాంతాల నుండి మహిళలను ఆలస్యంగా తీసుకువెళుతున్నారు. ఆసుపత్రులకు తీసుకువెళ్ళిన మహిళలు చికిత్సలకోసం ఎక్కువ సమయం ఎదురుచూడాల్సి వస్తోందని అక్కడివారు చెప్పారు. కునార్ నదీతీరతీర గ్రామం అస్సదాబాద్‌లో ప్రజలు భయంకర శబ్దాలతో హఠాత్తుగా మేలుకుని బయటకు పరుగులు తీశారు. అర్ధరాత్రి మంచి నిద్రలో ఉండగా భూకంపం తనను భయభ్రాంతులకు గురిచేసిందని, తనశరీరం సగం మేరకు భూమిలోకి కూరుకుపోయిందని నూర్గల్‌లోని మజాదారా ప్రాంత నివాసి సిద్ధిఖీలాల్ చెప్పారు. తన భార్యాపిల్లలు దాదాపు నాలుగు గంటలసేపు బద్దలైన భూమిలోనే కూరకుపోయి ఉండిపోయారని, తర్వాత బయటకు తీశామని చెప్పారు.

ఇదిలా ఉండగా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తాలిబన్ ప్రధానమంత్రి కార్యాలయం ఏర్పాటు చేసింది. అంతేకాకుండా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు 10.8 మిలియన్ పౌండ్లు ఆఫ్గనీస్‌ను కూడా నిధిగా సమకూర్చినట్లు తాలిబన్ ప్రభుత్వ ప్రధాన అధికార ప్రతినిధి జబుహుల్లా ముజహిద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అవసరమైతే ఇంకా ఎక్కువ ధనాన్ని బాధిత కుటుంబాలకోసం కేటాయిస్తామని కూడా చెప్పారు. అంతర్జాతీయ సహాయం ఆఫ్ఘనిస్థాన్‌కు రావడంలో ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ఈ ఏడాది ఆరంభంలో అమెరికా సహాయాన్ని ఆకస్మికంగా నిలిపివేయడంతో ఆఫ్ఘనిస్థాన్‌కు ఈ కష్టకాలంలో ఆర్థిక వనరులు సమకూర్చడానికి చాలా పెద్ద కష్టం వచ్చిపడింది.

**ఐరాస, భారత్,ఇరాన్, జపాన్ తక్షణ సహాయం మృతులకు నరేంద్రమోదీ సంతాపం**

ఈ ప్రకృతి ప్రళయంపై ఐక్యరాజ్యసమితితోపాటు భారతదేశం,జపాన్ కూడా తక్షణం స్పందించాయి. తక్షణ సహాయం ప్రకటించాయి. పలు దేశాలు దీనిని పెనువిషాదంగా ప్రకటించాయి. ఐక్యరాజ్యసమితి, యూనిసెఫ్ హుటాహుటిన సహాయ చర్యలకు దిగాయి. అఫ్ఘానిస్థాన్‌కు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ వేరువేరుగా ఎక్స్ వేదికగా తీవ్ర సంతాపాలు ప్రకటించారు. వైద్య,మానవతాసహాయం అందజేస్తామని తెలిపారు.ఈ సంక్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మోదీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇరాన్ ప్రభుత్వం కూడా తక్షణ మానవతా సహాయాన్ని ప్రకటించింది. బాధితులకు తక్షణ వైద్య,మానవతా సహాయం అందజేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. యూనిసెఫ్ దళాలు దగ్గరలోనే ఉన్నాయని, రహదారి మార్గంలో తమ బృందాలు హుటాహుటిన సహాయం నిమిత్తం భూకంప ప్రాంతాలకు తరలి వెళ్ళాయని, వందలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయని కాబూల్‌లోని యూనిసెఫ్ కార్యాలయం ప్రతినిధి సలామ్ అల్ జనాబీ చెప్పారు. ఈ తరుణంలో పిల్లల సంరక్షణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం వంటి విషయాలకు యూనిసెఫ్ ప్రాధాన్యం ఇస్తుందని ఆయన చెప్పారు.

**భూవిలయాలకు అఫ్ఘానిస్థాన్ నిలయం**

అఫ్ఘానిస్థాన్‌లో కునార్ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. భూకంపాలకు, వరదలు,ఇతర ప్రకృతి వైపరీత్యాలకు ఇది కేంద్రంగా మారింది. 2022 జూన్‌లో అఫ్ఘానిస్థాన్‌లో సంభవించిన భూకంపం తర్వాత అతిపెద్ద భూప్రళయ ఘటన ఇదే. ఆనాడు రిచ్‌టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో నమోదైన భూకంపంలో 1000 మందిపైగా ప్రజలు మరణించారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హీరాత్ రాష్ట్రంలో 6.3 తీవ్రతతో సంభవించిన పెనుభూకంపంవల్ల దాదాపు4000 మందిపైగా మరణించారని తాలిబన్ ప్రభుత్వం అంచనావేసింది. ఐక్యరాజ్యసమితి మాత్రం 1,500 మంది మరణించినట్లు ప్రకటించింది. తీవ్ర భూకంపాలు సంభవిస్తే దాదాపు అఫ్ఘానిస్థాన్ దేశం అంతటా ఎక్కడా సురక్షితమైన ప్రాంతం లేదని భూగర్భశాస్త్ర నిపుణులు చెప్పారు.

## ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్తంగా ఎదుర్కోవడానికి ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్ట సూత్రాలకు అనుగుణంగా సంబంధిత ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని అమలు చేయాలని తెలిపింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రధాన సవాల్‌గా మారిందని ఎస్‌సీఓ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

**అతిపెద్ద సదస్సు ఇదే!**

షాంఘై సహకార సంస్థ అనేది 10 సభ్య దేశాల కూటమి. ఇందులో భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ ఉన్నాయి. ఏటా ఓ దేశం అధ్యక్ష బాధ్యతలు వహిస్తుండగా, ఈ సారి ఎస్‌సీఓ ప్లస్ సమ్మిట్‌ను చైనా భారీగా నిర్వహించింది. ఈ సదస్సులో టర్కీ, ఇండోనేసియా, మలేసియా, వియత్నాం, నేపాల్, మాల్దీవుల నేతలు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ అంతర్జాతీయ సంస్థల అధికారులు పాల్గొన్నారు. దీంతో ఎస్‌సీఓ చరిత్రలోనే అత్యంత గొప్పగా ఈ సదస్సును నిర్వహించినట్లయింది.

**ఉగ్రవాదం మానవాళికి ఉమ్మడి సవాల్ : ప్రధాని మోదీ**

చైనాలోని టియాంజిన్‌లో జరుగుతున్న ఎస్‌సీవో వేదికగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ వైఖరిని ఎండగట్టారు. పాక్ పేరు ప్రస్తావించకుండా కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతిచ్చాయని దుయ్యబట్టారు. పాక్ ప్రధాని షెహబాజ్ సమక్షంలోనే ఆ దేశ వైఖరిని తప్పుబట్టారు మోదీ. ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. ఉగ్రవాద సమస్యతో భారత్ నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ఏ దేశానికైనా భద్రత, శాంతి, స్థిరత్వం



అనేవి అభివద్ధికి పునాదులని మోదీ పేర్కొన్నారు. ''ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించింది. ఉగ్రవాద సమస్యలతో భారత్ 4 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోంది. ఎస్‌సీవో సభ్యులుగా భారత్ కీలక భూమిక పోషిస్తోంది. ఎస్‌సీవో కోసం భారత్ విజన్, పాలసీ 3 పిల్లర్లపై ఆధార పడి ఉంది. భద్రత, అనుసంధానం, అవకాశాలు 3 పిల్లర్లుగా నిలుస్తాయి. ఉగ్రవాదం, వేర్పాటు వాదం సవాళ్లుగా మారాయి. ఇటీవల పహల్గాం దాడి ఉగ్రవాదుల పైశాచికత్వాన్ని చాటింది. పహల్గాం దాడి వేళ భారత్‌కు మద్దతుగా నిలిచిన దేశాలకు కతజ్ఞతలు'' అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం పెద్ద సవాళ్లుగా మారాయని మోదీ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం ఒక దేశ భద్రతకు మాత్రమే సవాలు కాదని, మానవాళి మొత్తానికీ ఉగ్రవాదం ఉమ్మడి సవాలని అన్నారు. ఉగ్రవాదంతో ఏ దేశం, ఏ సమాజం, ఏ పౌరుడూ సురక్షితం కాదని తెలిపారు. అందుకే ఉగ్రవాదంపై పోరులో దేశాలన్నీ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. అల్‌ఖైదా, అనుబంధ సంస్థలతో పోరులో భారత్ చొరవ చూపిందని, ఉగ్రవాదులకు ఆర్థిక సహకారానికి వ్యతిరేకంగా భారత్ గళం వినిపించిందన్నారు.

**ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరం**

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల కోసం ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. అనుసంధాన ప్రక్రియలో దేశాల సౌరభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. చైనా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు చైనాలోని టియాంజిన్ వేదికగా 25వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు అధికారికంగా ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహ వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. సదస్సు ప్రారంభ సమయంలో పుతిన్‌ను ప్రధాని మోదీ ఆత్మీయంగా పలకరించారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆలింగనం చేసుకున్నారు. ఆ చిత్రాలను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పుతిన్‌ను కలవడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుందని రాసుకొచ్చారు. జిన్‌పింగ్, పుతిన్‌తో సంభాషించిన చిత్రాలను కూడా పంచుకున్నారు. ఆ తర్వాత వారు ఎస్‌సీఓ సభ్యుల గ్రూప్ ఫొటో కోసం వేదిక వైపు నడిచారు.

**పాక్ ప్రధానిని పట్టించుకోని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ కలిసి వెళ్తుండగా అక్కడ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే నిల్చున్నప్పటికీ, మోదీ ఆయనను పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయారు. సమావేశంలో చాలా సందర్భాల్లో మోదీ, పాక్ ప్రధానిని పట్టించుకోకుండా దూరంగా ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మోదీ పాక్ ప్రధానిని పట్టించుకోలేదు.

## సహించం

(మొదటి పేజీ తరువాయి)

పిక్కటిల్లేలా నినదించారు.

**అవినీతిలో నితీశ్ భీష్మ పితామహుడు : తేజస్వీ**

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. అవినీతిలో 'భీష్మ పితామహుడు' అని అన్నారు. బిహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తేజస్వీ బహిరంగంగా విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్ సహాయంతో ఇద్దరు బిజెపి నాయకులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. 'బిహార్ ముఖ్యమంత్రికి స్పృహ లేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని అధికారం నుండి తరిమివేస్తారు' అని తేజస్వి పేర్కొన్నారు.

## సిబిఐ విచారణ


(మొదటి పేజీ తరువాయి)

సముచితమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల' బ్యారేజీల నిర్మాణం'పైన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక'పైన శాసనసభలో ఆదివారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. ఊరు,పేరు,అంచనాలు మార్చి డబ్బులు దోచుకున్న వారిని శిక్షించాలని భావిస్తున్నామని, రీ డిజైన్ పేరుతో తుమ్మడిహట్టిని మేడిగడ్డకు మార్చి, రాష్ట్రానికి గుదిబండగా మార్చిన కెసిఆర్‌ను,హరీశ్ రావును శిక్షించాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నిం చారు. జస్టిస్ పి.సి ఘోష్ కమిషన్ నివేదికలో ఏమైనా లోపాలుంటే ప్రస్తావించాలని, కానీ జస్టిస్ పిసి ఘోష్‌ను తక్కువ చేసి మాట్లాడటం ఏ రకంగా సరికాదని మండిపడ్డారు. అధిక వడ్డీలు తెచ్చి రాష్ట్రంపై మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. 2015లో రీడిజైన్ పేరుతో కెసిఆర్ మదిలో పడిన బీజం విషవృక్షంగా మారి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందన్నారు. జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్ తమ నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించిందని, నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి అనేక అంశాలను ప్రస్తావించిందని సిఎం వివరించారు. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని, అసలు ప్లానింగ్ లేదని కమిషన్ స్పష్టం చేసిందన్నారు.

## హైడ్రోజన్ బాంబు పేలుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

విలేకరులుతో చెప్పారు. ఆ తరువాత ప్రాంతం నిషేధిత ప్రాంతమైనందునే యాత్రను మధ్యలోనే నిలిపివేసినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ 14 రోజుల పాటు నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపుగా సోమవారం ఆ పాదయాత్రను చేపట్టారు. రానున్న రాష్ట్ర ఎన్నికలకు ముందు 38 జిల్లాల్లో 25 జిల్లాలను కలుపుకొని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా ఓట్ అధికారక్ యాత్ర సాగింది. కాగా రాహుల్ మాట్లాడుతూ బిహార్ ఒక విప్లవాత్మక రాష్ట్రం అని, అది దేశానికి ఒక సందేశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. తాము రాజ్యాంగాన్ని ఖూనీ చేయనీయబోమని, అందుకే యాత్ర చేపట్టామన్నారు. తము చేపట్టిన ఈ యాత్రకు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి 'ఓటు చోర్ గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. తాను బిజెపికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నానని... 'మీరు అణు బాంబు కంటే పెద్దది ఏదైనా విన్నారా, అదే హైడ్రోజన్ బాంబు. బిజెపి శ్రేణులారా సిద్ధంగా ఉండండి, హైడ్రోజన్ బాంబు వస్తోంది. ఓటు చోరీ వాస్తవికతను ప్రజలు త్వరలో తెలుసుకోబోతున్నారు' అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఆ తరువాత మోదీ దేశ ప్రజల్లో తలెత్తుకోలేరన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దొంగిలించబడ్డాయని అన్నారు. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటులోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 'ఓటు చోరీ' ఎలా జరిగిందో తమ పార్టీ ఆధారాలతో సహా చూపించిందని చెప్పారు. బిహార్ యువతకు తాను




చెప్పాలనుకుంటున్నానని.... ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అని, మీ రేషన్ కార్డుతో పాటు ఇతర హక్కులను లాక్కుంటారని రాహుల్ ఆరోపించారు.

**బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాయలో నితీశ్: ఖర్గే**

జెడి(యు) అధినేత ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడేవారని, కానీ ఆ తర్వాత బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ఉచ్చిలో పడిపోయారని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రజలు ఆయనను చెత్తకుండీలో విసిరివేస్తారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఓటు చోరీ' (ఓట్ల దొంగతనం) ద్వారా గెలవడానికి ప్రయత్నిస్తున్నారని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం త్వరలో ఓడిపోతుందని ఖర్గే ఉద్ఘాటించారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులతో కూడిన కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడిన నితీశ్‌కు ఇప్పుడు ఆ సోషలిస్ట్ ఆలోచనలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. ఓటరు అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, దానిని భంగపరిచే ప్రయత్నాలు జరిగినా, బిహార్ ప్రజలు, మహాఘట్బంధన్ వెనక్కి తగ్గలేదన్నారు.

**ఎస్‌ఐఆర్ పేరుతో హక్కులు లాక్కుంటున్నారు : హేమంత్**

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) పేరుతో ప్రజల హక్కులను లాక్కుంటున్నదని, పాలక సంకీర్ణం ఇష్టానుసారం ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నారని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మండిపడ్డారు. ఎన్‌డిఎ ప్రభుత్వం 'విభజించి పాలించు' విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించారు. పాలక కూటమిని అధికారం నుండి తొలగించేందుకు అన్ని భారత కూటమి నియోజకవర్గాలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'మన ఓటు మన రాజ్యాంగాన్ని రక్షిస్తుంది. కాపాడుతుంది. మీ ఓటు ఒక పార్టీకి చెందినది కాదు; అది దేశం కోసం. ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాలి' అని ఆయన అన్నారు. ప్రతిపక్ష నాయకులపై బిజెపి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ, ఇతర కేంద్ర సంస్థలను ఉపయోగిస్తోంది అని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తనను జైలుకు పంపారని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో జైలు నుండి బయటకు వచ్చినప్పుడు, తాము జార్ఖండ్ భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తాను జైలు నుండి బయటకు వచ్చి ఉంటే, వారు (బిజెపి) పార్లమెంటరీ ఎన్నికల్లో జార్ఖండ్ రాష్ట్రంలో ఖాతాలను తెరిచి ఉండేవారు కాదన్నారు.



జనరల్
STATE & REGIONAL NEWS

## 'పాత పెన్షన్'ను పునరుద్ధరించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక సంవత్సరంలోపు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని టిజిఇజెఎసి 'పాత పెన్షన్ పోరాట సాదన సభ' తీర్మానించింది. 2004 సంవత్సరంలో 'సెప్టెంబర్ 1న' సిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిన రోజు సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో టిజిఇజెఎసి ఆధ్వర్యంలో 'పాతపెన్షన్ పోరాట సాధన సభ' నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి శ్రీపాల్ రెడ్డి, టిజిఇజెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాస్ రావు, ఎస్‌టియు అధ్యక్షులు సదానందగౌడ్, యుటిఎఫ్ అధ్యక్షులు చావరవి, సిపిఎస్ యూనియన్ అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ జెఎసి తీసుకున్న నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ సిపిఎస్‌లో రద్దుచేసి, షేర్ మార్కెట్‌కు ప్రతినెలా తరలి వెళ్లే రూ.450 కోట్లను ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ఏలూరు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిందని అన్నారు.

# ఓట్ల తొలగింపు అధికారం ఎవరికీ లేదు

ఆ హక్కు రాజ్యాంగపరంగా చట్టం ద్వారా సంక్రమించింది
రాజ్యాంగబద్ధ పదవులను రాజకీయ పదవులుగా మారుస్తూ ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారు
టియుడబ్ల్యుజె మీట్ ది ప్రెస్‌లో ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఒకటైన ఉపరాష్ట్ర పతి ఎన్నికనైనా ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహిస్తుందని ఆశిస్తున్నానని ప్రతిపక్షాల ఉపరాష్ట్ర పతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీల ఎంపిలను కలిసి ఓటు అభ్యర్థించనున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ, తెలుగు బిడ్డగా తాను ఈ ఎన్నికలో పోటీ చేస్తున్న నేపథ్యంలో తెలుగుజాతి ఔనత్యాన్ని చాటుతున్న టిడిపి అధినేత, ఎపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, తెలంగాణే ఉచ్వాస, నిస్వాసగా భావించే తెలంగాణ మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావును కలిసి మద్దతు కోరనున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డితో మీట్ ది ప్రెస్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్దారకభవన్‌లో జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నుంచి తొలగించే అధికారం ఈ దేశంలోని ఎవరికీ లేదని, ఎందుకంటే ఆ హక్కు రాజ్యాంగ పరంగా చట్టం ద్వారా సంక్రమించిందని చెప్పారు. దేశంలో పాలకులు రాజ్యాంగబద్ధ పదవులను రాజకీయ పదవులుగా మార్చివేయడమే కాకుండా ఎన్నికల ప్రక్రియను సైతం అపహాస్యం చేస్తూ తమ ఇష్టానుసారంగా మలుచుకుంటున్నారని అన్నారు. దేశంలోని రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన అన్ని సంస్థలను పాలకులు ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తున్నారని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కొత్త కొత్తగా అధికారులు ఎవరికి ఇవ్వలేదని, ఉన్న అధికారులపై నియంత్రణ మాత్రమే ఇచ్చిందన్నారు. ఒకవేళ అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలకుంటే దానిపై విస్తృతస్థాయిలో చర్చలు, సంభాషణల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని, కానీ క్రమక్రమంగా ఇవి కనుమరుగైనా మోజార్టీ ఉంటే చాలు ప్రభుత్వం తాము ఏమైనా చేయవచ్చు అనే స్థితి వచ్చిందన్నారు. ఇది ప్రజాసామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్దమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. యాజమన్యాల ఒత్తిడి, ఇతర కారణాలో తెలియదు కానీ జర్నలిస్టులు సైతం ప్రశ్నించడం, సమాజాన్ని విశ్లేషించడం, అధ్యయనం చేయడం మరిచి పోయారని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు.



## మరింత మెరుగైన పారదర్శక సేవలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజలకు మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించడానికి వీలుగా అవినాభావ సంబంధం కలిగిన రెవెన్యూ, స్టాంప్స్,రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను అనుసంధానం చేసేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్‌ను జతచేయాలని భూభారతి చట్టంలో పొందుపర్చామని, దీనిని దృష్టిలో పెట్టుకుని భూభారతి పోర్టల్ సర్వే మ్యాప్ లింక్ చేసేలా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగం, ఎన్ఐసి అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి పోర్టల్‌లో ఎటువంటి సాంకేతిక సమస్యలు రాకుండా పోర్టల్ నిర్వహణ మరింత సులభతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఐసి అధికారులకు సూచించారు. కొత్తగా అభివృద్ధి చేసే సాఫ్ట్‌వేర్‌లో కోర్టు కేసుల మానిటరింగ్ విధానం ఉండేలా చూడాలన్నారు. నక్షా లేని ఐదు గ్రామాలలో రీసర్వే కొలిక్కివచ్చిన నేపథ్యంలో మిగిలిన 408 గ్రామాల్లో మరి కొద్దిరోజుల్లోనే రీ సర్వేను ప్రారంభించబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో భూవివాదాల పరిష్కారానికి ఈ సర్వే మార్గదర్శకంగా ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్,రిజిస్ట్రేషన్ ఐ.జి రాజీవ్‌గాంధీ హనుమంతు, సిసిఎల్‌ఎ కార్యదర్శి మంధా మకరంద్. ఎన్.ఐ.సి. ఎస్.ఐ.ఒ ప్రసాద్, విజయమోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు కృషి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసి దేశానికే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజా భవన్‌లో సోమవారం జరిగిన మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలవారు తెలంగాణకు వచ్చి ఇక్కడ మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసే పరిస్థితిని కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి రూ. 122 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలకు అప్పగించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు వారికి సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి, ఆ తర్వాత వాటి నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, తద్వారా వారికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యం..**

రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మొదటి సంవత్సరంలోనే అంచనాలకు మించి రూ. 21,600 కోట్లు పంపిణీ చేసినట్టు ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామన్నారు.

**గత పదేళ్లు మహిళా సంఘాలను గాలికి వదిలేశారు..**

గత 10 సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారని భట్టి విక్రమార్క మల్లు విమర్శించారు. ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్‌లో మహిళల వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందని, హైటెక్ సిటీ సమీపంలోని శిల్పారామం వద్ద మహిళా సంఘాలకు విలువైన స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రపంచంతో పోటీ పడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, షెర్ఫ్ సిఈఓ దివ్య పాల్గొన్నారు.


# ఘోష్ కమిషన్ రిపోర్టుపై చర్యలేమిటి?

రాష్ట్రాన్ని వివరణ కోరిన హైకోర్టు
చర్యలు తీసుకోకుండా ఉత్తర్వుల జారీకి నిరాకరణ
విచారణ నేటికి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టుపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళ్లనుందో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు వివరణ కోరింది. రిపోర్టుపై చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నారా లేక తీసుకుంటారా, ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదా.. ఏదోకటి స్పష్టం చేయాలంది. మంగళవారం జరిగే విచారణ సమయంలో చెప్పాలంది. అప్పటి వరకు కమిషన్ రిపోర్టుపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మాజీ సీఎం, బిఆర్‌ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్ రావు తరఫు లాయర్లు చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. అసెంబ్లీలో కమిషన్ రిపోర్టు ప్రవేశపెట్టాక చర్చ చేసినప్పటికీ రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకోకుండా స్టే ఆదేశాలు ఇవ్వాలంటూ వారిద్దరూ మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్ల ధర్మాసనం ఎదుట వారిద్దరి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్లు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదించారు. పిటిషన్ గురించి లేవెత్తి అత్యవసరంగా విచారణ చేయాలని కోరారు. కమిషన రిపోర్టుపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ అర్ధరాత్రి వరకు జరిగిందన్నారు. నివేదికపై చర్యల గురించి అసెంబ్లీ తీర్మానం చేయకుండానే ముగించిందన్నారు.

అయితే, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు నిర్ణయం తీసుకుంటున్నట్లు సీఎం అసెంబ్లీలోనే ప్రకటించారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈరోజే మధ్యాహ్నం విచారణ చేపట్టాలని కోరారు. పోలీసు చట్టం సెక్షన్ 62 కింద దర్యాప్తు నిమిత్తం ప్రభుత్వం జీవో చేసేలోగానే విచారణ పూర్తి చేసి స్టే ఇవ్వాలని కోరారు. జీవో వచ్చాక పిటిషన్లు దాఖలు చేసి చేస్తున్న న్యాయపోరాటానికి ఫలితం ఉండదన్నారు. అసెంబ్లీలో చర్చిస్తామని ప్రభుత్వం చెప్పిందని, చర్యలు తీసుకోబోమని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చినదానికి భిన్నంగా చర్యలు ఉన్నాయన్నారు. దీనిపై హైకోర్టు, ఆందోళన కనబడుతోందని వ్యాఖ్య చేసింది. దీనిపై అడ్వొకేట్లు స్పందిస్తూ, ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చని, ఇవ్వకపోయినా రిపోర్టుపై చర్యలు ఉంటాయని సీఎం అసెంబ్లీలోనే ప్రకటించారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపరులను వదిలిపెట్టబోమని కూడా హెచ్చరించారని చెప్పారు. విచారణను ఒకటి రెండు రోజులు వాయిదా వేయాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంపై స్పందిస్తూ, అప్పటి వరకు స్టే ఇవ్వాలని వారు కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ వివరణ వచ్చాక పరిశీలిస్తామని ప్రకటించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## వయోధిక పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : వయోధిక పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి వయోధిక పాత్రికేయుల సంఘం వినతిపత్రం సమర్పించింది. సంఘం ప్రతినిధులు ఈ మేరకు ఒక విజ్ఞప్తిని అందజేశారు. సంఘం కార్యదర్శి లక్ష్మణరావుతో పాటు సీనియర్ జర్నలిస్టులు వేణుగోపాల్, ఫాజిల్, మల్లయ్య, మధు వాకిటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక భద్రత లభిస్తుందని, తద్వారా వారు గౌరవప్రదమైన జీవితం గడపవచ్చని ప్రతినిధులు పేర్కొన్నారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## కెసిఆర్, హరీశ్ రావులకు ఇక జైలే..

టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి, లక్ష కోట్లు దోచుకున్న కెసిఆర్, హరీశ్ రావు, ఇతర బిఆర్‌ఎస్ నాయకులకు ఇక మిగిలింది జైలు మాత్రమేనని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ కుంభకోణంపై సిబిఐ విచారణకు ఆదేశించడం ద్వారా, సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసాధారణమైన నిర్ణయం తీసుకున్నదన్నారు. కెసిఆర్ కుటుంబీకులు దోచుకున్న లక్ష కోట్లను తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టం కింద తిరిగి వసూలు చేస్తుందని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్, హరీశ్‌రావులు ఏ తప్పు చేయకుంటే.. స్టే కోసం కోర్టును ఎందుకు ఆశ్రయించారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్, హరీశ్‌రావులు వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేసి, అమరవీరుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని బండి సుధాకర్ గౌడ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్‌ఎస్‌ను బీజేపీ కాపాడుతున్నదని, ఇవి రహస్య మిత్రులని, అవినీతి వ్యవహారాల్లో ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని, ఈ నిజాన్ని ప్రజలు తెలుసుకోవాలని బండి సుధాకర్ కోరారు.

# నడిగడ్డ, పాలమూరుకే కాదు.. రాష్ట్రానికే గర్వకారణమైన కమ్యూనిస్టు నాయకుడు సురవరం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : నడిగడ్డ నుండి దేశ నలుమూలల వరకు సురవరం చేసిన కృషిని మరువలేమని సమాజంలో మార్పు కోసం మన వంతు పాత్ర పోషించినప్పుడే సురవరం సుధాకర్ రెడ్డికి మనమిచ్చే ఘనమైన నివాళులని, దేశంలోనే మచ్చలేని కమ్యూనిస్టు నాయకుడని పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరి ఎవరు చేసి ఉండరని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కొనియాడారు. సోమవారం నాడు సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామమైన గద్వాల జిల్లా కంచుపాడులో ఆయన సంస్మరణ సభ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఏఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణ తదితర నాయకులు సుధాకర్ రెడ్డి చేసినటువంటి త్యాగాలను పోరాటాలను కొనియాడారు. అది నడిగడ్డ పాలమూరు వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఆయన రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఉండి, లేబర్ కమిటీ చైర్మన్‌గా ఈ దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రయత్నం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్య దర్శి ఆంజనేయులు, నాగర్‌కర్నూలు జిల్లా కార్యదర్శి ఫయాజ్ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు నారాయణ పేట జిల్లా కార్యదర్శి నరసింహులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ ఏఐటియుసి రాష్ట్ర నాయకురాలు ప్రేమ్ పావని, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఆనంద్ జి, కర్నూలు జిల్లా సిపిఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం, ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రజా సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలెప్పుడు?

ప్రభుత్వ వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని పాలకవర్గాల గడువు పూర్తి అయిన మున్సిపాల్టీలకు ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) చప్పింది. అయితే, ఎన్నికలకు ముందుకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు లభిస్తే తాము ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేసింది. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 195 ప్రకారం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే, ఎన్నికల నిర్వహణకు అవసరమైన తగిన సమయాన్ని తీసుకుని ఎన్నికలు జరపగలమని ఎస్ఈసీ లాయర్ సోమవారం హైకోర్టుకు చెప్పారు. మున్సిపాల్టీల్లోని వార్డుల విభజన, మున్సిపాల్టీల ఏర్పాటు వంటివి ప్రభుత్వం చేసి తుది జాబితా ఎస్ఈసీకి ఇవ్వాల్సివుందని చెప్పారు. నిర్మల్ మున్సిపాల్టి పాలకవర్గం గడువు ఈ ఏడాది మార్చి 25తో ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. రాజ్యాంగంలోని 243యు, 243జెడ్.ఎ అధికరణాల ప్రకారం పాలకవర్గాల గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలని పిటిషనర్ వాదన. దీనిపై ఎస్ఈసీ లాయర్ స్పందిస్తూ, నిర్మల్ మాత్రమే కాదని, రాష్ట్రంలో పాలకవర్గాల గడువు అయ్యాక ఎన్నికలు జరపాల్సిన అన్ని మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే, ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వ వైఖరిపై మంగళవారం విచారణ చేస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

# పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులకు శాసనమండలి ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్ : 'తెలంగాణ రాష్ట్ర పంచాయత్‌రాజ్ సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లు'లను శాసనమండలి సోమవారం ఆమోదించింది. కాళేశ్వరంపై సిబిఐ విచారణను వ్యతిరేకిస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో బిల్లులపై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే సభ ఆమోదం తెలిపింది. అనంతరం సభను శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధికంగా వాయిదా వేశారు. అంతకు ముందు శాసనమండలిలో తొలుత పంచాయతీరాజ్ శాఖమంత్రి దనసరి అనసూయ సీతక్క పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెట్టగా, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లును, శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం పంచాయతీరాజ్ బిల్లుపై జరిగిన చర్చలో ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న మాట్లాడుతుండగా బిఆర్‌ఎస్ సభ్యులు కాళేశ్వరంపై సిబిఐ విచారణను వ్యతిరేకిస్తూ, కాళేశ్వరంపై సభలో చర్చించాలని పట్టుబట్టారు. దీంతో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ శాసనసభలో జరిగిన చర్చకు శాసనమండలికి సంబంధం లేదని, శాసనసభలో జరిగిన అంశాలను ఇక్కడ ప్రస్తావించవద్దని సూచించారు. బిఆర్‌ఎస్ సభ్యులకు ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. ''కాళేశ్వరం కమిషన్ బూటకం, సిబిఐతో దోస్తీ బిజెపితో కుస్తీ, కాంగ్రెస్ బిజెపి నాటకం, 'రాహుల్‌కి సిబిఐ వద్దు, రేవంత్‌కి సిబిఐ ముద్దు'' అంటూ నినాదాలు చేస్తూ 'పిసి ఘోష్ కమిషన్ రిపోర్ట్ నివేదిక'ను చింపేసి, వాటిని ఛైర్మన్‌పై విసిరేశారు. దీంతో బిఆర్‌ఎస్ సభ్యుల తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దల సభలో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారన్నారు. తప్పు చేయనప్పుడు విచారణను ఎదుర్కొనేందుకు భయం ఎందుకని, విచారణ ఎదుర్కొంటామని చెప్పి, ఇప్పుడు ఎందుకు భయపడుతున్నారని ఆయన నిలదీశారు. కావాలనే బిసి రిజర్వేన్ బిల్లును బిఆర్‌ఎస్ అడ్డుకుంటోందని పొన్నం విమర్శించారు. అయినప్పటికీ బిఆర్‌ఎస్ సభ్యులు వినకపోవడంతో గందరగోళం మధ్యనే బిల్లులను శాసనమండలి ఆమోదించింది. బిఆర్‌ఎస్ సభ్యులు పోడియం నుంచి తమ తమ స్థానాలకు వెళ్లాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పదే పదే సూచించినప్పటికీ వారు నిరసనను కొనసాగించారు. దీంతో సభను ఛైర్మన్ నిరవధికంగా వాయిదా వేశారు.

**బిజెపి, బిఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిల 42 శాతం రిజర్వేషన్‌లకు సహకరించాలి : ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**

బిజెపి, బిఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకిగా ఉన్న పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు తాము సంపూర్ణంగా మద్దతిచ్చామన్నారు. బిసిలకు 23 శాతం ఉన్న రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన బిల్లు తీసుకొందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా అణచివేతకు గురవుతున్న బలహీన వర్గాలకు న్యాయం చేసే బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బిఆర్‌ఎస్ ఆందోళనకు దిగడం దురదృష్టకరమని మండిపడ్డారు. అన్ని రాజకీయ పక్షాలు బిసి బిల్లుకు మద్దతు ఇవ్వాలని, ఈ విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్‌లు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

**కాళేశ్వరంపై విచారణ జరగాల్సిందే..**

పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం అద్భుతమని చెప్పారని నెల్లికంటి సత్యం అన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించకుండా తన ఫామ్‌హౌజ్ పక్కనే కాళేశ్వరం కట్టుకున్నారని విమర్శించారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో గ్రావిటి ద్వారా నీళ్లు వచ్చే ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, దీనిని ఒక ఎటిఎంగా మార్చుకున్నారని మండిపడ్డారు. కాగ్ నివేదిక కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మాయంగా మారిందన్నారు. కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తం : టిపిసిసి ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు నమ్మి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించారని తెలిపారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్కలతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే సిబిఐకి అప్పగించామని అన్నారు. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కెసిఆర్ మొహం చాటేశారని ఎద్దేవా చేశారు. బిసి బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోందన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకమని విమర్శించారు. మండలిలో బిసి బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు నానా హంగామా చేశారని మండిపడ్డారు. బిజెపి తరహాలోనే బిఆర్‌ఎస్ కూడా బిసిలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.

**బిసిలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ బిల్లు తెచ్చింది : తీన్మార్ మల్లన్న**

కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గతంలో 32 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం బిల్లును ప్రవేశపెడితే హైకోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని, ఇందిరా సహాని కేసు, హైకోర్టు, సుప్రీంకోర్టుల కేసులతో బిసి బిల్లు అమలయ్యే పరిస్థితులు లేవని ఆయన చెప్పారు.

**తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయం : మెదక్ జిల్లా**
ఇ-మెయిల్: municipalitytoopran@gmail.com ఫోన్: 9849069769/9490066885/9866296751

Lr.No.E1/79/2025 కొటేషన్ టెండర్ నోటీసు తేది: 01.09.2025

మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా తూప్రాన్ మున్సిపాలిటీలోని బతుకమ్మ ఘాట్స్ వద్ద **బతుకమ్మ & దసరా పండుగల ఏర్పాట్ల పనులు** అనగా బ్లింకింగ్ లైట్లు, టెంట్లు, ఫ్లడ్ లైట్లు, VIP కుర్చీలు, గ్రీన్ కార్పెట్, రౌండ్ టెంట్, సౌండ్ బాక్స్, జనరేటర్, స్టేజ్ అన్ని టెంట్ హౌస్ వస్తువులు మరియు ఎంగేజింగ్ JCB, కలరింగ్ స్టెప్స్ నిమిత్తం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ & ఏజెన్సీల నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనవి. **కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ సమర్పించు ప్రారంభ తేదీ :** 02.09.2025న ఉ.11.25గం.లకు, **కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేదీ :** 06.09.2025 సా.3.10గం.ల వరకు, **బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 06.09.2025న మ.3.25గం.ల వరకు, **కొటేషన్ బిడ్ ప్రారంభ తేదీ (ఆర్థిక బిడ్ దశ):** 06.09.2025 మ.3.40గం.లకు. మరిన్ని వివరాలు మరియు వివరణలను అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్, తూప్రాన్ మున్సిపాలిటీ నుండి పొందవచ్చు.

సం/- మున్సిపల్ కమిషనర్
తూప్రాన్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7451-PP/CL/ADVT/1/2025-26, Date: 01-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## మియాపూర్, ఉప్పల్ వర్క్ షాప్‌ల తరలింపు మానుకోవాలి

నేటి నుండి నల్లబ్యాడ్జీలతో నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెంట్రలైజేషన్ పేరుతో మియాపూర్, ఉప్పల్ వర్క్‌షాప్‌లను కరీంనగర్ వర్క్‌షాప్‌కు తరలించడాన్ని నిరసిస్తూ, నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆర్‌టిసి యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. బాబు, ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసి ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు లీజులకు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్‌టిసి ఆస్తులను ఒక్కటొక్కటిగా ప్రైవేట్‌పరం చేస్తోందని విమర్శించారు. మియాపూర్‌లో 18 ఎకరాల స్థలంలో ఉన్న బస్ బాడీ యూనిట్‌లో 155 మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ కొత్త బస్సులను తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలకు సరఫరా చేస్తారని తెలిపారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

## దివ్యాంగుడైన రామకృష్ణకు దక్కిన కారుణ్య నియామకం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కారుణ్య నియామకం కోసం 18 ఏళ్లుగా పోరాడుతున్న ఓ దివ్యాంగుడికి తెలంగాణ ప్రభుత్వం న్యాయం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, ఆ కుటుంబం తమ కృతజ్ఞతను వ్యక్తం చేసింది. కొత్తగూడెం జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో పనిచేసిన కర్నాటి నాగేశ్వరరావు 2007లో అనారోగ్యంతో మరణించారు. అప్పటికి ఆయనకు భార్య రాణి, కుమారులు రామకృష్ణ (దివ్యాంగుడు), కోటేశ్వరరావు ఉన్నారు. తండ్రి మరణించే సమయానికి 21 సంవత్సరాలు ఉన్న రామకృష్ణ, కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అనేక కారణాల వల్ల ఆయనకు ఉద్యోగం దక్కలేదు. దీంతో, ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, 2013 అక్టోబర్‌లో రామకృష్ణకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కానీ ఆ తర్వాత కూడా ఆయనకు ఉద్యోగం రాలేదు. 2023 డిసెంబర్‌లో ప్రారంభించిన ప్రజాదర్బార్‌లో రామకృష్ణ తన దరఖాస్తును మళ్లీ సమర్పించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తుంది. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి, రామకృష్ణ అర్హతలను పరిశీలించారు. చివరగా, ముల్కలపల్లి మండలంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాదర్బార్ ద్వారా తనకు న్యాయం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కవిత అంగీకరించారు

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షంజ/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కవిత వ్యాఖ్యలతో తేలిపోయిందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవిత వ్యాఖ్యలతో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయిందని ఆయన అన్నారు. కాళేశ్వరంలో తప్పు చేసింది కెసిఆరా, హరీశ్ రావా అనేది మాకు అనవసరం వారి హయాంలో స్కాం జరిగిందనేది స్పష్టం .. కవిత కూడా ఇప్పుడు అదే చెప్పిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో మామ కెసిఆర్ వాటా ఎంత..? అల్లుడు హరీశ్ రావు వాటా ఎంత..? అనేది తేలాల్సి ఉందన్నారు. కెసిఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట ఫైనల్ కి చేరిందన్నారు. కుటుంబ కలహాలను మాపై రుద్దడం ఏంటి? అని ప్రశ్నించారు. ఏమీ తప్పు చేయలేదంటున్న బిఆర్‌ఎస్ నేతలు సిబిఐ అనగానే ఎందుకు జంకుతున్నారు. వారు తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కోవాలని సవాలు చేశారు. బిఆర్‌ఎస్ అవినీతిని బయటపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అన్నారు.కెసిఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని గతంలో చెప్పిన కవిత ఆ దెయ్యాలు హరీశ్ రావు, సంతోష్ రావేనా..? ఇంకా ఎవరెవరు ఉన్నారో ఆమె స్పష్టం చేయాలని అన్నారు. కవిత మాటలు నిజమా..? నిన్న అసెంబ్లీ మాట్లాడిన హరీశ్ రావు మాటలు నిజమా..? వారు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.




## మలక్‌పేటలోని వ్యవసాయ శిక్షణ సంస్థ పునరుద్ధరణకు కృషి చేస్తాం

రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర రైతు కమిషన్ బృందం మలక్‌పేటలో ఉన్న వ్యవసాయ యాజమాన్య, విస్తరణ శిక్షణ సంస్థ (సమేటి)ని సందర్శించింది. ఈ శిక్షణ సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వంతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985లో ఏర్పాటైందని, వ్యవసాయ అధికారులకు, రైతన్నలకు సాగులో కొత్త పద్ధతులపై శిక్షణ ఇవ్వడంలో కీలకపాత్ర పోషించిందని సమేటి అధికారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. గత పదేళ్లుగా నిధులు, నియామకాలు లేక ఈ సంస్థ నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరుకుందని వారు వివరించారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీ రెడ్డి, భూమి సునీల్ దాదాపు రెండు గంటలపాటు సమేటిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వరి, పత్తి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిర్చి వంటి పంటల డిఎన్‌ఎ పరిశోధనలు ఈ సంస్థలో జరుగుతాయని అధికారులు కమిషన్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్య కార్యదర్శి గోపాల్, సమేటి డైరెక్టర్ నరసింహారావు, ఏడిఏ సుధాకర్ బాబు, డిఎన్‌ఎ ల్యాబ్ ఇన్‌చార్జి కవిత, బయో ఫెస్టిసైడ్ ఇన్‌చార్జ్ సంధ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఫర్టిలైజర్ కోడింగ్ రమాదేవి, అగ్రికల్చర్ అధికారులు హరివెంకట ప్రసాద్, శ్రావణితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

'సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ'లో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నదని పలువురు వక్తలు తెలిపారు. ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తే సిఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు . 'సెప్టెంబర్ 1న' సిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిన రోజు సందర్భంగా తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సోమవారం' సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ' జరిగింది. ఈ సభలో ఎంఎల్‌సి మల్క కొమురయ్య, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ఎం.కోదండరామ్, తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎల్.దర్శన్ గౌడ్, తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు కె. రామకృష్ణ, నాయకులు నాగవల్లి ఉపేందర్, ఎస్.రాములు, రాధ, ఎం. శ్రీనివాస్ శంకర్, అశ్వథామారెడ్డి, ఎం.చంద్రశేఖర్‌గౌడ్, కత్తి జనార్ధన్, హబీబ్ మస్తాన్, గరికె ఉపేందర్ రావు, ఎస్.వి. సుబ్బయ్య, మహిపాల్ రెడ్డి, ఊదరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గిన్నీస్‌బుక్ లక్ష్యంగా బతుకమ్మ పండుగ

21-30వరకు రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలు

వేయి స్తంభాల గుడి వద్ద వేడుకలు ప్రారంభం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గిన్నీస్‌బుక్ రికార్డు లక్ష్యంగా ఈసారి బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈనెల 28న ఎల్‌బి స్టేడియంలో 10,000 కంటే ఎక్కువ మంది మహిళలతో బతుకమ్మ ఉత్సవాలు జరపతలపెట్టినామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో ఈనెల 21 నుంచి 30 వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిపేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.
సచివాలయంలో మంత్రులు కొండాసురేఖ, దనసరి అనసూయ సీతక్కలతో కలిసి జూపల్లి కృష్ణారావు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలను ఈనెల 21న వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి వద్ద ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో పర్యాటక రంగంలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా కనీసం మూడు లక్షల మందికి అదనంగా ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో 10 శాతం, అంతకంటే ఎక్కువగా టూరిజం నుంచి వచ్చేలా చూడటం ఈ లక్ష్యాల్లో భాగం అన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ..**

ఈ సందర్భంగా మంత్రులు బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పూలతో దేవున్ని కొలిచే ఈ పండుగ ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకత అని చెప్పుకొచ్చారు. బతుకమ్మ కేవలం ఒక పండుగ కాదని, ఇది తెలంగాణ ఆత్మగౌరవ వేడుక అని సురేఖ అన్నారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ..తెలంగాణలో అత్యంత ప్రఖ్యాతి గాంచి, ప్రతి ఇంట్లో ఆడుకునే బతుకమ్మ పండుగ ఏర్పాట్లు తేదీలు ప్రకటించి చేసినందుకు మంత్రి జూపల్లి కృష్ణారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ఎ.క్రాంతి పాల్గొన్నారు.

## అనుమతుల పేరుతో వేధింపులు వద్దు

ఎన్‌ఒసి జారీలో అలసత్వంపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అనుమతులు ఇవ్వాలని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి అనుమతుల జారీ విషయంలో జాప్యంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండిఎ పరిధిలో 'బిల్డ్ నౌ' కింద పనుల అనుమతుల విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం సమీక్షించారు. బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం, ఇతర అనుమతుల విషయంలో ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు అలసత్వం చూపుతున్నారని సిఎం మండిపడ్డారు. అనుమతుల జాప్యంలో ఆలస్యానికి కారకులను గుర్తించి వారిని సరెండర్ చేయాలని హెచ్‌ఎండిఎ కార్యదర్శి ఇలంబర్తిని సిఎం ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదల శాఖ విభాగం అధికారులపై పలు ఆరోపణలు వస్తున్నాయని, వాటిని ఎంత మాత్రం సహించేదిలేదని సిఎం హెచ్చరించారు. హెచ్‌ఎండిఎ పరిధిలోని చెరువులు, నాలాలు, ఇతర నీటి వనరులకు సంబంధించి లైడార్ సర్వేను తక్షణమే చేపట్టాలని సిఎం ఆదేశించారు. సమీక్షలో హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ అండర్ బ్రిడ్జిలపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైళ్ల కార్యకలాపాల నిర్వహణ భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. రైలు షంటింగ్ చేసేటప్పుడు, పట్టాలు తప్పకుండా భద్రతకు సంబంధించిన నివారణ మార్గదర్శకాలు పాటించాలన్నారు. వంతెనలు, సొరంగాల నిర్మాణ సమగ్రతపై దృష్టి సారించాలన్నారు. సిగ్నల్ దృశ్యమానత, అలారం వ్యవస్థలతో పాటు ట్రాక్ బ్లాంకెటింగ్, బ్యాలస్టింగ్ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి అన్ని భద్రతకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. వరదలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి, సిగ్నలింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి మరియు బలమైన హెచ్చరిక విధానాలను నిర్ధారించడానికి ఆదేశాలు జారీ చేశారు. భద్రతా కేటగిరీ సిబ్బందికి సమూహ సమావేశాలు మరియు వ్యక్తిగత కౌన్సెలింగ్‌తో సహా సిబ్బంది సెన్సిటైజేషన్ కార్యక్రమాలను అమలు చేయాలని ఆదేశించారు.

## చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్న నలుగురు సభ్యుల మూఠా అరెస్ట్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** చిన్న పిల్లలను కిడ్నాప్ చేసి పిల్లలు లేని వారికి అమ్ముకుంటున్న 4గురు సభ్యుల మూఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ వివరాలను వెల్లడించారు. చిన్న పిల్లలను కిడ్నాప్ చేసి అమ్ముకుంటున్న 5గురు కిడ్నాపింగ్ మూఠా సభ్యులలో 4గురు నిందుతులను అరెస్ట్ చేసి, 5 లక్షల రూపాయలతో పాటు 6మంది చిన్నారులను 3గురు అబ్బాయిలు, 3గురు అమ్మాయిలు 1.అఖిల్ (5సం), 2.అరుణ్ (2సం), 3. అమ్ములు (8నెలలు), 4.లాస్య (5సం) , అద్విక్ (2సం), 6. ప్రియ (1సం) అధీనంలోకి తీసుకుని జిల్లా శిశు సంక్షేమ కేంద్రంకు అప్పగించామని తెలిపారు. లింగంపల్లిలోని పోచమ్మ దేవాలయం వద్ద నివసిస్తున్న వారి ఒక 4 సంవత్సరాల అబ్బాయి అఖిల్‌ను 26.8.25వ రోజున కిడ్నాప్ అయినట్లు తల్లిదండ్రులు చందానగర్ పోలీసులను ఆశ్రయించగా చందానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకొని మాదాపూర్ జోన్ డిసిపి, మియాపూర్ ఎసిపి, ఆదేశాలతో చందానగర్ సిఐ పర్యవేక్షణలో చకచక్యంగా దర్యాప్తు ప్రారంభించామని దర్యాప్తులో భాగాంగా నిందుతులు ఎ1. చిల్కూరి రాజు పటాన్‌చెరువు నివాసితుడు రోడ్లపై మందులు అమ్ముతూ జీవిస్తూ పిల్లలను కిడ్నాప్ చేసి ఎ2 మహమ్మద్ హసిఫ్, ఎ3 రిజ్వానాలతో కలసి పిల్లలు లేని వారికి పిల్లలను అమ్ముతుండే వారని తెలిపారు. ఎ4 నర్సింహారెడ్డి ఎ1 చిల్కూరి రాజుకు స్నేహితుడని ఎ1రాజు కు అఖిల్ కిడ్నాపింగ్ లో సహకరించాడని తెలిపారు. ఎ1 నిందితుడు చిల్కూరి రాజు 4 సంవత్సరాల క్రిందట కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఒక చిన్నారిని కిడ్నాప్ చేసి 42,000 వెల రూపాయలకు అమ్ముకున్నాడని అప్పటి నుండి చిన్న పిల్లల కిడ్నాపింగ్ మొదలు పెట్టాడని, రిజ్వానా సిద్దిపేటలో ఒక నర్సింగ్ హోమ్ నడిపిస్తూ ఎ1,ఎ2,సహకరంతో పిల్లలు లేని వారికి కిడ్నాప్ చేసిన పిల్లలను అమ్ముకునే వారని తెలిపారు. ఓక్కొక్క చిన్నారికి వారి అవసరాలను బట్టి 4.5 లక్షలు, 7 లక్షలు, 3.5 లక్షలు ఈ విధంగా అమ్ముకునే వారని తెలిపారు. సొంత తండ్రియే తమ ఇద్దరు పిల్లలను కూడ వీరి ద్వార క్రయ , విక్రయాలు జరిగాయన్నారు. 4 నిందితులను రిమాండ్ తరలించి కేసు దర్యాపు చేస్తున్నామని తెలిపారు.

## ఐఆర్‌డిఎఐలో రూ.5.5కోట్లు కాజేసిన అసిస్టెంట్ మేనేజర్ అరెస్ట్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఇన్సూరెన్స్ రేగ్యూలటారీ, డెవలప్‌మ్మెంట్ అథారీటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) రాయదుర్గంలోని షేక్ పేట్ బ్రాంచిలో పని చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ తాను పని చేస్తున్న సంస్థలో 5.5 కోట్లు మోసం చేసి తన కుంటుంబ సభ్యుల అకౌంట్లలోకి పంపించిన వ్యక్తి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన సైబారాబాద్ కమిషనరేట్ పరిధీలో చోటుచేసుకుంది. సోమవారం గచ్చిబౌలిలోని డిసిపి కార్యలయంలో విలేకరుల సమావేశంలో మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ వివరాలను వెల్లడించారు. రాయదుర్గంలోని షేక్‌పేట్‌లో గల ఐఆర్‌డిఎఐ కార్యలయంలో పనుచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ భాస్కర భట్ల సూర్యనారయణ శాస్త్రి బీనామీ పేర్లతో 5.50 కోట్ల రూపాయల లోన్‌లను తీసుకొని తన కుటుంబ సభ్యుల అకౌంట్‌ల లోకి తరలించారని తెలిపారు. డబ్బు లోన్ తీసుకున్నవారు తిరిగి చెల్లించకపోవడంతో ఎదో ఇతర కారణాలు చెపుతూ బ్యాంకు వారిని మోసగిస్తూ వస్తున్నారని , బ్యాంకు పూర్తి వివరాలు అందించాలని అదేశించడంతో నకిలీ డాక్యూమెంట్లు సృష్టించి బ్యాంకు ను మోసగించాలని చూడడంతో పోలీసులను అశ్రాయించారని దర్యాప్తులో తన కుటుంబ సభ్యుల అకౌంట్లకు తరలించి తన అవసరాలకు వాడుకున్నాడని తెలిపారు. ఈ మేరకు అతనిని రిమాండ్ కు తరలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హాసిని నాయుడు అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఇఓడబ్ల్యూ పోలీస్ స్టేషన్, ముత్యం రెడ్డి డిసిపి క్రైమ్స్, ఇఓడబ్ల్యూ సైబారాబాద్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పౌర సమాజం తరపున ఎంపిలకు లేఖలు రాస్తాం

ఉపరాష్ట్రపతి ఎన్నిక వ్యక్తికి, విలువలకు మధ్య జరుగుతున్న పోటీ

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా పౌర సమాజం నిలబడాలని తీర్మానం

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖ వక్తల అభిప్రాయం



**హైదరాబాద్ :** ఉప రాష్ట్రపతి ఎన్నిక వ్యక్తికీ, విలువలకు మధ్య జరుగుతున్న పోటీ అని, ఎంపిలు ఎటువైపు నిలబడతారో ఆలోచించాలని పలువురు వక్తలు కోరారు. ఈ ఎన్నికలో ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య భవిష్యత్తు దృష్ట్యా వ్యక్తిగత నిజాయితీ కలిగిన అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలబడాలని, తెలంగాణ పౌర సమాజం తరపున పార్లమెంట్ సభ్యులందరికీ లేఖలు సైతం రాస్తామని తీర్మానించారు. విలువలు, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఓటువేయాల్సిన తరుణమిదని గుర్తుచేశారు. పార్టీవాళ్లకే ఓటు వేయాలని నిబంధన రాజ్యాంగంలోనూ ఎక్కడా లేదని, కాబట్టి విలువలు గౌరవించే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం తెలుగు బిడ్డ జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా, అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు ఎంఎం రహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తనకు వ్యక్తిగతంగా చాలా పరిచయం కలిగినవారని ఆయన ప్రజల పక్షాన పనిచేశారని అన్నారు. సల్వాజుడుం అనే ప్రైవేటు సైన్యాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసి ఆదివాసీలను లెక్కలేని విధంగా హత్యచేశారని చెప్పారు. మహిళలను, అక్కడున్న ప్రజలను బట్టలు విప్పించి చెప్పుల దండలు మెడలో వేసి ఊరేగింపు కార్యక్రమాలు సైతం చేశారని, ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు రాజ్యాంగ బద్ధంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ విషయం అవగాహన లేకుండా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాత్రం విలువలు దిగజారి మాట్లాడడం బాధాకరమన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో గెలుపోటములు పక్కన బెడితే జస్టిస్ సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగానే రాజ్యాంగం, విలువల మధ్య చర్చ తారాస్థాయికి చేరిందన్నారు. అందుకే పౌర సమాజంలో అందరూ ఏకమై రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని విలువలను కాపాడుకోవాలని అన్నారు.

**ప్రజా హక్కులను కాపాడే బాధ్యత సుప్రీం కోర్టుదే.. : చంద్రకుమార్**

ఈ దేశ ప్రజల హక్కులను కాపాడేది సుప్రీంకోర్టు మాత్రమేనని రిటైర్డ్ జడ్జి జస్టి చంద్రకుమార్ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల తీర్పులు ఈ విధంగా ఉండాలని ఓ రాజకీయ నాయకులు చెప్పగలరా? అలా చెప్పే అర్హత అతనికి ఉందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగానికి భిన్నంగా ఏ ఆర్డినెన్స్ తెచ్చినా, ప్రాథమిక హక్కుకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తే వాటిని కొట్టివేసే హక్కు సుప్రీంకోర్టుకు ఉందని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత సుప్రీంకోర్టు జడ్జిల మీద ఉందని అన్నారు. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య ఏ ఘర్షణ వాతావరణం నెలకొన్నా, ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించే బాధ్యత సుప్రీంకోర్టుదేనని చెప్పారు. ఆర్టికల్ 32 ప్రకారం ఏ వ్యక్తి ప్రాథమిక హక్కుకు భంగం కలిగినా, ఎన్కౌంటర్ జరిగినా జీవించే హక్కు భంగం కలిగినా కాపాడే బాధ్యత సుప్రీంకోర్టుకు ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా కోర్టు ముందర కక్షిదారి అని, ఓ కక్షిదారి కోర్టు తీర్పును తప్పు పట్టడానికి అవకాశం ఉందా.. ఇది అత్యంత దుర్మార్గం అన్నారు.
కోర్టు తీర్పుల వల్ల ఎంతో మంది రాజకీయ నాయకులపై గతంలో కేసులు కూడా అయ్యాయని, ఆ ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ఎలా అంటే అలా మాట్లాడటం సరైనది కాదన్నారు. రాజ్యాంగంపై గౌరవం ఉన్నవారు ఎవరు కూడా ఇలాంటి కామెంట్స్ చేయరని, సుదర్శన్ రెడ్డి ఓటు హక్కును అడ్డుకోవడం కోసమే అమిత్ షా ఈ కామెంట్లు చేశారని మండిపడ్డారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డి జనజీవన స్రవంతిలోనే ఉన్నారు : దేవులపల్లి అమర్**

అర్బన్ నక్సలైట్ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ ఘాటైన విమర్శలు చేశారు. ఆయనకు బిజెపి మద్దతు ఇవ్వాలని, గెలుపోటములు తర్వాత విషయమని అన్నారు. అమిత్ షా మాటలతో న్యాయ వ్యవస్థ పరువు పూర్తిగా దిగజార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. చత్తీస్‌గడ్‌లో స్పెషల్ పోలీస్ వ్యవస్థను తెచ్చి ఎలాంటి విద్యార్హత లేకుండా వందలాది మందిని హత్య చేశారని, ఆదివాసీ గిరిజన మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలబడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని సమర్థించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**రెండు సిద్ధాంతాల మధ్య పోటీ : రామచంద్ర మూర్తి**


భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో రెండు సిద్ధాంతాల మధ్య పోటీతత్వం నెలకొందని కె రామచంద్ర మూర్తి అన్నారు. భారత ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సోషలిస్ట్ భావాలు కలిగిన వ్యక్తి అని, ఆయన పనిచేసిన విధానం రాజ్యాంగానికి కంకణబద్ధులై ఉండి దళిత గిరిజన ఆదివాసి ప్రజల హక్కులను కాపాడడానికి ఎంతో ప్రయత్నం చేశారని చెప్పారు.

**సల్వాజుడుం తీర్పు రాజ్యాంగ బద్ధమైన తీర్పు : ఎన్.వేణుగోపాల్**

జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పు రాజ్యాంగ బద్ధమైన తీర్పు అని సీనియర్ జర్నలిస్టు ఎన్ వేణుగోపాల్ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఫాసిజం విధానాలను అవలంబిస్తుందని, సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రకటించగానే సంబంధం లేని మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు.

**చట్టబద్ధమైన అధికారం ఉండాలి : ప్రొఫెసర్ కోదండరాం**

ఆనాడు సల్వాజుడుం పేరిట అమానవీయ ఘటనకు పాల్పడ్డారని, అందుకే రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రస్తుతం సాంప్రదాయం పునాదుల మీద, బల ప్రయోగం ఆధారంగా అధికారం చెలాబడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.
ఈ రెండు అధికారాలకు సమాజం పట్ల బాధ్యత ఉండదన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం విషయంలో ఘర్షణ ఏర్పడుతున్నప్పుడు మనం ఎటువైపో తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి, పీఎల్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ డీఎల్, పాశం యాదగిరి, బీఎస్ రాములు, సయ్యద్ రఫీ, రాఘవాచారి, విరహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇ–20 పెట్రోల్‌పై పిటిషన్ కొట్టేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ:** ఇరవై శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ 20 పెట్రోలు) సురక్షితం కాదంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ 20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలు తగ్గించడం, ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలు చేరుకోవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఈ 20 పెట్రోల్‌ను వినియోగించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి ముందడుగు పడింది. 20 శాతం ఇథనాల్ కలిపినపెట్రోల్‌సురక్షితంకాదంటూ కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ 20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా? అని వాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సహజవాయువు మంత్రిత్వశాఖ ఇటీవల వివరణాత్మక స్పష్టతనిచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల విశ్లేషణకు అనుగుణంగా లేవంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తవని మంత్రిత్వశాఖ వెల్లడించింది.

### భారత్—చైనా సహకారం...సానుకూల పరిణామం

## శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదం

**సిపిఐ ఉద్ఘాటన**

**న్యూఢిల్లీ:** భారత్‌చైనా మధ్య సహకార పురోగతిని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) స్వాగతించింది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశంసానుకూల ఫలితం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు దేశాల ప్రజలమధ్య రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు సహా ఇతర అన్ని స్థాయిలలో మెరుగైన అవగాహన వైపు ముందుకు సాగడానికి ఈ చర్చలు నిబద్ధతను చాటాయి. ఇటువంటి సహకారం మన రెండు దేశాలకు మాత్రమే కాకుండా, గ్లోబల్ సౌత్ ఐక్యతను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సంబంధాలలో బహుళ ధ్రువణత పురోగతికి కూడా చాలా ముఖ్యమైనదని సీపీఐ తెలిపింది. వలస శక్తుల వారసత్వం అయిన దీర్ఘకాలిక సరిహద్దు సమస్యలను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించడానికి రెండు దేశాలు రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ పరిణామంమనప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం, అభివద్ధిని నిర్మించడానికి దోహదపడుతుంది. సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచాన్ని విభజించి ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో భారత్ చైనాల ఐక్యత, సహకారం... దేశాల మధ్య సమానత్వం, న్యాయం, పరస్పర గౌరవంఆధారంగా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమానికి శక్తివంతమైన ప్రేరణనిస్తాయి. భారత్‌చైనా సంబంధాలలో సానుకూల పరిణామానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ ప్రజలకు పిలుపునిచ్చింది.

### మేం పార్లమెంట్‌లో అభ్యర్థిస్తే బిజెపి అవమానించింది...

**కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్‌విశ్వం**



**తిరువనంతపురం :** చైనా, రష్యా దేశాలతో భారతదేశం 'మంచి సంబంధాలను' నిర్మించుకోవాలని తనతో పాటు వామపక్ష సహచరులు గతంలో పార్లమెంట్‌లో అభ్యర్థించినందుకు బిజెపి తనను, వామపక్ష పార్లమెంటేరియన్లను తీవ్రంగా అవమానించి విమర్శల దాడికి దిగారని, చైనాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? అని కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి, రాజ్యసభ మాజీ ఎంపి బినోయ్ విశ్వం ప్రశ్నించారు. కమ్యూనిస్టు దేశమైన చైనాలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిసి చర్చలు జరుపుతున్న సందర్భంగా బినోయ్ విశ్వం గత సంఘటనలను గుర్తు చేశారు. ఆయన ఈ విషయాన్ని 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. చైనా, రష్యాలతో మెరుగైన సంబంధాలు నిర్మించుకోవాలని హితవు చెప్పినందుకుబిజెపి నాయకులు అప్పట్లో తనపై, వామపక్ష ఎంపీలపై తీవ్రస్థాయిలో అరిచి, అవమానపరిచి'చైనా,రష్యా ఏజెంట్లుగా' ముద్రవేశారని గుర్తు చేశారు.'శాంతి,చర్చల కోసం మేం అభ్యర్థించడమే నేరమా' అని బినోయ్ విశ్వం అన్నారు. కేవలం వాదనలు,సంభాషణల కోసమే బిజెపి నాయకులు మమ్ములను లక్ష్యంగా చేసుకున్నారని, బిజెపి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎక్కువ విశ్వాసం ఉంచుతూ వారి నిబద్ధత గతల భారతదేశాన్ని విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. మీ సహచరులు చైనారష్యాకు కూడా మద్దతు ఇచ్చారు!. మీరు మా నిబద్ధతను మర్చిపోయారు. 'ట్రంప్‌లో మీరు మీకు రక్షకుడు గానే చూసుకున్నారు' అనిబినోయ్'ఎక్స్'పోస్ట్‌లో రాశారు.

### సెప్టెంబర్ 1 నుంచే అమలులోకి వచ్చిన...

## కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025

**హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** భారతదేశం వీడి విదేశాలకి వెళ్లేందుకు, భారతదేశానికివచ్చేందుకు నకిలీ పాస్‌పోర్టు, వీసా సృష్టిస్తేఏమవుతుంది అని లైట్‌గా తీసుకునే వాళ్లకు భారత ప్రభుత్వం చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. భారతదేశం కఠిన నిబంధనలతో కూడిన చట్టాన్ని రూపొందించడమే కాదు అమలు కూడా ప్రారంభించింది. విదేశీయులు, ఇమ్మిగ్రేషన్(వలస)కుసంబంధించిన విషయాలను నియ ం త్రించే కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం2025ను సోమవారం (సెప్టెంబరు1) నుంచి అమలులోకి తీసుకొచ్చింది. ఈ నూతన చట్టం ప్రకారం నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసా తీసుకెళ్లినందుకు భారీ శిక్ష విధించే నిబంధనలు ఈ కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయులచట్టంలో పొందుపరచబడ్డాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సమయంలో ఈ ఇమ్మిగ్రేషన్, విదేశీయులచట్టం2025ను ఆమోదించగా, 2025 ఏప్రిల్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ఆమోద ముద్ర వేసింది. 'ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం 2025(2025లో 13) సెక్షన్ 1 యొక్క సబ్‌సెక్షన్ (2) ద్వారా కసరత్తు అధికారాలను వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 1ను ఈ చట్టంలోని నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా నియమిస్తుంది' అని హోం మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నితీష్ కుమార్ వ్యాస్ జారీ చేసిన నోటిఫికేషన్ తెలిపారు. ఈ నూతన చట్టం ప్రకారం ఇకపై భారతదేశంలోకి ప్రవేశించడానికి లేదా దేశంలో ఉండటానికి లేదా దేశం నుండి బయటకు వెళ్లడానికి నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసా కలిగిఉన్నట్లుతేలితే 7ఏళ్ల పాటు జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించబడుతుంది. విదేశాలలో ఎక్కువ కాలం ఉంటున్న వారిని ట్రాక్ చేయడానికి వీలుగా హోటళ్లు, విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్ విదేశీయుల గురించి సమాచారాన్ని తప్పకుండా నివేదించాలని కూడా ఈ చట్టం చెబుతోంది. అన్ని అంతర్జాతీయ విమానయాన సం స్థలు లేదా నౌకలు భారతదేశంలోని ఓడరేవు లేదా ప్రదేశంలో పౌర అధికార సంస్థ లేదా ఇమ్మిగ్రేషన్‌కు ప్రయాణికులు,సిబ్బంది మేనిఫెస్టోను అటువంటి విమానం, నౌక లేదా ఇతర రవాణా విదానంలో ప్రయాణికులు, సిబ్బందిముందస్తు సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ కొత్త చట్టం ప్రకారం...భారతదేశంలో నివసించడానికి లేదా నిష్క్రమించడానికి నకిలీ లేదా మోసపూరితంగా పొందిన పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రం లేదా వీసాను తెలిసి ఎవరైనా ఉపయోగించినా లేదా సరఫరా చేసినా రెండు సంవత్సరాల కంటే తక్కువ కాకుండా ఏడు సంవత్సరాలకూజైలుశిక్షపొడిగించవచ్చు. రూ. 10లక్షలకంటేతక్కువకాకుండా జరిమానా కూడా విధించబడుతుంది. చెల్లు అయ్యే పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రం లేకుండా భారతదేశంలోని ఏ ప్రాంతానికి ప్రవేశించే విదేశీయుడైనాఅలాంటి ప్రయాణానికి అవసరమైన వీసాతో సహా చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించడం,దాని ప్రకారం ఇవ్వబడిన ఏదైనా నియమం లేదా ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే 5సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా రూ.5లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయని నూతన చట్టం తెలియజేసింది.ఏదైనా విదేశీయుడు తరచుగా సందర్శించే ప్రదేశాలపై నియంత్రణను విధించే అధికారాన్ని ఈ కొత్త చట్టం ఇస్తుంది. యజమాని ఆ ప్రాంగణాన్ని మూసివేయాలని, నిర్దిష్ట పరిస్థితులలో ఆ వినియోగాన్ని అనుమతించాలని, అన్ని లేదా నిర్దిష్ట తరగతి విదేయులకు ప్రవేశాన్ని నిరాకరించాలని కోరుతుంది. విదేశీయుల, వలసలకు సంబంధించిన అన్ని విషయాలను నియంత్రించడానికి ఇది సమగ్ర చట్టం. ఇవి ఇప్పటివరకూ అంటే పాస్‌పోర్టు (భారతదేశంలోకి ప్రవేశం) చట్టం, 1920, విదేశీయల రిజిస్ట్రేషన్ చట్టం, 1939, విదేశీయుల చట్టం, 1946 మరియు ఇమిగ్రేషన్ (కెరీర్స్ బాధ్యత) చట్టం 2000 ద్వారా నిర్వహించబడ్డాయి. ఇప్పుడు ఈ చట్టాలన్నీ రద్దు చేయబడ్డాయి.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఇ-టెండర్ నోటీసు నెం. 30-2025**
**తేది: 30 / 08 / 2025**
PUB/1063

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / కోఆర్డినేషన్ / గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. **ముగింపు తేదీ & సమయం: 26.09.2025 15:00 గంటలకు.**

**1. టెండర్ నంబర్:** ఇంజినీరింగ్-జిటిఎల్-నార్త్-1920 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గూటీ-కుప్పగల్ (యుపి&డిఎన్) :- 90.08 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (పిహెచ్-II) కోసం NHAI యాంటీ-క్రాష్ బారియర్/డబ్ల్యూ-బీమ్ స్టీల్ ఫెన్సింగ్ ఉపయోగించి 130 కి.మీ. మరియు అంతకంటే ఎక్కువ ట్రాక్ వెంట భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 30,25,97,405.89 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 16,63,000.00

**2. టెండర్ నంబర్:** ఇంజినీరింగ్-జిటిఎల్-నార్త్-1921 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గూటీ - వాడి విభాగం (DEN/నార్త్/GTL): 6.1/2 కి.మీ. (ఫేజ్ - II) (ADEN/నార్త్) కోసం 130 కి.మీ. మరియు అంతకంటే ఎక్కువ వేగంతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 6,11,42,178.78 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 4,55,700.00

**3. టెండర్ నం.:** Engg-GTL-Central-1922 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: ధోన్ - ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడ్.(1) ఎక్సి కాన్కోర్స్ పునరుద్ధరణ (2) PF 2&3లో కొత్త వెయిటింగ్ హాల్, రిటైరింగ్ గదులు మరియు గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటు (3) ఇరువైపులా సర్క్యులేటింగ్ ప్రాంతాలలో మెరుగుదలలు (4) PF 2 & 3 మరియు 4 & 5 మరియు (5) PF నం.1లో కొత్త ఉన్నత తరగతి వెయిటింగ్ హా COP కేటాయింపు,(6) తక్కువ ఎత్తు ఉన్న పాత కార్యాలయాలను కూల్చివేయడం (రెండు ప్యాకెట్లు)లో. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 11,33,45,544.3 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 7,16,700.00

**4. టెండర్ నెం:** Engg-GTL-West-1923 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: పాకాల: ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడ్. (1) స్టేషన్ భవనం బ్యాలెన్స్ పనులు (2) సర్క్యులేటింగ్ ప్రాంతానికి మెరుగుదలలు, (3) ప్రవేశ ద్వారం ఏర్పాటు, (4) ఐసోలేటెడ్ COP(5) దివ్యాంగ్ టాయిలెట్లు మొదలైనవి. (రెండు ప్యాకెట్). **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 10,52,22,823.7 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 6,76,100.00

**5. టెండర్ నెం.:** ఇంజినీరింగ్-జిటిఎల్-వెస్ట్-1924 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: ధర్మవరం: ABS దశ - II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్‌గ్రేడ్. (1) సర్క్యులేటింగ్ ఏరియాకు ప్రాధాన్యమిచ్చారు, (2) కాన్కోర్స్ ప్రాంతానికి మెరుగుదలలు, (3) అప్రోచ్ రోడ్డు ఏర్పాటు, (4) డ్రైనేజీ ఏర్పాట్లలో మెరుగుదలలు, (5) పూర్తి నిడివి గల పోలీసు అధికారి, (6) పిఎఫ్ నెం.1 & దివ్యాంగ్ టాయిలెట్లలో కొత్త టాయిలెట్ బ్లాక్ (7) కొత్త టిటిఇ స్లీపర్ ఆఫీస్ & మహిళా టిటిఇ విశ్రాంతి గృహం ఉన్నదాన్ని సరిగ్గా కూల్చివేయడం, (8) పిఎఫ్ నెం.1లో (రెండు ప్యాకెట్లు) సమీపంలో కొత్త ఎంట్రీ / ఎగ్జిట్. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 10,57,57,982.25 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 6,78,800.00

**6. టెండర్ నం.:** Engg-GTL-West-1925 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: SWI-పైలర్ - ABS ఫేజ్-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడేషన్(1) ముఖభాగం మెరుగుదలలు (2) కాన్కోర్సు ఇంప్రి(3) 2&4 కోసం పార్కింగ్ సదుపాయం వీలర్లు(4) అప్రోచ్ రోడ్లలో ఫుట్‌పాత్‌ల ఏర్పాటు(5) బ్యాలెన్స్ డ్రైనేజీ ఏర్పాట్లు SWII కదిరి: (1) ప్రవేశ ద్వారం ఏర్పాటు, (2) సర్క్యులేటింగ్ ఏరియాకు మెరుగుదలలు మరియు (3) ప్లాట్ఫార్మ్ టాయిలెట్ల ఏర్పాటు మొదలైన వాటితో స్టేషన్ను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదించబడింది. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 6,39,18,451.69 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.) 4,69,600.00

**7. టెండర్ నెం.:** ఇంజినీరింగ్-జిటిఎల్-వెస్ట్-1926 **పని వివరణ :** గుంతకల్ డివిజన్: అనంతపురం : ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్‌గ్రేడ్.1) పోర్టికో నుండి RBG గదికి Stn భవనం యొక్క కూల్చివేత, 2) PF నంబర్ 1లో హాల్లో ప్రీపెయిడ్ AC ఏర్పాటు, 3) భవనం యొక్క కూల్చివేత భాగంలో ఓపెన్ వెయిటింగ్ హాల్ మరియు PF గోడ ఏర్పాటు, 4) పూర్తి COP మరియు 5) PF నంబర్ 1లో కొత్త టాయిలెట్ బ్లాక్ & GRP సమీపంలోని PF నంబర్ 4లో పాత టాయిలెట్లను కూల్చివేయడం. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 8,89,39,760.01 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.) 5,94,700.00.

ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.
**డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/గుంతకల్**

**సవరణ నెం. E-03-CPOH-RYP-2025, తేది: 14.07.2025**
PUB/1064

ఇ-టెండర్ నోటీసు కింద ఆహ్వానించబడిన టెండర్ నెం. E-03-CPOH-RYP- 2025. నం. 03/DY.CE/CPOH/RYP/2025, తేది: 14.07. 2025 ఇందుమూలంగా రద్దు చేయబడింది. దయచేసి గమనించండి www.ireps.gov.inలో మా వెబ్సైట్ను సందర్శించండి
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/CPOH/రాయనపాడు**


### పంజాబ్, హిమాచల్, ఉత్తరాఖండ్‌కు రెడ్అలర్ట్

**న్యూఢిల్లీ:** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు వాతావరణ శాఖ సోమవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో 48 గంటలపాటు తీవ్రంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి సూచించారు.


**ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నెం. DRM/ Works/BZA/19/2025 తేది:29.08.2025**
PUB/1062

భారత రాష్ట్రపతి తరపున, సంతకం చేసిన వారు ఈ క్రింది పనుల కోసం 15-00 గంటల వరకు మరియు ప్రతిదానికీ ఎదురుగా పేర్కొన్న తేదీ వరకు E-టెండర్లను ఆహ్వానిస్తారు.

**1. టెండర్ నం.:** E-36-East-BZA-2025 **పని పేరు :** BZA డివిజన్ - ADEN/BVRM సబ్-డివిజన్ కింద SSE/W/BVRM విభాగంలో ఉన్న FOB లకు కనెక్ట్ చేయడానికి TNKU (2 సంఖ్యలు), AKVD (2 సంఖ్యలు) & KKLR (2 సంఖ్యలు) స్టేషన్లలో 6 లిఫ్టల ఏర్పాటు. **పూర్తయిన వ్యవధి:** 06 (ఆరు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 1,17,88,107/- **ఇఎండి (రూ.)** 4,26,200/- **ముగింపు తేదీ:** 19/09/2025

**2. టెండర్ నంబర్:** E-20-సెంట్రల్-BZA-2025 **పని పేరు:** BZA డివిజన్: GDRBZA సెక్షన్ - SW-I) TRR(P) - 1.706 కి.మీ నుండి కి.మీ: 366.370 - 368.076 ADEN/BPP సబ్-డివిజన్లోని APL-NDO మధ్య కట్ & కనెక్షన్ ద్వారా డౌన్ లైన్ నుండి అప్ లైన్‌కు కొత్త డైవర్షన్ కోసం. SW-II) TRR(P) - 1.700 కి.మీ నుండి కి.మీ: 364.670 - 366.370 ADEN / BPP సబ్-డివిజన్లోని APL-NDO మధ్య కట్ & కనెక్షన్ ద్వారా డౌన్ లైన్ నుండి అప్ లైన్‌కు కొత్త డైవర్షన్ కోసం. (DEN/సెంట్రల్/BZA అధికార పరిధి). **పూర్తయిన వ్యవధి:** 06 (ఆరు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 1,59,24,417/- **ఇఎండి (రూ.)** 2,29,600/- **ముగింపు తేదీ:** 24/09/2025

**3. టెండర్ నం.:** E-21-Central-BZA-2025 **పని పేరు:** SW I: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్ డివిజన్ కింద SSE/W/BPP విభాగంలోని బాపట్ల స్టేషన్ వద్ద PF నం.4 & 5లో లిఫ్ట్ ఏర్పాటు కోసం బ్యాలెన్స్ పని. SW II: అమృత భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్ డివిజన్ కింద SSE/వర్క్స్/BPPవిభాగంలోని ప్లాట్‌ఫారంలపై చిరాలా స్టేషన్ వద్ద ఎస్కలేటర్ల ఏర్పాటు కోసం బ్యాలెన్స్ పని (3 సంఖ్యలు). SW III: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/EE సబ్-డివిజన్ కింద SSE/వర్క్స్/EE విభాగంలోని ప్లాట్‌ఫారంలపై ఏలూరు స్టేషన్లో (2 సంఖ్యలు) ఎస్కలేటర్ల ఏర్పాటు. SW IV: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్-డివిజన్ కింద SSE/వర్క్స్/TEL విభాగంలోని ప్లాట్‌ఫారంలపై తెనాలి స్టేషన్లో (3 సంఖ్యలు) ఎస్కలేటర్ల ఏర్పాటు. **పూర్తయిన కాలం :** 12 (పన్నెండు నెలలు ) **టెండర్ విలువ (రూ.)** 1,47,62,141/- **ఇఎండి (రూ.)** 2,23,800./- **ముగింపు తేదీ:** 24/09/2025

**4. టెండర్ నం.:** E-16-బ్రిడ్జెస్-BZA-2025 **పని పేరు :** BZA డివిజన్: BZAVSKP విభాగం: ADEN/Br/N/BZA అధికార పరిధిలోని SSE/Br/I/RJY&SSE/Br/II/RJY విభాగం సుందర్ ADEN/Br/N/BZA అధికార పరిధిలోని సెక్షనల్ వంతెనల మెటలైజేషన్. **పూర్తయిన కాలం :** 12 (పన్నెండు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 2,16,66993/- **ఇఎండి (రూ.)** 258300/- **ముగింపు తేదీ:** 24/09/2025

1) టెండర్ నిబంధనలు / పూర్తిగా పని పేరు వివరాలు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైన వివరాలు www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) కాబోయే టెండరుదారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / సవరణను గమనించడానికి టెండర్ ముగింపు తేదీకి ముందు www.ireps.gov.in వెబ్సైట్‌ను సందర్శించాలని సూచించారు.
3) టెండర్ నోటీసు విజయవాడ డివిజన్లోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), ఎస్.సి.రైల్వే, విజయవాడ మరియు ADEN సబ్-డివిజనల్ కార్యాలయాలలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడుతుంది, దీనిని చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ**
A1325

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


## రూ.141 కోట్లు కట్టాలని ఆదాయపు పన్ను నోటీస్

**కిరాణా షాపు యజమాని షాక్!**

**బులంద్‌షహర్ :** సామాన్యుల పేరిట వేలు, లక్షలాది రూపాయల ఇన్కమ్ టాక్స్ నోటీసులు రావడం గురించి మనం తరచూ వింటూ ఉంటాం. అచ్చం అలాంటిదే ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో జరిగింది. ఓ సామాన్య కిరాణా షాపు యజమానికి వేలు, లక్షలు కాదు ఏకంగా రూ.141 కోట్లు చెల్లించాలంటూ ఇన్కమ్ ట్యాక్స్ నోటీసు వచ్చింది. దీనితో అతను ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయాడు. సాంకేతికత పెరుగుతున్న కొలది సామాన్య ప్రజల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న కేసులు బాగా పెరిగిపోతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇలాంటిదే తమ ఊళ్లోని కిరాణాషాపు యజమానికి జరగడంతో, కొత్వాలి ప్రాంతంలోని నాయగంజ్ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మొదట్లో పోలీసులు కూడా దీనిని నమ్మకపోవడం గమనార్హం. బులందర్ షహర్ జిల్లాలోని కొత్వాలి గ్రామానికి చెందిన సుధీర్ ఒక సాధారణ కిరాణా దుకాణం యజమాని. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇది ఇలా ఉండగా, ఒక రోజు సుధీర్ గుప్తాకు ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసు వచ్చింది. అందులో సుమారు రూ. 141,38,47,126 మేర పన్ను ఎగవేసినట్లు ఉంది. దానిని గడువులోగా ఆదాయ పన్ను శాఖ వారికి చెల్లించాలని అందులో ఉంది. దీనితో అతని కింద భూమి కంపించినట్లు అయ్యింది. ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయాడు. ఎందుకంటే ఒక సామాన్య కిరాణా దుకాణం నడుపుకుంటున్న వ్యక్తికి అన్ని కోట్ల రూపాయల మేర లావాదేవీలు చేయడం ఎలా సాధ్యం. అందుకే ఇన్కమ్ ట్యాక్స్ నోటీస్‌ను చూసి సుధీర్ గుప్తా ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఆ తరువాత కాస్త తేరుకుని, ఆ నోటీసు చదివితే అందులో తన పాన్ కార్డును ఢిల్లీలోని 6 కంపెనీలు వాడుతున్నట్లు సుధీర్ గుర్తించారు. అంతేకాదు ఆ కంపెనీలు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాలు తనవి కాదని తెలుసుకున్నాడు. దీనితో అతను కొత్వాలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో దీనిని పోలీసులు కూడా నమ్మలేకపోయారు. కానీ బాధితుడు చూపించిన ఇన్కమ్ ట్యాక్స్ నోటీసులు చూసి, వారు కూడా ఆశ్చర్యపోయారు. బాధిత వ్యక్తికి తెలియకుండా, అతని పాన్ కార్డును వినియోగిస్తున్న ఆరు కంపెనీలపై కేసు నమోదు చేశారు.

### మరాటా కోటా ఆందోళనలతో..

## ముంబయి స్తంభించింది

**పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్ని వీధులను ఖాళీ చేయాలని నిరసనకారులకు హైకోర్టు ఆదేశం**


**ఉద్యమనేత జరంగే నిరాహారదీక్షతో పరిస్థితి దారుణంగా మారిందని వ్యాఖ్య**



ముంబయి: మరాఠా కోటా ఆందోళన కారణంగా ముంబయి నగరం స్తంభించిపోయిందని, రిజర్వేషన్ ప్రచారకర్త మనోజ్ జరంగే దీక్షలో భాగంగా నాలుగో రోజు పచ్చి నీటిని కూడా తీసుకునేందుకు నిరాకరించడంతో పరిస్థితి దారుణంగా మారిందని బాంబే హైకోర్టు సోమవారం పేర్కొంది. నిరసన శాంతియుతంగా లేదని, ఆందోళనకు ముందు ఉన్న అన్ని పరిస్థితులను ఉల్లంఘించిందని గమనించిన హైకోర్టు, ముంబయిలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించాలని కోరిం ది. పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్ని వీధులను ఖాళీ చేయాలని ఆందోళనకు నాయకత్వం వహించిన జరంగే, అతని మద్దతుదారులకు మంగళవారం మధ్యాహ్నం నాటికి అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ముంబయికి వచ్చిన ఆందోళనకారులుఆక్రమించిన వీధులను ఎందుకు తొలగించడం లేదని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మరికొంతమంది నిరసనకారులు మహానగరంలోకి ప్రవేశించకుండా చూసుకోవాలని ఆదేశించింది. కోటా ఆందోళన, దాని పర్యవసానాలను హైకోర్టులో వాదించబడుతున్నప్పటికీ, 43ఏళ్ల కార్యకర్త పట్టు విడవకుం డా సంఖ్యాపరంగా బలంగా ఉన్న మరాఠా సామాజికవర్గానికి కోటా డిమాండ్లను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినకపోతే ఐదు కోట్లకు పైగా మరాఠాలు మహానగరంలోకి వస్తారని హెచ్చరించారు. ప్రతిష్టంభన మధ్య మరాఠా రిజర్వేషన్లపై క్యాబినెట్ సబ్‌కమిటీకి నాయకత్వం వహిస్తున్న సీనియర్ మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ ప్రకటన చేస్తూ మహాయుతి ప్రభుత్వం న్యాయస్థానంలో నిలబడేపరిష్కారం కోసం పనిచేస్తోందని చెప్పారు. కాగా, ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కేటగిరీ కింద ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో మరాఠా సామాజికవర్గానికి10శాతం రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ శుక్రవారం (ఆగస్టు 29) నుండి జరంగే ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష చేస్తున్నారు. సోమవారం నుండి ఆయన మంచినీటిని కూడా తీసుకోవడం నిలిపివేసినట్లుమద్దతుదారులు పేర్కొన్నారు. అయితే నిరసనకారులు ఆజాద్ మైదానంలోనే కాకుండా దక్షిణ ముంబయిలోని అనేక ముఖ్య ప్రాంతాలను దిగ్బంధించారని ప్రత్యేక విచారణలో జస్టిస్ రవీంద్ర ఘుగే, గౌతమ్ అంఖదేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, చర్చిగేట్ రైల్వే స్టేషన్లు, మెరైన్ డ్రైవ్ ప్రొమెనేడ్, హైకోర్టు భవనం వంటి ముఖ్యమైన ప్రదేశాలలో నిరసనకారులు గుమిగూడారని తెలిపింది. ఆందోళనశాంతియుతంగాజరగడంలేదని, ఆజాద్ మైదాన్‌లో శాంతియుత నిరసన నిర్వహించడానికి అనుమతి ఇచ్చినప్పుడు అధికారులు విధించిన ప్రతి షరతునుజరంగే,నిరసనకారులు ఉల్లంఘించారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జరంగే పేర్కొన్నట్లుగాఇకపై నిరసనకారులు ఎవరూ నగరంలోకి ప్రవేశించకుండా ప్రభు త్వం చూసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణకు మంగళవారం వాయిదా వేస్తూ, అప్పటిలోపు జరంగే ఆరోగ్యం మరింతదిగజారితే,ప్రభుత్వం అతనికి వైద్య సహా యం అందించాలని ధర్మాసనం పేర్కొంది. లక్షలాది మంది నిరసనకారులు వస్తారని జరంగే ప్రకటన చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలని యోచిస్తోందని కోర్టు ప్రశ్నించింది.

### ప్రాంతీయ,ప్రపంచ స్థిరత్వం,శాంతికి

## భారత్—రష్యా బంధం మూలస్తంభం



**తియాన్‌జిన్‌లో పుతిన్–మోదీ ద్వైపాక్షిక చర్చలు**

**డిసెంబరులో పుతిన్ భారత్ పర్యటన!**

**తియాన్‌జిన్:** దశాబ్దాలుగా భారత్–రష్యా మధ్య కొనసాగుతున్న మైత్రీబంధాన్ని ఇరు దేశాల అగ్రనాయకులు పునరుద్ఘాటించారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) 25వ వార్షికోత్సవ సదస్సు సందర్భంగా చైనా పురపాలక నగరం తియాన్‌జిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా మోదీని పుతిన్ ''డియర్ ఫ్రెండ్'' అని సంబోధించి ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో భారత్‌కు రక్షణ కవచంగా ఉన్నట్లు పరోక్షంగా చెప్పారు. సదస్సు ప్రాంగణంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌వెంటపుతిన్–మోదీభుజం భుజం కలిపి ముందుకు నడిచారు. ఈ దృశ్యాలను అంతర్జాతీయ మీడియా ప్రముఖంగా చూపించింది. సోమవారం ఎస్‌సిఒ సదస్సు పూర్తయిన తర్వాత జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో కూడా మోదీ దీనినే ప్రతిబింబిస్తూ, ''ఎంతో సంక్లిష్ట సమయాలలో కూడా భారత్–రష్యా ఎల్లప్పుడూ భుజం భుజం కలిపి నడిచాయి''అనిపుతిన్‌తోఅన్నారు. ఆర్థికరంగంలో ద్వైపాక్షిక సహకారం, పెట్టుబడులు, ఇంధన రంగంలో సహకారాలను మరింత విస్తరించడంపైనే చర్చల్లో ప్రధానంగా పుతిన్–మోదీ దృష్టి కేంద్రీకరించారు. అదేవిధంగా డిసెంబరులో పుతిన్ భారతదేశ పర్యటన గురించి కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. 140 కోట్ల మంది భారతీయులు మీకు స్వాగతం పలికేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక ప్రాధాన్యత గల వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి పెంచేవిధంగా రెండు దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేసి ఈ ఏడాది డిసెంబరు 21వ తేదీ నాటికి 15 సంవత్సరాలు పూర్తవుతాయి. ఆ సమయానికి పుతిన్ భారత్ పర్యటన చేస్తారని భావిస్తున్నారు. ''ప్రత్యేక,ప్రాధాన్యతగల ఎంతో లోతుగా వేళ్ళూనుకున్న మన వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ప్రతిబింబం, ఈ పర్యటన ఒక ప్రత్యేక అవకాశం,సంక్లిష్ట సమయాలలో కూడా మన రెండు దేశాలు ఎల్లప్పుడూ కలిసే ముందుకు నడిచాయి'' అన్నారు. ''మన సన్నిహిత సహకారం రెండు దేశాల ప్రజలకు మాత్రమే ముఖ్యం కాదు, ప్రపంచశాంతికి, స్థిరత్వానికి, ప్రపంచ సౌభాగ్యానికి కూడా ఎంతో ముఖ్యం'' అని పుతిన్‌కు మోదీ చెప్పారు. పుతిన్ కూడా చర్చల్లో మాట్లాడుతూ, ఇరు దేశాలూ వ్యూహాత్మక భాగస్వామ్య సూత్రాలద్వారా సహకారాన్ని ప్రోత్సహిస్తాయన్నారు.సూత్రాల ఆధారంగానే రెండు దేశాలమధ్యా బ హుముఖరంగాలలోబంధంబలోపేతంఅవుతోందన్నారు.

### త్వరగా ఉక్రేన్ యుద్ధం ముగించే మార్గం చూడండి : మోదీ

ఉక్రేన్‌లో శాంతి సాధనకు ఇటీవల జరిగిన అన్ని ప్రయత్నాలను పుతిన్‌తో చర్చల సందర్భంగా మోదీ ప్రస్తావించారు. యుద్ధ విరమణకు జరుగుతున్న కృషిపట్ల మోదీ హర్షం ప్రకటించారు. ఉక్రేన్‌తో శత్రుత్వాన్ని ముగించి, యుద్ధం విరమించేందుకు వీలైనంత త్వరగా ఒక మార్గాన్ని కనుగొనాలని ఆయనకు మోదీ విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా శత్రుత్వాలకు తెరదించేందుకు ఒక మార్గం కనుగొనాలనేది మానవాళి ఇస్తున్న పిలుపుగాపేర్కొన్నారు. ''ఉక్రేన్‌లో కొనసాగుతున్న యుద్ధంపై మేం రోజువారీ చర్చలు చేస్తున్నాం, శాంతి సాధనకోసం ఇటీవల జరిగిన అన్ని ప్రయత్నాలనూ మేం స్వాగతిస్తున్నాం, దీనితో ముడిపడి ఉన్న వారంతా రాబోయేకాలంలో నిర్మాణాత్మకంగా ముందుకు వెళతారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం, శాశ్వత శాంతి సాధనకు ఒక మార్గం కనుగొనాల్సి ఉంది, ఇది యావత్ మానవాళి ఆకాంక్ష'' అని మోదీ చెప్పారు. ఈ ద్వైపాక్షిక సమావేశానికి ముందుగా గడచిన శనివారం మోదీకి ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఫోన్‌చేసి పుతిన్‌తో సంభాషణల్లోయుద్ధం విరమించేందుకు కృషి చేయాలని కోరారు. భారత్ ఈ విషయంలో సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని కూడా పుతిన్‌వద్ద మోదీ ప్రస్తావించారని తెలుస్తున్నది. ప్రపంచంలో అతిపెద్ద చమురు ఎగుమతి దేశాల్లోరెండోస్థానంలోఉన్నరష్యాకుచైనా,భారత్ రెండూ అతిపెద్ద కొనుగోలుదారులుగా ఉన్నాయి. ఈ వాణిజ్య బంధాన్నితెంచేందుకు టారిఫ్‌ల భారంతో డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఎస్‌సిఒ సదస్సులో జిన్‌పింగ్,పుతిన్,మోదీల కలయిక సందడి, ముఖాముఖీ భేటీలపరిణామాలుఅమెరికాకుచెంపపెట్టుగా మారాయి.

### ఒకే కారులో వెళ్ళేందుకు మోదీకోసం 10 నిమిషాలు ఎదురుచూసిన పుతిన్

నాయకులు ఇద్దరూ అధికారికంగా ద్వైపాక్షిక సమావేశం జరపడానికి ముందుగా, లాంఛనపూర్వకంగా సంభాషణ జరిపారు. సోమవారం అధికారికంగా జరిగిన ఎస్‌సిఒ సదస్సు ప్రారంభానికి ముందుగా నాయకులు అందరూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పుతిన్–మోదీ ఆలింగనం చేసుకుని పలకరింపులు పూర్తయ్యాక సదస్సు ప్రారంభమైంది. సదస్సు అనంతరం వారిద్దరూ ద్వైపాక్షిక చర్చలు జరిపే ప్రాంగణానికి వెళ్ళేందుకు ఒకే కారులో ప్రయాణం చేశారు. మోదీ,పుతిన్ వేరు వేరు కార్లలో ప్రయాణం చేయకుండా ఒకే కారులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా మోదీ ప్రత్యేకంగా అందరికీ తెలియజేశారు. రెండు దేశాల నాయకుల మధ్యా సంబంధాలు, చర్చలు ఎప్పుడూ ఎంతో లోతుగా ఉభయతారకంగా జరుగుతాయని ట్విట్టర్‌లో రాశారు. పుతిన్‌తో చర్చలు అద్భుతంగా జరిగాయన్నారు. ఐతే పుతిన్ కారు దగ్గరకు చేరుకునేందుకు మోదీకి కొంత ఆలస్యమైంది. కానీ పుతిన్ తనొక్కరే కారులో ద్వైపాక్షిక సమావేశ ప్రాంగణానికి వెళ్ళిపోకుండా 10 నిమిషాల సేపు మోదీకోసం ఎదురుచూశారు. మోదీ వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి కారు ఎక్కి పక్కపక్కనే కూర్చుని చర్చల ప్రాంగణానికి చేరుకున్నారు. అన్నింటికంటే ముఖ్యమైన విషయం మరొకటి ఏమిటంటే, కారులో ప్రయాణం చేసి చర్చల ప్రాంగణానికి చేరుకున్న తర్వాత కూడా వారిద్దరూ మరో 45 నిమిషాలపాటు గడిపారని ఈ విషయాన్ని సన్నిహితంగా పరిశీలించినవారు పేర్కొన్నారు. 3000 మంది పాత్రికేయులు, మీడియా సిబ్బంది ప్రత్యేకదృష్టి కేంద్రీకరించారు.

ప్రజాపక్షం
మంగళవారం, 02 సెప్టెంబరు

# సరైన దిశలో మోదీ–జిన్‌పింగ్ చర్చలు

చైనాలోని తియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) అగ్రనాయక సమావేశం సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ఆదివారం జరిగిన సంభాషణలు సానుకూల దృక్పథంతో సంబంధాల వృద్ధి దిశలో ఉండటం హర్షించదగినది. ఈ ఇరుగుపొరుగు దేశాల అధినేతలు 7 సంవత్సరాల తదుపరి ముఖాముఖి చర్చలు జరిపారు. 2020లో గాల్వాన్‌లో సరిహద్దు ఘర్షణల దరిమిలా ఇరుదేశాల మధ్య పూర్తిగా క్షీణించిన సంబంధాలు, గత సంవత్సరం కజాన్‌లో వారిరువురి భేటీ తర్వాత వేగంగా మెరుగుపడుతున్నాయి. అందువల్ల సరిహద్దు సమస్య పరిష్కారానికి కృషి కొనసాగిస్తున్నారు, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలను ఆ సమస్యతో ముడిపెట్టకూడదని నిర్ణయించారు. అయితే సరిహద్దు వెంట ప్రశాంతతకుగల ప్రాముఖ్యతను వారు విస్మరించలేదు.

అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ప్రస్తుత చర్చలు జరిగాయి. ఆసియాలో ఏ దేశంపై లేనంతగా భారత్‌నుంచి దిగుమతులపై 50శాతం సుంకాలు విధించటం తెలిసిందే. ఆ తర్వాత భారత విదేశాంగ విధానంలో మార్పు వచ్చిందన్న భావన లేకపోలేదు. మోదీ గత కొద్ది సంవత్సరాలుగా అమెరికా విదేశాంగ విధానంతో భారత్ వైఖరులను జతచేశాడన్న భావన వర్ధమాన ప్రపంచంలో లేకపోలేదు. ఆకస్మిక నిర్ణయాలు తీసుకునే ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాలు తగ్గిస్తే, రష్యన్ ఆయిలు కొంటున్నందుకు విధించిన 25 శాతం పెనాల్టీ ఎత్తివేస్తే మోదీ వైఖరి మారుతుందా అనే సందేహం లేకపోలేదు. అయితే 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి'ని మోదీ–జిన్‌పింగ్ గుర్తించటం, రెండు దేశాల మధ్య సంబంధాలను మూడవదేశం కళ్లద్దాలనుంచి చూడరాదన్న నిర్ణయాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తే అపోహలకు, అపార్థాలకు అవకాశాలు తగ్గుతాయి. పోటీదారులుగా గాక భాగస్వాములుగా పరస్పరం పరిగణించుకోవాలని భావించారు.

దక్షిణ చైనా సముద్రంలో చైనాను నియంత్రించేందుకు అమెరికా ఏర్పాటు చేసిన క్వాడ్‌లో భారత్ సభ్యురాలిగా ఉండటం భారత్–చైనా మధ్య సంబంధాల మెరుగుదలకు పెద్ద అవరోధంగా ఉంది. అయితే ప్రతి ఒక్క దేశం 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' కలిగి ఉంటుందని జిన్‌పింగ్ అంగీకరించటం మోదీకి ఊరట ఇచ్చింది. ఎందుకంటే ఈ ఏడాది చివర క్వాడ్ అగ్రనాయక సమావేశానికి మోదీ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే ట్రంప్ ఈ సమావేశానికి రావటం లేదని ప్రకటించటం, జపాన్ లాంటి మూడో దేశంలో ఆ సమావేశం జరగవచ్చన్న వార్తలు మోదీకి నెత్తిమీద పాలుపోసిన చందమైంది. భారత్, చైనాల స్వతంత్ర విదేశాంగ విధానాన్ని వక్కాణించినందున ఇండియా క్వాడ్‌లో కొనసాగుతూనే అదే సమయంలో చైనా, రష్యాలతో సంబంధాలు కొనసాగించే సౌలభ్యం ఏర్పడింది. చైనాకు నేరుగా విమాన సర్వీసులు నడపటం, చైనీయులకు టూరిస్టు వీసాలు మంజూరు సులభతరం చేయటం, మానస సరోవర్ యాత్రకు చైనా అనుమతించటం, పరస్పరం జర్నలిస్టులను నియమించుకోవటం ఈ చర్చల సానుకూల ఫలితాల్లో ఉన్నాయి. చైనా పెట్టుబడులను భారత్ అనుమతించటం, భారత్‌నుంచి వ్యవసాయోత్పత్తులు, తయారీ వస్తువుల దిగుమతిని చైనా పెంపుచేయటం పరస్పర వాణిజ్యాభివృద్ధిలో ఉభయతారకంగా ఉంటుంది.

టెర్రరిజంపై వైఖరుల్లో తేడాలు ఇరుదేశాల మధ్య మరో వివాదాంశం. అయితే ఎస్‌సిఓ సంయుక్త ప్రకటన పహల్గాం హత్యలను ప్రస్తావించింది, వాటిని ప్రోత్సహించిన వారిపై చర్యలను కోరటం విశేషం. పాకిస్తాన్ పేరు ఎత్తకపోయినా, తీర్మానంలోని భాష ఎస్‌సిఓ రక్షణ మంత్రుల ప్రకటనకన్నా పదునుగా ఉంది. ఆ ప్రకటనపై మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంతకం చేయలేదు.

భారత్, చైనల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల ఇప్పుడు ప్రారంభమవుతుంది, ప్రజలమధ్య సంబంధాలు మొదలవుతాయి. ప్రధాని మోదీ అమెరికా పట్ల మొగ్గు తగ్గించి విదేశాంగ విధానంలో 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి'ని కచ్చితంగా పాటిస్తే అమెరికా, రష్యా, చైనాలతో ఏకకాలంలో వ్యావహారిక సంబంధాలు నెరపటం సాధ్యమే!

# ప్రజలు కమ్యూనిస్టుల అవసరం గుర్తిస్తున్నారు

తమదాకా వస్తే కానీ విలువ తెలియదన్నట్లు ఇప్పుడు పెట్టుబడిదారి మతోన్మాదశక్తులు పెచ్చరిల్లుతూ ప్రజల జవజీవాలను శాసించేందుకు ప్రయత్నిస్తు న్న వేళ వీటిని ఎదుర్కొనేందుకు ఓ శక్తి అవసరం అన్న భావన రోజు రోజుకు బలపడుతుంది. కార్పొరేట్లు, మతోన్మాదులు, నయా పెట్టుబడిదారి వర్గా లు హక్కులను, ఆస్తులను, స్వేచ్ఛను హరించేందుకు బరితెగించిన సమయంలో వీళ్లను నిలువరించగలిగేది కమ్యూనిస్టులు మాత్రమేనన్న మాటలు ఇప్పుడు సర్వత్రా వినపడుతున్నాయి. ఒకప్పటి కమ్యూనిస్టు కుటుంబాల నేపథ్యం ఉన్నవారో, అభ్యుదయ వాదులో, అధికారం కోసం కమ్యూనిస్టులను కోరుకుంటున్న వారో అంటే చర్చనీయాంశం కాదు. బూర్జువా రాజకీయ పార్టీలలో పుట్టి అదే రాజకీయాలలో కొనసాగుతున్న వారు, పెట్టుబడి దారి వారసత్వం కలిగిన వారు, గతంలో ఎన్నడు కమ్యూనిస్టులతో సన్నిహిత్యం లేని వారు, కొద్దో, గొప్పో ప్రజల పక్షాన ఆలోచించే వారు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారు. అంతే కాదు కమ్యూనిస్టుల అవసరాన్ని ఆయా సందర్భాలలో ప్రజలకు విడమడిచి వివరిస్తున్నారు. ఇష్టాను సారంగా లంచాలు తీసుకుంటూ పైసలు ఇస్తే తప్ప పనులు చేయని అధికారులను చూసిన ప్రతిసారి సామాన్యుడు సైతం కమ్యూనిస్టులు బలంగా ఉంటే అధికారులు ఇలా బరితెగించే వారా, ఇలా జరగనిచ్చే వారా అని మదనపడుతున్నాడు.

కమ్యూనిస్టులు బలంగా ఉంటే యూరియా కొరత గురించి ఎంతగా కొట్లాడే వారు రాష్ట్రమే స్తంభించేది అంటూ యూరియా కోసం క్యూలో నిలబడ్డ రైతు ఆవేదనతో కమ్యూనిస్టులను గుర్తు చేసుకుంటున్నాడు. కమ్యూనిస్టులంటే ద్వేషభావంతో చూసిన వారు సైతం ఇప్పుడు కమ్యూనిస్టులను గుర్తు చేసుకుం టూ వారుంటే బాగుండేదన్న భావన వ్యక్తపరుస్తున్నారు. అవకాశవాద రాజకీయాలకు పెటెంట్‌గా చెప్పుకునే అనేక మంది నేతలు సైతం కమ్యూనిస్టులు బలంగా ఉంటే బాగుంటుందన్న భావనకు రావడంతో పాటు రాజకీయాలు బాగుండేవి అంటుండటం విశేషం. నక్సల్స్ ఉన్నప్పుడు లేచింది మొదలు వారి వినాశనాన్ని కోరుకున్న వారు నయా అవకాశవాదులను చూసి నక్సల్స్ ఉంటే వీళ్ల పని ఇంత జోరుగా ఉండేదా అంటున్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిడి పెరిగి స్వేచ్ఛగా విధులు నిర్వర్తించలేక సామాన్యుడి ఆవేదనను విని కనీసం ఏ సహాయం చేయలేని నిస్సహాయస్థితిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చేయాల్సిన పని గురించి ఉన్నతాధికారికి అమాత్యులు ఫోన్ చేసినప్పుడు ఆ అధికారి మదిలోనూ కమ్యూనిస్టుల అవసరం మెదులాడుతుంది. ఒక్క మతోన్మాద శక్తులు వారి అండతో లక్షల కోట్లు ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన వారు రాజకీయాలను ఆదాయ మార్గాలుగా ఎంచుకుని కోట్లకు పడగలెత్తిన వారు తప్ప మిగిలిన వారు ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు ఉండాలి అని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కొందరైతే గొంతెత్తి అరుస్తున్నారు. కమ్యూనిస్టులను బలపర్చండి అని పిలుపునిస్తున్నారు.

కమ్యూనిస్టులు ఈ అవసరాన్ని అందిపుచ్చుకోవాలి . ప్రజలు ఏమి కోరుకుంటున్నారో ఆ దిశగా ఆలోచనలు చేయడం చైతన్యవంతుల లక్షణం. కొన్ని చోట్ల సమాజాన్ని, రాజకీయాలను ప్రభావితం చేస్తూ మరికొన్ని చోట్ల ఉనికిని చాటుకున్న కమ్యూనిస్టులు రాజకీయ, సైద్ధాంతిక అవగాహనను ప్రజలకు కల్పించాలి. విరివిగా సభలు, సమావేశాలు, సదస్సులు నిత్య సంబంధాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నికల్లో డబ్బులు అలవాటు చేసిన బూర్జువా పార్టీలు ఎన్నికల రీత్యా కమ్యూనిస్టులను బలహీన పరిచాయి. ఎన్నికల నాటి లాభమే చూసుకున్నారే తప్ప తర్వాతి పరిణామాలను ప్రజలు ఆలోచించ లేదు. ఇప్పటికీ మెజార్టీ ప్రజల మదిలో నష్టపోయామన్న ఆలోచన పురుడు పోసుకోలేదు. కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరచాలి. సుదీర్ఘ రాజకీయ ప్రయాణం, ఉన్నత లక్ష్య సాధనలో ఎన్నికలే సర్వస్వం కాదని అది ఒక భాగమేనన్న ఆలోచన ముందుగా కమ్యూనిస్టు నాయకుల్లో బలపడాలి. గెలుపు లేని ఓటమితో ఎలా పనిచేస్తామన్న నైరాశ్యాన్ని వీడి ప్రజల్లోకి వెళ్లి ప్రజలతో ఓట్ల వేళ పెరిగిన దూరాన్ని ఓటు లేని సమయంలో దగ్గర చేసుకోవాలి.

రాజకీయ అవగాహనను కల్పిస్తూనే స్థానిక సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించడం కమ్యూనిస్టుల బలోపేతం కోరుకునే వారి లక్ష్యం కావాలి. దూరంగా వందమంది మరణించిన ఘటన కంటే స్థానికంగా ఒకరికో ఇద్దరికో ప్రమాదం జరిగితే స్థానిక ప్రమాదంపైనే ప్రజల ఆలోచన ఉంటుందన్న దాని ని ప్రామాణికంగా తీసుకుని మతోన్మాద ప్రమాదం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరిస్తూనే స్థానిక సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాల్సి ఉంది. అందుకు కమ్యూనిస్టు పార్టీలు ఒక కార్యాచరణను రూపొందించుకోవాలి. స్థానిక సమస్యలపై స్పందన పెరగాలి. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కమ్యూనిస్టు నాయకులు ఉండి అక్కడకు వచ్చే వారిని పరిచయం చేసుకుని సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేసేవారు. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాల ఏర్పాటుకు ఇది ఒక మార్గంగా ఉండేది. కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన వేళ రాజకీయంగా సైద్ధాంతికంగా ప్రజల్లోకి వెళ్లడమే కర్తవ్యం కావాలి. నిత్యం అందుబాటులో ఉండటం కూడా ప్రజలను చైతన్య పరిచే మార్గాలలో ఒకటి. కమ్యూనిస్టుల బలోపేతమే లక్ష్యం కావాలి. ఇదే సమయంలో కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన వారి దన్ను కమ్యూనిస్టులకు కావాలి.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# భారత కమ్యూనిస్టు పార్టీ ఆరంభకాలం

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) 1925 డిసెంబర్ 25న కాన్పూర్‌లో ఏర్పడింది. అప్పటినుండి అనేక కాంగ్రెస్‌లు, సభలు జరుపుకుంది. అవి ఆ కాలమాన పరిస్థితులను అంచనావేసి అనేక రాజకీయ, సైద్ధాంతిక, కార్యక్రమ సంబంధవైఖరులు రూపొందించుకున్నాయి. అహ్మదాబాద్ కాంగ్రెస్ సెషన్(1921)లో మౌలానా హస్రత్ మొహాని అనే కమ్యూనిస్టు 'సంపూర్ణ స్వాతంత్ర్య' తీర్మానం ప్రతిపాదించిన విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవలసిన అంశం. అన్ని రకాల విదేశీ నియంత్రణ నుంచి పూర్తి స్వేచ్ఛను కోరింది ఆ తీర్మానం. అయితే ఓటింగ్‌లో ఆ తీర్మానం వీగిపోయింది. సిపిఐ సంస్థాపన మహాసభ నుంచి ఇప్పటికి 24 కాంగ్రెస్‌లు (జాతీయ మహాసభలు) జరుపుకుంది. ఈ సెప్టెంబర్ 21–25 తేదీల్లో చండీఘడ్ (పంజాబ్)లో 25వ పార్టీ కాంగ్రెస్ జరుపుకుంటున్న సందర్భంగా ఆ మహాసభలు, పార్టీ అగ్రనాయకత్వం గూర్చి సూక్ష్మంగా తెలుసుకుందాం.

**సిపిఐ సంస్థాపన మహాసభ – కాన్పూర్, 1925**

సిపిఐ సంస్థాపన మహాసభ 1925 డిసెంబర్ 25–29 తేదీల్లో కాన్పూర్‌లో జరిగింది. ఆ మహాసభ కన్వీనర్ సత్యభక్త. 1925 జూన్ 18న ఆయన పంపిన సర్క్యులర్ లేఖలో కమ్యూనిస్టు పార్టీ అంతిమ ధ్యేయం ''భారతదేశంలో సంపూర్ణ స్వేచ్ఛ స్థాపన. న్యాయమైన సమాజ నిర్మాణం'' అని తెలిపారు.

కాన్పూర్‌లో కమ్యూనిస్టుల మహాసభకు చైర్మన్‌గా వ్యవహరించిన సింగారవేలు ఎం.చెట్టియార్ తమ ప్రసంగంలో : ''....అన్ని సబబైన మార్గాల ద్వారా స్వరాజ్యం లేదా సంపూర్ణ స్వాతంత్ర్య స్థాపన పార్టీ తక్షణ ధ్యేయం'' అన్నారు. కాగా మొహాని, సింగారవేలు ఇరువురూ తమ ప్రసంగాల్లో స్వరాజ్యం అంటే సంపూర్ణ స్వాతంత్ర్యం అని స్పష్టంగా భాష్యం చెప్పారు.

కాన్పూర్ మహాసభ (1925)లో సిపిఐ ఆమోదించిన కాన్‌స్టిట్యూషన్ (నిబంధనావళి) ఆర్టికల్ 1 ''బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి దేశాన్ని విముక్తి చేయటం పార్టీ లక్ష్యాల్లో ఒకటిగా'' పేర్కొన్నది. తమ సభ్యులు కాంగ్రెస్ లోపల కూడా ఉండాలని పార్టీ నిర్ణయించింది.

ఎస్.వి.ఘాటె, జె.పి.బాగెర్‌హట్టలను ప్రధాన కార్యదర్శులుగా, సింగారవేలును చైర్మన్‌గా మహాసభ ఎన్నుకుంది.

**1927లో బొంబాయిలో సిఇసి విస్తృత సమావేశం**

1927 మే 29–31 తేదీల్లో బొంబాయిలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ విస్తృత సమావేశం (జనరల్ బాడీ అని కూడా అనేవారు) పార్టీ నిబంధనావళి, కార్యక్రమం(ప్రోగ్రాం)ను సవరించింది. సిపిఐ నిబంధనావళి ప్రోగ్రాంకు సంబంధించిన పేరా 6లో ''(ఎ)(1) సంపూర్ణ జాతీయ స్వాతంత్ర్యం, సార్వజనీన ఓటు హక్కు ప్రాతిపదికపై ప్రజాతంత్ర రిపబ్లికన్ స్థాపన'' లక్ష్యాన్ని ప్రతిపాదించింది.




కమ్యూనిస్టులు ఎఐసిసి లోపల దాని అతివాద విభాగం సహకారంతో రిపబ్లికన్‌వాదుల విభాగాన్ని ఏర్పాటు చేయతలపెట్టారు. ఎస్‌వి ఘాటేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

**1933లో కలకత్తా మహాసభ**

1933లో మీరట్ కుట్రకేసు ఖైదీలు విడుదలైనాక, 1933 డిసెంబర్‌లో కలకత్తాలో సిపిఐ చిన్నపాటి మహాసభ (కాన్ఫరెన్స్) జరిగింది. అది రాజకీయ తీర్మానాన్ని, పార్టీ కొత్త నిబంధనావళిని ఆమోదించింది. డాక్టర్ జి.అధికారి ప్రధాన కార్యదర్శిగా కొత్త కేంద్ర కమిటీని ఎన్నుకుంది. ఆయన అరెస్టు అయినాక, ఎస్.ఎస్.మిరాజ్‌కర్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తర్వాత కొంతకాలానికి ఆయన స్థానంలో సోమనాథ్ లాహిరి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకోవలసిన అవసరాన్ని ఆ మహాసభ వక్కాణించింది.

**సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ఆమోదించిన కాంగ్రెస్**

భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి)మద్రాసు(1927),కలక త్తా (1928), లాహోర్ (1929) సభలు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యం గా ఆమోదించటంలో ముఖ్యమైనవి. సిపిఐ, డబ్ల్యుపిపి (వర్కర్స్–పెజెంట్ పార్టీ) కీలకమైన పాత్ర పోషించాయి. మద్రాసు సభలో విషయ నిర్ణాయక కమిటీ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని కెఎన్.జోగ్లేకర్ (సిపిఐ) ప్రతిపాదించగా, జవహర్‌లాల్ నెహ్రూ బలపరిచారు. తీర్మానం ఆమోదం పొందింది. బహిరంగ సమావేశంలో ఆ తీర్మానాన్ని నెహ్రూ ప్రతిపాదించగా, జోగ్లేకర్ బలపరుస్తూ మాట్లాడారు. అది ఏకగ్రీవామోదం పొందింది.

కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో (1928) సిపిఐ, డబ్ల్యుపిపి నాయకత్వాన 50వేలమందితో పెద్ద ఊరేగింపు కాంగ్రెస్ పెండాల్‌లో ప్రవేశించింది. ప్రెసిడెంట్ మోతీలాల్ నెహ్రూ అందుకు అనుమతి ఇచ్చారు. జోగ్లేకర్, జవహర్‌లాల్ ప్రసంగించారు. సంపూర్ణ స్వాతంత్ర్యానికి మద్దతుగా ఆ ర్యాలీ జరిగింది. పర్యవసానంగా, సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యాన్ని సంవత్సరం లోపు ఆమోదించటానికి కాంగ్రెస్ నిర్ణయించింది. అంతిమంగా, 1929 డిసెంబర్ 31న దాని లాహోర్ సభ ఆ తీర్మానం ఆమోదించింది. అందులో ఇలా చెప్పింది.

''గత సంవత్సరం కలకత్తా కాంగ్రెస్ సభలో ఆమోదించిన తీర్మానం ప్రకారం, ఈ కాంగ్రెస్, కాంగ్రెస్ కాన్‌స్టిట్యూషన్ ఆర్టికల్ 1లో పొందుపరిచిన ''స్వరాజ్'' పదానికి అర్థం సంపూర్ణ స్వాతంత్ర్యం అని ప్రకటిస్తున్నది''

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా పి.సి.జోషి 1935**

పిసి.జోషి 1935 లో సిపిఐ ప్రధాన కార్యదర్శిగా నియమించబడ్డారు. నేషనల్ ఫ్రంట్ పేరుతో విశాలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటు చేయటం ద్వారా సంపూర్ణ స్వాతంత్ర్య సాధన నినాదాలను ఆయన ముందుకు తెచ్చారు.

**(సిపిఐ తొలి చైర్మన్, ప్రధాన కార్యదర్శుల జీవిత సంగ్రహాలు రేపు తెలుసుకుందాం – సం॥)**

# యూరియా కోసం ఎందుకీ పడరాని పాట్లు?



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

రాష్ట్రంలో గత వారం, పది రోజులుగా యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పిఎసిఎస్) ముందు వందల సంఖ్యలో పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్ లతో క్యూ లైన్ లో గంటల తరబడి ఉంటున్న పరిస్థితులు చూస్తుంటే.. చాలా బాధ కలుగుతుంది. ఆరుగాలం కష్టిం చి దేశానికి అన్నం పెట్టే రైతులకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. యూరియా సరఫరా లేదా! కేంద్రం సరఫరా చేయటం లేదా! ప్రభుత్వం ఏం చేస్తుంది! ప్లానింగ్ లేదా! కృత్రిమ కొరత ఉందా! బ్లాక్ జరుగుతుందా! పక్క రాష్ట్రాలకు పోతుందా! అధిక ధరలకు అమ్ముతున్నారా! వంటి సందేహాలు రాకమానవు. రైతుల బాధలు వర్ణనాతీతం. ఏది ఏమైనా రైతులకు యూరియా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది. యుద్ధ ప్రాతిపదికపై ఎరువులను తెప్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

యూరియాకోసం అర్ధరాత్రి నుంచే రైతు లు వ్యవసాయ గోదాముల వద్ద లైన్‌లో ఉంటూ అరిగోస పడుతున్నారు. ఒక బస్తా అయినా దొరక్కపోదా అంటూ జాగారం చేస్తున్నారు. కొన్నిచోట్ల యూరియా లేదని చెప్పడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో వివిధ జిల్లా, మండల కేంద్రాల్లో యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు చెప్పరానివిగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాథమిక సహకార సంఘానికి యూరియా లారీ వస్తుందని తెలియగానే అర్ధరాత్రి నుంచే రైతులు క్యూ కట్టారు..అక్కడే నిద్రించారు.7 గంటలు నిరీక్షిస్తే ఒక యూరియా బస్తా దక్కిందని రైతులు వాపోయారు. నల్లగొండ జిల్లా నిడ్మానూరు మండల కేంద్రంలో యూరియా వస్తుందని తెలిసి తెల్లవారుజాము నుంచే క్యూ లైన్ ఉన్న రైతులు.. యూరియ రాక పోవడం తో రోడ్డెక్కారు. రెండు గంటలపాటు జడ్చర్ల–కొదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మిర్యాలగూడ లో.. సూర్యాపేటలో ఇదే పరిస్థితి. ఉత్తర తెలంగాణ జిల్లాలో ఇప్పటికే ప్రాథమిక సహకార సంఘాల వద్ద ఎరువుల కోసం కుస్తీలు పడుతున్న సంగతి చూస్తున్నాం.

**ఎందుకు ఈ పరిస్థితి దాపురించింది!**

తెలంగాణలో గత కొన్ని సంవత్సరాలుగా వరి సేద్యంతో పాటు పంటల విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. దీని కనుగుణంగా ఈ సంవత్సరం 20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం 9.5 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని 8.5లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. కానీ ఆగస్టు చివరి నాటికి రాష్ట్రానికి చేరింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. డిమాండ్ ఎక్కువగా ఉండటం సరఫ రా తక్కువగా ఉండటం..ఈ సీజన్‌లో వర్షాలు ముందుగానే రావడంతో జూన్ జులై లోనే పంటల సేద్యం మొదలుపెట్టారు. దీనితో ఎరువుల కోసం ముఖ్యంగా యూరియా కోసం రైతులు గోదాముల చుట్టూ తిరుగుతున్నారు.డబ్బులు ఉన్న రైతులు.. ముందుచూపుతో వీలున్న కాడికి అదనంగా కొనుగోలుచేసి పెట్టుకుంటున్నారు. దీనితో మార్కెట్లో ఎరువుల కొరత మొదలైంది. ఇదే అదు ను చూసి కొంతమంది డీలర్లు, ప్రైవేట్ ఏజెన్సీలు వివిధ మార్గాల ద్వారా సేకరించుకొని బ్లాక్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో రూ.266 లున్న యూరియా బస్తాను రూ.400 లకు కొంటున్నామని..డబ్బులు లేని రైతులు ఉద్దెరతో రూ.450లకు డీలర్ల వద్ద పంట మీద ఇస్తామని తీసుకుంటున్నామనీ తెలుపుతున్నారు. ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతాంగంలో ఆందోళన మొదలైంది.

**యూరియా కోసం పార్లమెంట్ సభ్యులు ధర్నా**

రాష్ట్రంలోఎరువులకోసం రైతులు పడుతున్న పాట్లను కేంద్రం దృష్టికి తీసుకుపోవడానికి.. కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు పార్లమెంటు ఆవరణలో ఆగస్టు 20న తక్షణమే ఎరువులు కేటాయించాలని ధర్నా చేపట్టిన నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి 50 వేల మెట్రిక్ టన్నులు 10 రోజులలో పంపిస్తామని వాగ్దానం చేసి ఆగస్టు 25న 30 వేల టన్నులు వచ్చిందని.. అయినా డిమాండ్ ఎక్కువగా ఉందని తక్షణమే 2.9 లక్షల టన్నులు పంపించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తుంది.

**పంటల విస్తీర్ణంలో వరి ప్రథమ స్థానం**

రాష్ట్రంలో పంట విస్తీర్ణాలు ఏటేటా పెరగడంతో ఎరువుల డిమాండు పెరుగుతుంది. ఈ సంవత్సరం 1.32 కోట్ల ఎకరాలు సేద్యం జరుగుతుందని వ్యవసాయ శాఖ తెలుపుతుంది. ప్రధానంగా యూరియాను ఎక్కువగా వాడే పంటల్లో వరి ప్రథమ స్థానంలో ఉంది. ఏటా వరి విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. మొక్కజొన్న సైతం ఈసారి భారీగా పెరిగింది. దాని సాధారణ విస్తీర్ణం 5.21 లక్షల ఎకరాలు కాగా..ఈసారి 6.48 లక్షలు ఎకరాల్లో వేశారు. పత్తి గత సంవత్సరం 42.07 లక్షల ఎకరాల్లో సాగు చేయ గా, ఈసారి అది 44.91లక్షల ఎకరాలకు చేరింది. దీనితో ఎరువుల వాడకం బాగా పెరిగింది.

రాష్ట్రానికి ఏటా రెండు సీజన్లకు కలిపి 14 లక్షల టన్నుల మేర ఎరువులు సరఫరా అవుతుండగా.. వానా కాలంలో 9లక్షల టన్నుల కంటే అధికంగా యూరియా ను వినియోగిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలు యూరియాకు కీలకమైనవి. ఇప్పటికే 3 లక్షల టన్నుల కొరత ఉండగా..ప్రాజెక్టులు పూర్తిగా జలకళలతో నిండి ఉన్నా యి. వరి సేద్యం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనితో సెప్టెంబర్‌లో యూరియా మరింత పెరిగే అవకాశం ఉంది

**కేంద్రం రసాయన ఎరువులు తగ్గించాలనీ కోరుతుంది!**

దేశంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమైన యూరియా ఉత్పత్తి ని, సరఫరాని తగ్గిస్తుండగా.. మరోవైపు మన రాష్ట్రంలో వినియోగం భారీగా పెరుగుతుంది. రాష్ట్ర అవసరాల మేరకు కేంద్రం ఎరువులను సరఫరా చేయలేని పరిస్థితి నెలకొనగా.. రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్‌పి కాంప్లెక్స్ ఎరువులను కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. ఇందులో యూరియా వినియోగం ఎక్కువ. గత ఏడాది ఏప్రిల్, మే మాసాలకు కలిపి దేశంలో, 50.36 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది అది 44.25 లక్షల టన్నులకు తగ్గింది. యూరియా ఉత్పత్తి తగ్గుదలతో పాటు రష్యా – ఉక్రేన్ యుద్ధం, చైనా ఆంక్షలతో దిగుమతులు తగ్గిపోయాయి. దీంతో కేంద్రం రాష్ట్రాలకు నిర్ణయించి కేటాయింపులు మేరకు సరఫరా చేయడం లేదు. యూరియా ఎరువులు సరిపోను అందుబాటులో లేవు. దీనికి బాధ్యులు మీరంటే.. మీరు అన్నట్లు అధికారంలో ఉన్న.. కేంద్ర రాష్ట్ర మంత్రుల ఆరోపణలు చూస్తూంటే.. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ నాయకులు..పాలకుల వైఫల్యమే అంటూ.. ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రా లు గుప్పిస్తున్నారు. విమర్శలు మాటలు పక్కకు పెట్టండి రైతాంగానికి యుద్ధ ప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగే విధంగా చూడండి అంటూ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకీ కొరత ఏర్పడింది,ఎవరు కారణం?**

ఎందుకీ అగచాట్లు వస్తున్నాయని పరిశీలించితే.. కొన్ని విషయాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువుల రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి.

రాష్ట్రంలో గత సంవత్సరంలో వేసిన పంటలు దృష్టిలో పెట్టుకుని 10 శాతము విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్లాన్ రూపొందించి రాష్ట్రానికి 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కోరినామని ప్రభుత్వం చెబుతుంది.కానీ రాష్ట్రానికి కేంద్రం కేటాయించింది 9.80 లక్షల మెట్రిక్ టన్నులు. కానీ ఇస్తానన్నది 8.30 లక్షల మెట్రిక్ టన్నులు. నేటికి సరఫరా అయినవి 5.66 మెట్రిక్ టన్నులు మాత్రమే.

**ఎరువుల కేటాయింపులో వివక్ష ఉందా!**

కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు పరిశీలించితే తెలంగాణపై కొంత వివక్ష చూపిస్తున్నట్టుగానే కనిపిస్తుంది. తెలంగాణకు కేటాయించిన పూర్తి కోట ఇవ్వాలని ఈనెల 20న పార్లమెంట్ భవనం ముందు తెలంగాణ పార్లమెంటు సభ్యులు ధర్నా చేస్తే 50 వేల టన్నులు మాత్రమే పది రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చారు.

జూన్, జులై, ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరాచేయాల్సిఉండగా, ఈ నెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయ శాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నులు లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మ్యానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని.. రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వం ప్రకటిస్తుంది.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్ర వద్ద నిల్వలు ఉన్నాయని.. ఎప్పటి కప్పుడు పంపుతున్నామని.. రూ.80,000కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యా స్పదంగా ఉంది.

యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవాలి.. చైనా నుండే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రం పై విమర్శలు ఉన్నాయి.

పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. సరిహద్దు రాష్ట్రాల్లో కూడా ఎరువుల కొరత ఉండటంతో సరిహద్దు జిల్లాల నుండి కర్ణాటకకు, మహారాష్ట్రకు, ఏపికి దొంగచాటుగా తరలిస్తున్నట్టు ఇటీవల చెక్ పోస్టుల వద్ద బయటపడింది.

తెలంగాణ వ్యవసాయ జిడిపికి వరి, పత్తి, మొక్కజొన్న, పప్పులు గింజ పంటలే మూలాధారం. రాష్ట్రంలో సగం సాగు భూముల్లో 1.5 శాతం ఉండాల్సిన సేంద్రీయ కర్బనం వాస్తవంగా 0.5 శాతమే ఉంది. జింకు 50 శాతం, బోరాన్ 25 శాతం, ఇనుము 8 శాతం మేరకు మొదలైన సూక్ష్మ పోషకాల కొరత బాగా నెలకొంది. అందుకు అతిగా రసాయన ఎరువులు, క్రిమినాశక మందులు తగ్గించాలని వ్యవసాయ శాఖ కోరుతుంది.

**పార్లమెంటరీ స్థాయి సంఘ సిఫార్సులు అమలు చేయాలి**

ఎరువుల కొరత రైతులు పడుతున్న ఇబ్బందులపై పార్లమెంటరీ స్థాయి సంఘం గతంలో ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాలను నెలకొల్పి సరఫరాలను పర్యవేక్షించాలని సూచించింది. రసాయనాల ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ వనర్లు ఉపయోగించేలా రైతులను చైతన్యం చేయాలని.. రైతులకు అందించే సబ్సిడీ యూరియాను ఇతర అవసరాలకు.. పరిశ్రమలలో వాడకంపై నిఘా పెంచాలని సూచించింది.

రైతులు ఎదుర్కొంటున్న తక్షణ అవసరమైన యూరియాను యుద్ధ ప్రాతిపదికన అందించాలని.. అందుకు అన్ని పార్టీలు ప్రతినిధులు కృషి చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఆయిల్ పామ్ సాగుకు రైతుల ఆసక్తి

మార్కెటింగ్, కోతులు, కూలీల ఇబ్బందులు లేని ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం జిల్లాలో క్రమంగా పెరుగుతున్నది. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, మద్దతు అందిస్తూ భరోసా ఇస్తున్నది. అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతున్నది. జిల్లాలోని పలు మండలాల్లో పంటచేతికి రావడంతో రైతుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. దేశంపై దిగుమతుల భారం తగ్గి.. నూనె గింజల సాగులో స్వయం సమృద్ధి సాకారమవుతున్నది. ప్రపంచంలో అత్యధిక దిగుబడిని ఇచ్చే నూనె గింజల పంటలో ఆయిల్ పామ్ పంట ఒకటి. మన దేశంలో వంటలో ఉపయోగించే నూనెలో పామ్ ఆయిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇంతగా డిమాండ్ ఉన్నా మన దేశంలో పామ్ ఆయిల్ సాగు బాగా తక్కువ ఉంది. దీంతో మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. దేశం ముడి చమురు (పెట్రోల్, డీజిల్) తర్వాత ఎక్కువగా పామ్ ఆయిల్ (ఆయిల్ పామ్ చెట్ల నుంచి వచ్చిన గెలలతో తీసిన ఆయిల్)ని దిగుమతి చేసుకుంటుంది. వంట నూనెలో దీనివాటా ఎక్కువగానే ఉంటుంది.

**4వ సంవత్సరం నుంచి దిగుబడి...** ఆయిల్ పామ్ సాగు మొదలుపెట్టిన 4వ సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. 4 నుంచి 6వ సంవత్సరం వరకు 5 నుంచి 7 టన్నులు దిగుబడి వస్తుంది. 7వ సం. నుంచి 10–15 టన్నులు దిగుబడి వస్తుంది. ప్రీయునిక్ కంపెనీ వారు పంట గెలలు కొనుగోలు చేస్తారు.

**బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ..** ఇంత డిమాండ్ ఉన్న పంట కాబట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ చూపించి రైతులకు తోడ్పాటుగా మొక్కలు, డ్రిప్ మీద సబ్సిడీపై అందిస్తున్నాయి. ఆయిల్‌పామ్ పంట సాగు నిర్వహణ చాలా సులువు. చీడ, పీడల, కోతులు, ఇతర అటవీ జంతువుల బెడద ఉండదు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంట సాగుచేస్తే అధిక దిగుబడి, ఆదాయం సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎకరాల్లో అయినా సాగుచేసే వారికి సబ్సిడీ అందుతుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలకు 100 శాతం సబ్సిడీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఒసిలకు చెందిన రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేయనున్నారు. ఎకరం విస్తీర్ణంలో 50 మొక్కలు నాటుతారు. ఒక్కో మొక్క విలువ మార్కెట్లో రూ.200 ఉండగా, రైతులందరికీ 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తూ కేవలం రూ.20కే అందజేస్తారు. మొక్కలు, డ్రిప్, ఇతర సహాయం అన్ని కలిపి ఒక ఎకరానికి ప్రభుత్వం రూ.52వేల వరకు సబ్సిడీ నాలుగు ఏండ్లపాటు అందజేస్తుంది.

## బిసిల రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** బిసిల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం చారిత్రాత్మకమని, డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.సీఎం రేవంత్ నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దాని ప్రకారం ఇసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పాస్ చేయించడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి టీపీసీసీ అధ్యక్షులుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఈనెల 3వ తేదీన మూసాపేట మండలానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. వేముల శివారులోని ఎస్‌జిడి ఫార్మా వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన రెండో యూనిట్‌ను ప్రారంభోత్సవం చేయనున్నట్లు వెల్లడించారు. యూరియా కొరతపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

## అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గూడెడబల్లూరు గ్రామ శివారులో గల నల్లగట్టు దగ్గర నుండి గత కొన్ని రోజులుగా అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నారు. సోమవారం కూడా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ka 04 ud 1341 మొరం టిప్పర్‌కు కృష్ణ మండల తహసీల్దార్ శ్రీనివాస్ టిప్పర్‌ను పట్టుకుని ఆ టిప్పర్‌పై ఎలాంటి కేసు నమోదు చేయకుండా 10,000 ఫైన్ వేసి వదిలేయడం జరిగింది. అలాగే ఇక ముందు మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## పేదల పక్షపాతి కామ్రేడ్ సురవరం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పేదలపక్షపాతి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని వారిజీవితం నేటి విద్యార్థి యువతకు ఆదర్శమని ఎఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ కొనియాడారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లాసమితి సురవరం సుధాకర్‌రెడ్డి తాను పుట్టిన గద్వాల జిల్లా కంచుపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అన్నారు. విద్యార్థి రాజకీయజీవితం ఎఐఎస్ఎఫ్‌తో ప్రారంభించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా గల్లీనుండి ఢిల్లీవరకు విద్యార్థుల సమస్యల పరిష్కారంకోసం అలుపెరుగని పోరాటాలు కొనసాగించారు. అనేక ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మానవత విలువల పెంపునకు ఆధ్యాత్మికత తోడ్పాటు



**ప్రజాపక్షం/వెల్దండ :** అంతరించిపోతున్న మానవత విలువల పెంపునకు ఆధ్యాత్మికత ఎంతగానో తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రంగనాయకుల దేవాలయంలో ప్రతిష్టించిన గణనాథునికి ఆయన ప్రత్యేక పూజలుచేసి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్, నాయకులు ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చురామకృష్ణ, చిన్న జంగయ్యయాదవ్, శ్రీనివాసరెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్, ముదిగొండరమేష్, లక్ష్మణస్వామి,బాబా పాల్గొన్నారు.

**జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే :**

సింగిల్‌విండో మాజీవైస్‌చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు వావిళ్ల సంజీవ్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కేక్‌కటింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేకులుకట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా ముగిసింది. సోమవారం నాడు జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జడ్చర్ల పట్టణానికి చెందిన ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు హాజరై నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ హామి ఇచ్చిన విధంగా జడ్చర్ల ప్రెస్ క్లబ్ భవనాన్ని కృషి చేస్తున్నానని ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సుల్తాన్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఎలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఉపాధ్యక్షుడు, కోశాధికారి సహాయ కార్యదర్శి, ఈసీ మెంబర్లు మాట్లాడుతూ కలిసికట్టుగా ఉండి విలేకరుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ప్రభాకర్, ఉపాధ్యక్షులు శంకర్, సంయుక్త కార్యదర్శి మల్లేష్, ఈసీ సభ్యులుసీనియర్ జర్నలిస్టు శ్రీనివాసులు, సంతోషి, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శోభాయాత్ర మార్గంలో ఎస్పి పరిశీలన

**ప్రజాపక్షం/కొస్గి/మద్దూర్:** గణేష్ శోభయాత్ర నిర్వహించే రూట్ మార్గాన్ని సోమవారం కోస్గి ,మద్దూర్ మండల కేంద్రాలలోని గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వినాయక విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే రూట్ మార్గాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ కోస్గి, మద్దూర్‌లో వినాయక నిమజ్జన శోభయాత్రలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని, గణేష్ మండపాల దగ్గర ఫైర్ సేఫ్టి జాగ్రత్తలు తీసుకోవాలని, మంటపాల దగ్గర రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా వలంటీర్స్ ఖచ్చితంగా ఉండాలని సూచించారు. మద్దూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ బాల గణేష్ యూత్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహన్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యాక్రమంలో సిఐ సైదులు, ఎసైలు బాలరాజు, విజయ్‌కుమార్ ,ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షులుగా కుంభం చందు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ముదిరాజ్ మహాసభ యువత నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులుగా కుంభంచందు ముదిరాజును నాగర్‌కర్నూల్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు నూకం వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు , జాతీయవ్యవసాయ మార్కెట్‌వైస్‌చైర్మన్ పెద్దవిజయ్‌కుమార్ సమక్షంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, శాసనమండలి డిప్యూటిచైర్మన్ బండప్రకాష్ ముదిరాజ్ నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా శాసనమండలి డిప్యూటిచైర్మన్ బండప్రకాష్ మాట్లాడుతూ నిజాయితీ, కష్టపడేతత్వం ఉన్న వ్యక్తి చందుముదిరాజ్‌ని జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని, ముదిరాజుల అభివృద్ధికోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకాష్ ముదిరాజ్, డైరెక్టర్ భానుచందర్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, పుట్టవెంకటయ్య ముదిరాజ్, రామస్వామి ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, పరమేష్ ముదిరాజ్, చంద్రశేఖర్ ముదిరాజ్, సాయిముదిరాజ్, శివముదిరాజ్, మణిముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, శివ సాయిముదిరాజ్, వినయ్ పాల్గొన్నారు.

# అధికారులు సమర్థవంతంగా పని చేయాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం జిల్లాలోని వివిధశాఖల అధికారులతో కలిసి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని విధిగా పాటించాలని, ఈనెలనుంచి బయోమెట్రిక్ హాజరుద్వారానే కలెక్టరేట్‌లోని అన్నిశాఖల అధికారులు, సిబ్బంది జీతాలను విడుదల చేయనున్నట్లు , అవిధమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమయపాలన పాటించని అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, తాను ఆకస్మికంగా కార్యాలయాన్ని సందర్శించేటప్పుడు సిబ్బంది అందుబాటులో లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. ప్రతిశాఖకు సంబంధించిన పురోగతి, ప్రగతి వివరాలను తనకు పంపించాలని తెలిపారు. వివిధశాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులోవేగం పెంచేందుకు, శాఖల పనితీరును సమీక్షించడంతోపాటు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, లక్ష్యాలను గడువులోపు పూర్తిచేయాలన్నారు. ముఖ్యంగా ఓటరుజాబితా, పోలింగ్‌కేంద్రాల్లో అవసరం ఏర్పాట్లు నెలకొల్పేందుకు అధికారులు తమకు కేటాయించిన మండలాలను సందర్శించి ఎంపిడిఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో 69 దరఖాస్తులు :**

సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవసహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా నలుమూలలనుండి వచ్చిన ప్రజలనుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజలకు జిల్లా నలుమూలల నుండి వచ్చిన సమస్యలతో కూడిన ఫిర్యాదులు సమర్పిస్తున్నందున ప్రజావాణిపై నమ్మకం కల్పించే బాద్యత అధికారులపైఉందని తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేయాలని తెలిపారు. అదేవిధంగా తిరస్కరణకు గురైన దరఖాస్తులపై తప్పక రిమార్కులు వ్రాయాలన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం : నలుగురు దుర్మరణం

మరో నలుగురికి గాయాలు



**ప్రజాపక్షం/ అడ్డాకుల :** మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం ఎన్‌హెచ్ 44 అడ్డాకుల సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రావెల్ బస్సు, లారీ ఢీకొనగా నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఘటనలో మరో ముగ్గరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే హైదరాబాదు నుండి పొద్దుటూరు వెళుతున్న ప్రయాణికుల సివిఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న లారీని వెనక నుండి వేగంగా ఢీకొట్టింది. ఈ బస్సు క్లీనర్ హసన్ (35), నంద్యాలకు చెందిన అష్రాఫ్ ఉన్నిసా (70), పొద్దుటూరు కమలాపురంకు చెందిన ఎల్లమ్మ (40) మృతిచెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నంద్యాలకు చెందిన సుబ్బరాముడు (58) మృతి చెందాడు మరో ముగ్గురు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ యాక్సిడెంట్‌తో జాతీయ రహదారి స్తంభించింది. సమాచారం అందుకున్న జడ్చర్ల రూరల్ సిఐ కమాలాకర్ అడ్డాకుల ఎస్సై చంద్రశేఖర్ తమ సిబ్బందితో హటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వాహనాలను తొలగించి క్షతగాత్రులను వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఒంటరి అయిపోయి తమ తల్లిని చూస్తూ బిక్కు బిక్కుమని కూర్చున్న బాలుడు**

రోడ్డు ప్రమాదంలో తన తల్లి ఎల్లమ్మ మరణించడం తో ఆమె కుమారుడు సంతోస్ ఒంటరి అయ్యాడు ఎల్లమ్మ భర్త గతంలోనే మరణించడంతో తన కుమారుడు సంతోష్ ను పొద్దుటూరులో హాస్టల్లో ఉంచి తాను బతుకుదెరువు కోసం హైదరాబాదులో ఉంటుంది. ఈ టీవీల తన కుమారుడిని హైదరాబాద్ తీసుకెళ్లి వచ్చి తిరిగి సొంతూరు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో తల్లి కూడా మరణించడంతో నాలుగో తరగతి చవుతున్న సంతోష్ ఒంటరి బిక్కుబిక్కుమంటూ కూర్చునే తీరు అందరినీ కలిసి వేస్తుంది.

# పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన జోగులాంబ జోన్ డిఐజి



**ప్రజాపక్షం/పెబ్బేరు :** వార్షిక తనిఖీలలో వనపర్తి జిల్లా పరిధిలోని పెబ్బేరు , చిన్నంబావి, పెద్దమందడి పోలీస్ స్టేషన్లను జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ తనిఖీ చేశారు. డిఐజికి ముందుగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం డిఐజి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్లలో రికార్డ్స్‌ను పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావం ఉండాలని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ రాంబాబు, పెబ్బేర్ ఎస్ఐ, యుగంధర్ రెడ్డి, చిన్నంబావి ఎస్ఐ జగన్ , పెద్దమందడి ఎస్ఐ, శివకుమార్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి

ఆస్పిరేషన్ నర్వ బ్లాక్‌పై సమీక్షించిన కలెక్టర్




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శాఖల వారీగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో యాస్పిరేషన్ నర్వ బ్లాక్ పై జిల్లా అధికారులు, నర్వ మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో ఉత్తమ పద్ధతుల చర్చ, వినూత్న ప్రాజెక్టు ప్రతిపాదన సమర్పణ సమావేశం నిర్వహించారు. ఈ నెల 3న నీతి అయోగ్ సీఈవోతో వీడియో కాన్ఫరెన్స్ ఉందని, అంతలోపు వినూత్న ప్రాజెక్టు ప్రతిపాదనలను శాఖల వారీగా సంబంధిత అధికారులు పంపించాలని కోరారు. ఈ నెల 5న డీసీఆర్‌ను పంపించాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. సమావేశంలో అంతకు ముందు, అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, అనుబంధ రంగాలలో జిల్లా కలెక్టర్లు అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు. అలాగే బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ , సోషల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఆయన వివరించారు. ఈ సమావేశం జడ్పీ సీఈవో శైలేష్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, పిఆర్ఈఈ హీర్యా నాయక్, డీఈవో గోవిందరాజులు, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, మిషన్ భగీరథ డిఈ రంగారావు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, నర్వ ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ**

వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బంది హాజరు రిజిస్టర్ మందుల స్టాక్ రిజిస్టర్ ను చూశారు. ఓపి, జనరల్ వార్డులను పరిశీలించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రి సేవలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణ, బెడ్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజావాణికి 45 ఫిర్యాదులు**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం, నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 దరఖాస్తులు ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్.శ్రీను, ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్, ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 71 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ఇచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖాధికారులు జాగ్రత్తగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తుకు సమాధానం ఇవ్వడం, అవసరమైన సమాచారం ప్రజలకు అందించడం, సమస్య పరిష్కారం దిశగా స్పష్టమైన రిపోర్టులు సమర్పించడం ప్రతి అధికారి యొక్క బాధ్యత అని ఆమె గుర్తు చేశారు.

## అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సుందరీకరణ :మేయర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సుందరీకరణ చేపట్టామని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. గన్ పార్క్ జంక్షన్, బిఆర్‌కె భవన్ దగ్గర సుందరీకరణను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్ సురేఖలతో కలసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ సమీపంలో గన్ పార్క్ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడమే కాకుండా డిజిటల్ మెకానిజంతో కూడిన అత్యాధునిక డైనమిక్ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశామని, బిఆర్‌కె భవన్ కూడలిలో రకరకాల ఆకారాలతో ప్రజలకు విజ్ఞానంతో పాటు అహ్లాదకరమైన వాతారణం, సంతోషాన్ని కలిగించే విధానంగా తీర్చి దిద్దామని తెలిపారు. ఇవి దృశ్యపరంగా ఆకర్షణీయమైన ప్రదర్శనను సృష్టిస్తుందని, నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అత్యధిక డిజిటల్ టెక్నాలజీని ఉపయోగిస్తూ సుందరంగా రాన్నున్న రోజుల్లో తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే అనేక చోట్ల ప్రధానమైన కూడళ్లను సుందరంగా తీర్చి దిద్దామన్నారు. పర్యాటకులుకానీ, ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలుగాని ఒక్కసారి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తే వారు తరచుగా ఈ నగరాన్ని సందర్శించాలన్న భావం వారిలో కలగజేసే విదంగా నగరాన్ని సర్వంగాసుందరంగా తీర్చిద్దిదామని తెలిపారు.

## 'బహుజన బతుకమ్మ' పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ప్రకృతి రక్షణే ప్రజల రక్షణంటూ' చాటి చెబుతూ ఈ నెల 20న బహుజన బతుకమ్మ 2025 వేడుకలు ఘనంగా ప్రారంభమవుతాయని విమలక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం అమరవీరుల స్థూపం వద్ద బహుజన బతుకమ్మ 2025 పోస్టర్‌తో పాటు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ బతుకమ్మ ఉత్సవాలు ఉస్మానియాలో ప్రారంభమై అక్టోబర్ 3న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. బహుజన బతుకమ్మ 2010లో ప్రారంభమై 15 ఏళ్లుగా నిరాఘాటంగా సాగుతూ పలు ప్రజా సమస్యలు లేవనెత్తిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఎనిశెట్టి శంకర్, ఆచార్య కట్టా భగవంత రెడ్డి, టిపిటిఎఫ్ నాయకులు ప్రకాష్ రావు,రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకుల వెంకటేశ్వర్లు, ఏ ఐ ఎఫ్ టి యు అధ్యక్షులు మల్లేశం, నాయకులు యాకయ్య, అరుణోదయ ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, కార్యదర్శి రాకేష్, పిడిఎస్‌యు (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరు విజయ్, నాయకులు దిలీప్, పిఓడబ్ల్యు (స్త్రీవిముక్తి) గంగారత్నం, సౌజన్య, సంతోష, అరుణోదయ కళాకారులు అరుంధతి, కరుణ, రాజేశ్వరి, అశ్విని, హారిక తదితరులు పాల్గొన్నారు.

## గణనీయంగా పెరిగిన దేశీయ విక్రయాలు

జిఎస్‌టి ఆదాయంలో 6.5 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ:** ఆగస్టునెలలో వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్ళు 6.5 శాతం మేరకు వృద్ధి చెందాయి. గత ఏడాది ఆగస్టునెలలో జిఎస్‌టి వసూళ్ళు రూ.1.75 లక్షలకోట్లు ఉండగా ఈ ఏడాది ఆగస్టునెలలో జిఎస్‌టి వసూళ్ళు రూ.1.86 లక్షల కోట్లకు వృద్ధి చెందాయి. ఈ ఏడాది జులైనెలలో జిఎస్‌టి వసూళ్ళు రూ.1.96 లక్షలకోట్లుగా నమోదైనప్పటికీ ఆగస్టులో ఈ వసూళ్ళు పదివేలకోట్ల మేరకు తగ్గాయి. కానీ ప్రభుత్వం మాత్రం గత ఏడాది ఆగస్టునెలకంటే ఈ ఆగస్టులో జిఎస్‌టి వసూళ్ళను పోల్చిచూసి గణనీయంగా వృద్ధి చెందాయని చెబుతున్నది. వాస్తవానికి గతనెలకంటే ఈ నెలలో జిఎస్‌టి వసూళ్ళు తగ్గుముఖం పట్టాయి. స్థూల దేశీయ ఆదాయం 9.6 శాతానికి వృద్ధి చెందింది. అంటే ఈ ఆదాయం రూ.1.37 లక్షలకోట్లకు పెరిగింది. అదేసమయంలో దిగుమతులపై పన్నులు 1.2 శాతం మేరకు తగ్గడంతో ఈ ఆదాయం ఆగస్టు నెలలో రూ.49,354 కోట్లుగా నమోదైంది. జిఎస్‌టి రిఫండ్స్ కూడా 20 శాతం మేరకు తగ్గి రూ.19,359 కోట్లుగా నమోదయ్యాయి.

# ప్రపంచ పాలనలో సమానత్వానికి పంచశీల సూత్రాలు ప్రతిపాదించిన జిన్‌పింగ్

**తియాన్‌జిన్:** ఘర్షణలు లేని సమాన ప్రపంచ పాలనకు ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ) 25వ వార్షికోత్సవ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పంచశీల సూత్రాలు ప్రతిపాదించారు. ఈ సూత్రాలను పాటించేందుకు కట్టుబడాలని కోరారు. వీటిని జిజిఐ (గ్లోబల్ గవర్నెనెన్స్ ఇనీషియేటివ్)గా నిర్వచించారు. ''మనందరం సార్వభౌమత్వ సమానత్వానికి కట్టుబడటం మొదటి సూత్రం, అంతర్జాతీయ నియమాలకు, సంబంధిత చట్టాలకు కట్టుబడి ఉండటం రెండో సూత్రం, ఒకే ప్రాపంచిక లక్ష్యంకోసం అన్ని దేశాలూ ఒక కూటమిగా బహుళపాక్షికతకును పాటించడం మూడోసూత్రం, ప్రజలే కేంద్రంగా ప్రభుత్వ వైఖరిని తీసుకోవడం నాలుగోసూత్రం, ఆచరణాత్మకంగా వాస్తవ ప్రాతిపదికపై సరైన చర్యలు తీసుకోవడానికి కట్టుబడటం ఐదో సూత్రం''గా ఎస్‌సిఓ సదస్సులో జిన్‌పింగ్ ప్రతిపాదించారు. మరింత న్యాయమైన, సమానమైన ప్రపంచ పాలనావ్యవస్థకోసం అందరితో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నానని జిన్‌పింగ్ ప్రకటించారు. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు ఉన్న సమాజం కోసం ముందుకు వెళ్ళేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఒక మంచి భవిష్యత్తు కోసం సభ్యదేశాలు ఉమ్మడి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపు ఇచ్చారు. ప్రపంచ సవాళ్ళతో పోరాటం చేసి మార్పులు సాధించే దిశగా షాంఘై సహకార సదస్సు స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్ళాలని కోరారు. ఇందుకోసం సంస్థాగతమైన శక్తిసామర్థ్యాలను ఎస్‌సిఓ అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

**ఎస్‌సిఓ అభివృద్ధి బ్యాంకు ప్రతిపాదన**

సభ్యదేశాల ప్రయోజనాల కోసం ఒక ప్రత్యేక అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు యత్నాలను ముమ్మరం చేయాలని జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. సోమవారం జరిగిన ఎస్‌సిఓ సదస్సులో ప్రధాన ప్రసంగం చేస్తూ, ఈ బ్యాంకు ఏర్పాటు కోసం పది సభ్యదేశాల విజ్ఞప్తి రోజు రోజుకూ పెరుగుతోందని అన్నారు. బ్రిక్స్ ఏర్పాటు చేసిన ఎన్‌డిబి (న్యూ డవలప్‌మెంట్ బ్యాంక్), భారత్ రెండో అతిపెద్ద భాగస్వామిగా ఉన్న ఆసియా పెట్టుబడులు,మౌలిక సదుపాయాల బ్యాంక్ (ఎఐఐబి) తరహాలోనే ఎస్‌సిఓఅభివృద్ధి బ్యాంకును సృష్టించాలని జిన్‌పింగ్ ప్రతిపాదించారు. పైన పేర్కొన్న రెండు బ్యాంకులూ ప్రస్తుతం చైనాలోనే ఉన్నాయి. ఈ రెండు బ్యాంకులను ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు కు పోటీ బ్యాంకులుగా చైనా పేర్కొంటున్నది. 1996లో షాంఘై ఫైవ్‌గా ప్రారంభమైన ఎస్‌సిఓను 2001 లో ఆరు దేశాల అధిపతులూ షాంఘై సహకార సంస్థగా ప్రకటిస్తూ ఒక తీర్మానం చేశారు. 2017లో భారత్, పాకిస్థాన్ దేశాలు అధికారికంగా ఎస్‌సిఓ సభ్యులుగా చేరాయి. ఎస్‌సిఓ రోజు రోజుకూ అతిపెద్ద ప్రపంచ కూటమిగా అభివృద్ధి చెందుతున్నది. తియాన్‌జిన్‌లో 25వ వార్షికోత్సవ సదస్సుకు 26 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించే వేదికగా ఎస్‌సిఓ రూపుదిద్దుకోవాలని జిన్‌పింగ్ తన ప్రసంగంలో ఆకాంక్షించారు. ఈ సదస్సులో జిన్‌పింగ్ రెండుసార్లు మాట్లాడారు. ఎస్‌సిఓ ఎదుర్కొంటున్న రాజకీయ,వ్యూహాత్మక సవాళ్ళను ప్రస్తావిస్తూ, ఇందులో ఉన్న సభ్యదేశాలు మిత్రులు, భాగస్వాములేనన్నారు.

## మున్నూరు కాపు అభ్యున్నతికి కృషి

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ**

**ప్రజాపక్షం/హాలియా:** మున్నూరు కాపుల అభ్యున్నతికి కాపు సంఘం నాయకులు నిరంతరం కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ అన్నారు. సోమవారం హాలియాలోని ఉద్యోగుల విశ్రాంతిభవనంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కోశాధికారి కంచి సత్యనారాయణ,జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నరసయ్య పాల్గొని వారు మాట్లాడుతూ మండలంలోని మున్నూరు కాపు సంఘం బలోపేతం కోసం ఈ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.జిల్లాలోనే అత్యధికంగా అనుముల మండలం నుండే సభ్యత్వాలు నమోదు కావాలని, సంఘం బలోపేతానికి కృషి చేయాలిని కోరారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, హాలియా పట్టణ అధ్యక్షులు గోపీ శెట్టి నరసింహ, సుగురు నారాయణ , అనేబోయిన వెంకటయ్య, వనమాల కోటి,గోపిశెట్టి మధు, ఎడ్ల సోమయ్య, నంద్యాల జానయ్య, ముత్యాల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసిదే అగ్రస్థానం

**ప్రజాపక్షం/కోదాడ:** భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసి అగ్రస్థానంలో నిలుస్తుందని కోదాడ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ భానుకుమార్, లియాపి అధ్యక్షులు కంజుల మోహన్‌రెడ్డి లు అన్నారు. సోమవారం ఎల్ఐసి 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోదాడ బ్రాంచ్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా జరుపుకున్నారు. పాలసీదారులకు గత 69 సంవత్సరాలుగా నమ్మకమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందిందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు ఇన్సూరెన్స్ పొదుపు ప్రాముఖ్యతను పెంచి దేశ ఆర్థిక వ్యవస్థకు చేయూతనిస్తుందని తెలిపారు. ఎల్ఐసిపై ప్రజల్లో పూర్తి నమ్మకం విశ్వాసం ఉందన్నారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు స్వీట్లు పంపిణీ చేసి అవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వట్టికూటి మల్లేష్, విజయ, శంకర్, సువర్ణ రాణి, కన్నయ్య, కాటేపల్లి సూర్యానారాయణ, వెంకటాద్రి, ప్రభాకర్‌రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రావు, సత్యనారాయణ, వందనపు దయాకర్, పాలసీదారులు పాల్గొన్నారు.



## ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు విస్తరణతో సొంత భూములు కోల్పోతున్నాం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు విస్తరణ పనుల కారణంగా రైతులు తమ సొంత భూముల కోల్పోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సర్వేల్, లింగం వారి గూడెం గ్రామాల రైతులు తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిబుల్ ఆర్ భూ బాధితుల రైతు సంఘం నాయకుడు పుష్పారెడ్డి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములు ప్రభుత్వ స్వాధీనంలోకి వెళుతుండడంతో భూములపై ఆధారపడి జీవనోపాధి నడుపుతున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం గతంలో ఓఆర్ఆర్ నుండి భూసేకరణకు 40 కిలోమీటర్ల పరిధి మేరకే త్రిబుల్ ఆర్ భూ సేకరణ చేపట్టాలని నిబంధనలు ఉన్న వాటిని తుంగలో తొక్కారని మాట్లాడారు. పరిశ్రమల యజమానుల మెప్పు పొందేందుకే ప్రభుత్వం అంతర్గత ఒప్పందాలు చేసుకొని ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం పట్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని ప్రభుత్వాన్ని కోరారు. పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. పుష్ప రెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యాదిరెడ్డి, లక్ష్మ య్య, గాలయ్య, సత్యనారాయణ, బి శంకర్, నాగార్జున రెడ్డి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి: మురళి కృష్ణ



**ప్రజాపక్షం/ నాంపల్లి:** రాష్ట్రం లో విద్యారంగా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లి మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉండి వర్షానికి కూలిపోతున్నాయని వాపోయారు. విద్యార్థులకు మంచినీరు, లైబ్రరీ, ల్యాబ్స్, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు పడుతున్నారని వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మధ్యాహ్నం భోజనం సంబంధించి మెస్ చార్జీలను 30 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్య వ్యవస్థ కుంటుపడుతుందని వెంటనే విద్యాశాఖ మంత్రి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, సాయి, మహేష్ తరుణ్, శరత్ పాల్గొన్నారు.

## మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పోలీసు శాఖ అండ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలపై పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, మహిళా సిబ్బంది స్పందించి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పని ప్రదేశంలో ఆత్యాచార, వేధింపులు నిరోధక చట్టంకు సంబంధించి మహిళా పోలీసు అధికారులకు, మహిళా రక్షణ విభాగం సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమం వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి నరసింహ హాజరై శిక్షణను ఉద్దేశించి మాట్లాడారు. వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేసి వాటి నిర్మూలనకు పాటుపడాలన్నారు. మహిళా పోలీసు యూనిఫాం ధరించి రోడ్డుపై కనిపిస్తే ఆకతాయిల మదిలో అలజడి, భయం కలిగేలా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి ఆధ్వర్యంలో ఒక ఇంటర్నల్ కమిటి కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కమిటి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి దయానందరాణి, బెటి బచావో బెటి పడావో నిర్వాహకురాలు చైతన్య, పోలీసు కార్యాలయం ఏఓ మంజుభార్గవి, జిల్లా మహిళా బరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, జిల్లా షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ, బరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ జ్యోతి, కరుణశ్రీ, మహిళా ఏఎస్ఐ సైదాబి, జ్యోతి, అరుణ, కవిత పాల్గొన్నారు.

## లక్ష్మయ్య మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** అనారోగ్యంతో అకాల మరణం చెందిన సిపిఐ పీఏ పల్లి ఉమ్మడి మండల మాజీ కార్యదర్శి ఎర్ర లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి,కలకొండ కాంతయ్యలు అన్నారు. సోమవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద గల తన స్వగృహంలో లక్ష్మయ్య భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం 1975లో సిపిఐ జెండాను పట్టిన లక్ష్మయ్య దాదాపు 50 సంవత్సరాల పాటు అనేక పదవులు చేపట్టి పార్టీ పిలుపు అనేక కార్యక్రమాలలో పాల్గొని పోరు బాటలో నడిచారన్నారు. వారి వెంట మం డల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్,సహాయ కార్యదర్శి నూనె కాంతరావు, మండల సీనియర్ నాయకులు అలుగుబెల్లి భాస్కర్ రెడ్డి,పాల్వాయి రంగారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుమ్మంకొండ వెంకటేశ్వర రెడ్డి,పల్లా రంగారెడ్డి,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వల్లమల్ల ఆంజనేయులు, కల్లు చరణ్ రెడ్డి,వాల్య నాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సోమవారం మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో జిల్లా అధికారులకు 30 ,రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామ రావు, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ , ఆర్‌డిఓలు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

**వీధి కుక్కలపై విస్తృత ప్రచారం కల్పించాలి**

మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలలో వీధి కుక్కలపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.ఈ విషయమై సోమవారం ఆమె సంబంధిత అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్ డి ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వీధి కుక్కల పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని ,దీనిద్వారా వారి తల్లిదండ్రులకు సమాచారం వెళుతుందని, అలాగే విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో హోర్డింగ్ లు ఏర్పాటు చేసి ప్రజలకు వీధి కుక్కల వల్ల కలిగే నష్టాలు, వీధి కుక్కల స్టెరిలైజేషన్,వాక్సినేషన్, దత్తత తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తుల పరిశీలనలో వెనుకబడిన తహసిల్దారులు దరఖాస్తుల పరిశీలనను ఆన్లైన్ ద్వారా డిఆర్ఓ పంపించాలని చెప్పారు.



## పెండింగ్ ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాంటి శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టిసారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా 76 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిఆర్‌డిఓ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మ, డిఈఓ అశోక్, డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డిఎస్ఓ మోహన్‌బాబు, ఈడి ఎస్సీ కార్పోరేషన్ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్లల్లో పెయింటింగ్ వర్కర్స్‌కు ప్రాధాన్యత

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పెయింటింగ్ వర్కర్స్‌కు ప్రధమ ప్రాధన్యతను ఇవ్వాలని ఏఐటియూసి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఏఐటియూసి కార్యాలయంలో జరిగిన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. కార్మికుల హక్కుల సాధనకై కార్మికుల పక్షాన ఏఐటియూసి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,ధూళిపాళ ధనుంజయ్ నాయుడు,జెట్టి ప్రసాద్,తమ్మిశెట్టి రవి, తురక అంజయ్య,జక్కుల రమణ,రమేష్,విజయ్,రాము,శ్రీను,వెంకటేశ్వర్లు, కుమార్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్బుల్ గ్రానైట్ వర్కర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్) :** మార్బుల్ గ్రానైట్ అండ్ టైల్స్ రంగంలో పనిచేసే కార్మికులకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నకిరేకల్ లోని మార్కెట్ యార్డ్ లో జరిగిన మార్బుల్ గ్రానైట్స్ అండ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిర్మాణ రంగం లో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకురావడం కోసం కృషి చేయటం జరిగింది. నిజమైన కార్మికులు సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకునే విధంగా లేబర్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల బోగస్ కార్మికులకు కూడా లేబర్ కార్డు తీసుకొని లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.ఆన్లైన్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత పని చేసే కార్మికులకు తంబూ పడక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున తంబూ విధానం రద్దు చేసేందుకు పోరాటం నిర్వహించాలనీ అన్నారు. 50 ఎండ్లు దాటిన నిర్మాణరంగ కార్మికులకు నెలకు రూ. 5వేల పెన్షన్ ఇవ్వాలని, కార్మికుల అడ్డాల వద్ద షెల్టర్ నిర్మించి మంచినీరు, బాత్రూం సౌకర్యం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ చట్టాల వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంక్షేమ బోర్డుని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో యూనియన్ నకిరేకల్ డివిజన్ అధ్యక్షులు శంకర్, రమేష్, లింగయ్య మహేష్ ,నగేష్, నాగయ్య ,అయోధ్య, యాదగిరి సత్యనారాయణ బాబు ఏలియా, నగేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీను, చంటి, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా నాయకులు అశోక్ పాల్గొన్నారు.

## అబార్షన్ చేస్తుండగా గర్భిణి మృతి కేసులో ముగ్గురి నిందితుల అరెస్టు

డిఎస్‌పి ప్రసన్న కుమార్ వెల్లడి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణములోని శ్రీరామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఒమెగా హాస్పటల్‌లో 17.05.2025న లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ శిశువని తేలడంతో గర్భిణీకి అబార్షన్ చేస్తుండగా మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. ఈ కేసులో మొత్తం పది మంది ప్రమేయం ఉన్నట్లు తేల్చిన పోలీసులు ఇందులో ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో ముగ్గురు నింధితులను పట్టణంలోని రితిక హోటల్ సమీపంలో సోమవారం అరెస్టు చేశారు. వీరిలో హాస్పటల్ నిర్వాహకుడు ఏ1 నింధితుడు గోరెంట్ల సంజీవ, మరో మేనేజ్‌మెంట్ పార్టనర్ ఏ6 వీరబోయిన వేణు, స్కానింగ్, అబార్షన్ చేయడానికి ఏర్పాటు చేసిన గామీణ వైద్యుడు ఏ2 నింధితుడు జాల జానయ్య అరెస్టు అయిన వారిలో ఉన్నారు. మృతురాలి భర్త బయ్య నగేష్ నుండి డబ్బులు తీసుకొని స్కానింగ్ చేసి ఆడపిల్ల అని తేలడంతో ఆబర్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావం జరిగింది. ఆమెను మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బయ్య అనూష మృతి చెందింది. ఈ విషయం బయటకు పొక్కకుండా హాస్పటల్ నిర్వాహకులు అనూష కుటుంబ సభ్యులతో బేరసారాలకు దిగగా పత్రికల్లో వచ్చిన వార్తకథనాలకు స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. నింధితులపై 197/2025 ప్రకారం సెక్షన్ 105, 90 భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ 23, ప్రి కన్సెప్షన్ ప్రి నటల్ డయాగ్నటిక్ టెక్నిక్స్ ఆక్ట్ 1994 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరమని, ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది ఉన్నారు.



## రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్

**ప్రజాపక్షం/కోదాడ:** గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నారని, కావున రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం కోదాడ ఆర్డీవో సూర్యానారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుల తరబడి రైతులు పిఎసిఎస్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూ లైన్‌లో ఉంటున్నారని, ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా కూడా అందటం లేదని అన్నారు ఖరీఫ్‌లో ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమో ఉందో దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించినా సరిపడిన యూరియాని సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత దోరణి అవలంభిస్తుందని అన్నారు. రైతులు సకాలంలో పంటలకు యూరియా చల్లలేక పోతున్నారని అన్నారు. ఇలా జరిగితే రైతుల పంట దిగుబడితగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. గతంలో కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరానికి వరికి రూ.20వేలు, వేసంగిలో ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వరి ధాన్యానికి 500 చొప్పున బోనస్ చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, సిపిఐ తమ్మర నాయకులు మాతంగి ప్రసాద్, కనగాల కొండయ్య, నాగేశ్వరరావు, బి.గోపాల్, ఎం.రాజు, పుల్లయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లకు బిఎస్‌పి సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని బహుజన సమాజ్ పార్టీ ఎర్రవల్లి మండల అధ్యక్షులు ధర్మవరం రాముడు అన్నారు. వెంటనే చట్టం చేసి అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తాహసిల్దార్ నరేష్‌కు వినతిపత్రంను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్, బిఆర్ఎస్ , బిజెపి పార్టీలు ఆడుతున్న డ్రామాలను బీఎస్పీ ఖండిస్తోందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఈ డ్రామా నడుస్తోంది తప్పితే చట్టం రావడం లేదన్నారు. బీసీలు ఇక్కడో విషయం గమనించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దేవన్న, శివన్న ఉన్నారు.

## నెలలు గడిచినా ప్రజలకు అందని హోమియో వైద్యం

వైద్యుడు లేక ఇంగ్లీష్ మందులే దిక్కంటున్న రోగులు

ప్రతిరోజూ పడిగాపులు కాసి వెను తిరిగి పోతున్న ప్రజలు



**ప్రజా పక్షం/నల్లగొండ:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాదిగాస్తులు హోమియో మందులకు అలవాటు పడి తమ రోగాలను నయం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న దీర్ఘకాలిక రోగస్తులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల హోమియో వైద్యశాలకు వచ్చి వైద్యం పొందుతున్నారు. ప్రతి రోజు సుమారు 70 నుంచి 100 మంది వరకు ఓపి ద్వారా వైద్యం పొందుతుంటారు.ఇంతవరకు బాగానే ఉన్నది కానీ గత కొన్ని నెలల నుండి ఈ హోమియో ఆసుపత్రిలో వైద్యం అందిచేందుకు వైద్యుడు,ఫార్మసిస్ట్ లేక రోగులకు వైద్యం అందడం లేదు. ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు గత మూడు నెల క్రితం పదవి విరమణ పొందారు ఆయనతో పాటు పనిచేస్తున్న ఫార్మసిస్టు కూడా పదవి కాలం ముగియడంతో పదవి విరమణ పొందారు. అయితే నాటి నుంచి నేటి వరకు సీనియర్ మెడికల్ ఆఫీసర్,కానీ ఫార్మాసిస్ ను కానీ నియమించకపోవడం వల్ల హోమియో వైద్యం పొందుతున్న రోగులు వైద్యం అందుకోలేకపోతున్నారు. ప్రతిరోజు డాక్టర్ వస్తుడని దూర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో రోగులు ఆసుపత్రి వచి డాక్టర్‌లేక నిరాశతో చేసేది ఏమీ లేక తమ రోగాలను కంట్రోల్ చేసుకోవడానికి,నయం చేసుకోవడానికి ఇంగ్లీష్ మందులు వాడక తప్పడం లేదు,హోమియో వైద్యశాలకు డాక్టర్‌తో పాటు ఫార్మసిస్ట్ ని నియమించి తమకు వైద్యం అందించాలని ప్రజలు రోగులు కోరుకుంటున్నారు. రోగుల బాధలు దృష్టిలో పెట్టుకొని హాలోపతి ఆసుపత్రికి వైద్యుని ఫార్మసిస్ట్ ను నియమిస్తారని ఆశిద్దాం.

## కప్పల నరసింహకు కన్నీటి వీడ్కోలు

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జనగాం సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి కప్పల నరసింహ మృతదేహంపై యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పూలమాలలు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కప్పల నరసింహ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసిన నాయకుడని కప్పల నరసింహకు కన్నీటి వీడ్కోలు పలికారు. సామాజిక న్యాయం కోసం రైతు కూలీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని గుర్తు చేశారు. మృతదేహాన్ని జనగాం ఆయన నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. చివరి యాత్రలో సిపిఐ జిల్లా మండల సిపిఐ కార్యకర్తలు ఇతర పార్టీ నాయకులు, బంధుమిత్రులు, ఆయన కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనపై ఉన్న గౌరవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కురిమిద్ద శ్రీనివాస్, గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, అన్నెపు వెంకట్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రెహమాన్, ఎమ్మెల్యే గాలయ్య, ప్రజానాట్యమండలి నాయకుడు బి.జగన్, కొండూరు విప్లవం, మంచాల జంగయ్య, సైదులు, రాజు, లోడ యాదయ్య, కొండూరి మల్లేష్, స్వామి, శనిగల జంగయ్య, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ నరేష్, యువజన నాయకులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి ఆలపించిన అమరవీరుల గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

**నరసింహ సేవలు మరువలేనివి: గోదా శ్రీరాములు**

అమరుడు కప్పల నరసింహ మృతదేహానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించి ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం గ్రామ అభివృద్ధి కోసం నరసింహ చేసిన సేవలు మరువలేని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం సిపిఐ శాఖ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడ

# 17 ఏళ్ల తర్వాత తొలిసారి

భారత గడ్డపై ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..




భారత్ మరో ప్రతిష్ఠాత్మక క్రీడా పండుగకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇప్పటికే వరల్డ్ చెస్ వరల్డ్ కప్ హక్కులు దక్కించుకున్న ఇండియా వచ్చే ఏడాది జరుగబోయే ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2026 పోటీలను నిర్వహించనుంది భారత్. పారిస్‌లో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ముగింపు వేడుకల సందర్భంగా ఈ విషయాన్ని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య వెల్లడించింది. దాంతో దాదాపు 17 ఏళ్ల తర్వాత భారత్ వేదికగా ఈ మెగా టోర్నీ జరుగనుంది.

బిడబ్ల్యుఎఫ్ అధ్యక్షుడు ఖునింగ్ పతామ లీస్వద్రకుల్ టోర్నీ ముగింపు సందర్భంగా భారత బ్యాడ్మింటన్ సంఘం జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రాకు వచ్చే ఏడాది ఆతిథ్య హక్కుల విషయాన్ని తెలియజేశారు. పారిస్‌లో విజయవంతంగా నిర్వహించినట్టుగానే భారత్‌లోనూ ఈ టోర్నీని జరుపుతామని బిడబ్ల్యుఎఫ్ ప్రెసిడెంట్‌కు మిశ్రా మాటిచ్చారు. 'పారిస్‌లో పాటించిన ప్రమాణాలకు ఒక్క శాతం



కూడా తగ్గకుండా ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తాం. ప్రపంచ నలుమూలలా నుంచి రాబోతున్న బ్యాట్మింటన్ కుటుంబానికి ఢిల్లీలో స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్నాం' అని మిశ్రా చెప్పినట్టు బీఏఐ ఒక ప్రకటనలో పేర్కొంది.

**2009లో హైదరాబాద్..**

వచ్చే ఏడాది ఆగస్టులో ఢిల్లీ వేదికగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగున్నాయి. ఇదివరకూ.. 2009లో హైదరాబాద్ వేదికగా ఈ ఈవెంట్ జరిగింది. 2018లో చైనా ఆతిథ్యం ఇవ్వగా.. ఇప్పుడు భారత్ నిర్వహించనుంది. దాంతో.. ఎనిమిదేళ్ల తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆసియా దేశంలో జరుగనున్నాయి.



## సూపర్ 4లో భారత్, చైనా..

### గ్రూప్ బీ నుంచి కొరియా, మలేషియా

భారత్ ఆతిథ్యమిస్తున్న పురుషుల హాకీ ఆసియా కప్‌లో సూపర్ 4 బెర్తులు ఖరారాయ్యాయి. గ్రూప్ 'ఏ' నుంచి ఫేవరెట్ భారత జట్టుతో పాటు చైనా క్వాలిఫై అయింది. గ్రూబ్ 'బీ' నుంచి కొరియా, మలేషియాలు మెగాటోర్నీలో మరో దశకు అర్హత సాధించాయి. సోమవారం జపాన్‌పై ఉత్కంఠ డ్రాతో చైనా.. బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించి కొరియా సూపర్ 4లోకి దూసుకొచ్చాయి. స్వదేశంలో రాజ్‌గిర్ వేదికగా జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత్ అదరగొడుతోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్స్ వర్షం కురిపిస్తుండడంతో వరుసగా రెండు మ్యాచుల్లో గెలుపొందిన టీమిండియా సూపర్ 4కు అర్హత సాధించింది. సోమవారం చైనా అతికష్టమ్మీద జపాన్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. కొరియా సంచలన ఆటతో బంగ్లాదేశ్‌ను 5–1తో చిత్తుగా ఓడించి ముందంజ వేసింది. మరో మ్యాచ్‌లో మలేషియా బలమైన చైనీస్ తైపీని మట్టికరిపించింది. అష్రన్ హంసనీ, అఖీముల్లా అనౌర్ తలా ఒక గోల్ చేయడంతో మలేషియా ఆధిక్యంలోకి వెళ్లింది. ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తూ మలేషియా ఆటగాళ్లు వరుసగా గోల్స్ చేయగా 15–0తో గెలుపొంది సూపర్ 4 బెర్తు సాధించింది. సూపర్ 4, 5వ, 8వ స్థానాలకు సంబంధించిన ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు సెప్టెంబర్ 3 నుంచి మొదలవుతాయి.




## ఫైనల్ ఆడే అవకాశం చేజారినట్టే!

సిఎఎఫ్ఎ నేషనల్ కప్ గ్రూప్ దశలో భారత జట్టుకు ఊహించని ఓటమి ఎదురైంది. తొలి మ్యాచ్‌లో కజకిస్థాన్‌పై గెలుపొందిన 'బ్లూ టైగర్స్'కు ఇరాన్ షాకిచ్చింది. అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించి ఫైనల్ చేరాలనుకున్న టీమిండియా ఆశలకు చెక్ పెట్టింది. డిఫెండర్లు, ఫార్వర్డ్ ఆటగాళ్లు విఫలం కావడంతో భారత్ మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఇక మూడో స్థానంకోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తదుపరి పోరులో సెప్టెంబర్ 4న అఫ్గనిస్థాన్‌తో భారత జట్టు తలపడనుంది. తజకిస్థాన్‌లో హిసార్‌లో జరుగుతున్న పోటీల్లో బ్లూ టైగర్స్‌కు షాక్ తగిలింది. అనుభవజ్ఞుడైన సునీల్ ఛెత్రీ వంటి స్టార్ ఆటగాళ్లు లేనందుకు భారీ మూల్యం చెల్లించుకుంది. రెండో మ్యాచ్‌లో ఆసియా దేశం ఇరాన్ చేతిలో దారుణ ఓటమి చవిచూసింది. తొలి అర్ధ భాగంలో ప్రత్యర్థి ప్రయత్నాలను కెప్టెన్ సందీప్ ఝింగాన్, గోల్ కీపర్ గురుప్రీత్ సింగ్ సమర్థంగా తిప్పికొట్టారు. అయితే.. డిఫెండర్లను మార్చిన తర్వాత ఇరాన్ పుంజుకుంది. ఆ జట్టు ఫార్వర్డ్ ఆటగాడు అమిరహొసేన్ 60వ నిమిషంలో తొలి గోల్ అందించగా ఖాతా తెరిచింది. భారత ఆటగాళ్లకు స్కోర్ సమం చేసే అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. బ్లూ టైగర్స్ ఎత్తులను ఇరాన్ డిఫెండర్లు అడ్డుకున్నారు.. అలీ అలిపోర్, మెహెదీ తరేమీ చెరొక గోల్‌తో 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది ఇరాన్. ఆ తర్వాత భారత ప్లేయర్లు ఎంతగానో ప్రయత్నించిన గోల్ చేయలేకపోయారు. ఈ ఓటమితో దాదాపు ఫైనల్ బెర్తును చేజారినట్టే. అయితే.. మూడో స్థానం కోసం సెప్టెంబర్ 4న అఫ్గనిస్థాన్‌తో భారత జట్టు తలపడనుంది.




---

ఫోకస్

# యువతరంగం

సోషల్ మీడియాలో సమయం వృథా

# ప్రమాదంలో యువత భవిత




నేటి సమాజంలో సోషల్ మీడియా ప్రాధాన్యం ఎంతగా పెరిగిందో చెప్పనవసరం లేదు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్, వాట్సాప్ వంటి వేదికలు ప్రతి ఇంటిలోనూ, ప్రతి చేతిలోనూ లభ్యమవుతున్నాయి. జ్ఞానాన్ని పంచుకునే సాధనాలుగా సోషల్ మీడియా మారితే ఎంత మేలు? కానీ చాలా సందర్భాల్లో యువతను అవి వేరే దారిలోకి నడిపిస్తూ సమయాన్ని వృథా చేస్తూ, భవిష్యత్తుకు ముప్పుగా ప్రమాదకరంగా మారుతున్నాయి. సినిమా సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు అందరూ సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్నారు. వారు పెట్టే పోస్టులు, వీడియోలు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. మొదట ఆరంభంలో వినోదం కోసం అయితే తర్వాత అది అలవాటుగా మారి గంటల తరబడి స్క్రోలింగ్ చేయడం, వీడియోలు చూడడం సర్వసాధారణమైంది. ఫలితంగా, జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆస్తిగా పరిగణించాల్సిన సమయం వృథా అవుతున్నది. చదువుకోవడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం, భవిష్యత్ సాధన కోసం కేటాయించాల్సిన విలువైన సమయాన్ని యువత ఎక్కువ భాగం సోషల్ మీడియాలోనే గడుపుతున్నారు. ఒక గంట మాత్రమే అనుకున్నా అది రోజుకు నాలుగైదు గంటలుగా మారిపోతోంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల వారు కెరీర్‌లో వెనుకపడే ప్రమాదం ఉంది. అధికంగా సోషల్ మీడియాను వాడటం వల్ల పోలికల మనస్తత్వం పెరుగుతుంది. ఇతరుల జీవితాన్ని చూసి, తమను తాము నిందించుకోవడం, తమ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని కుంగిపోవడం వంటి లక్షణాలు పెరుగుతాయి. ఈ పోల్చుకోవడం అనే తత్వం ఒక్కోసారి వారి బలవన్మరణాలకు కూడా కారణమవుతున్నది. అత్యధిక 'స్క్రీన్‌టైమ్' వల్ల నిద్ర లేమి, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ వ్యసనం ఒక సారి పెరిగితే, దాని నుంచి బయటపడటం చాలా కష్టం. సమయం వృథాతోపాటు తలెత్తే మరో పెద్ద ముప్పు భద్రతా లోపం. వ్యక్తిగత వివరాలు పంచుకోవడం, అనవసర వ్యక్తులతో పరిచయం కావడం ద్వారా మోసాలకు, మానసిక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. యువత వయసులో ఉండే అమాయకత్వాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఎంత మంది యువతీయువకులు ఈ కారణంగా జీవితాలను నాశనం చేసుకుంటున్నారో, కొంత మంది ఏ విధంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో చూస్తునే ఉన్నాం. మహమ్మారిగా విస్తరిస్తున్న 'ఓవర్ స్క్రీన్ టైమ్' రుగ్మత నుంచి బయటపడాలంటే, ముందుగా సమయ పాలన అవసరం. రోజుకు ఒక నిర్ణీత సమయం మాత్రమే సోషల్ మీడియాకు కేటాయించాలి. ఉపయోగకరమైన వనరులు మాత్రమే వాడుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. అధ్యయనం, నైపుణ్యాల అభ్యాసానికి సంబంధించిన వీడియోలు, సమాచారమనే వినియోగించుకోవడం ఉత్తమం. ఈ విషయాల్లో ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలి. నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకుని వాటి సాధనపై దృష్టి పెట్టాలి. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా యువతకు అవసరమన్నది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. యువతను సరైన దిశగా నడిపించే బాధ్యతను స్వీకరించాలి. ఏదిఏమైనా సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా మానేయడం సాధ్యం కాని పని. కానీ దాన్ని సరైన రీతిలో, పరిమిత సమయంలో వాడడం మాత్రమే మన భవిష్యత్తును రక్షించే మార్గం. లేకపోతే విలువైన సమయం వృథా అవుతుంది, యువత భవితం ప్రమాదంలో పడుతుంది. సమయం విలువ తెలిసినవారే భవిష్యత్తు గెలుస్తారు అనే నిజం మనందరం గుర్తు పెట్టుకోవాలి.

## కృషి ఉంటే..

చంద్రుడి పైకి మనిషి వెళ్లక ముందే చంద్రయానం సాధించరాని స్వప్నం కాదని మహాకవి శ్రీశ్రీ చెప్పాడు. అసాధ్యమనేది లేనే లేదన్న ఆయన మాటలు అక్షరసత్యాలని అనేక సందర్భాల్లో రుజువైంది. అందుకు ఓ ఉదాహరణ ఉదయ్. సాధారణ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపిఎస్ అధికారిగా ఎదిగిన ఓ అసాధారణ పోరాటయోధుడు అతను. ఉదయ్ ఐపిఎస్‌కు సిద్ధమవుతున్నానని చెప్పినప్పుడు, సుమారు 60 మంది పోలీస్ ఆఫీసర్ల ముందు ఓ ఇన్‌స్పెక్టర్ అతనిని అవమానించాడు. 'మామూలు కానిస్టేబుల్‌వి. ఎప్పటికీ ఐపిఎస్ కాలేవు' అంటూ హేళన చేయడం ఉదయ్‌లో పట్టుదలను పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐపిఎస్ సాధించి తీరాలన్న తీర్మానం అతనిని ఏకదీక్షతో ముందుకు నడిపింది. 2018లో ఉదయ్ తన కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఐపిఎస్ తయారీలో నిమగ్నమయ్యారు. నిజానికి అతని జీవితం సాఫీగా సాగలేదు. చిన్నతనంలోనే తల్లి మరణించింది, 17 ఏళ్ల వయసులో తండ్రి కూడా కన్నుమూయడంతో అనాథ అయ్యాడు. నాయనమ్మ వద్ద పెరిగాడు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. భవిష్యత్తుపై తాను పెట్టుకున్న ఆశలకు కూడా ఆరంభంలో ఎదురుదెబ్బలు తప్పలేదు. ఐపిఎస్ అధికారిగా ఎదగాలనుకున్న ఆయన తొలి ప్రయత్నం (2019) విఫలమైంది. ఈ చేదు అనుభవానికి సమాధానంగా, పరీక్షలో ఉత్తీర్ణుడు కావాలన్న లక్ష్యంతో చదివారు. కానీ, 2020లో కొవిడ్ కారణంగా ఐపిఎస్ పరీక్షకు బ్రేక్ పడింది. 2021, 2022 సంవత్సరాల్లోనూ పరాజయాలు తప్పలేదు. చివరికి 2024లో ఐపిఎస్ నెగ్గాడు. ఆల్‌ఇండియా 358 ర్యాంక్ సాధించి, తన కలలు నెరవేర్చుకున్నాడు. నేడు అతను కానిస్టేబుల్ ఉదయ్ కాదు.. ఉదయ్ కృష్ణారెడ్డి ఐపిఎస్. తనను అవమానపరచిన వారే ఇప్పుడు సెల్యూట్ కొట్టే స్థాయికి ఎదిగారు, 'ది రియర్ హీరో' ఉదయ్.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



---

# బీడి కార్మికులకు కనీస పెన్షన్ రూ.6000

బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గోవర్ధన్, సుతారి రాములు డిమాండ్

హనుమకొండలో రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి సమావేశం




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇపిఎఫ్ ట్రస్టు బోర్డు కమిటీ నిర్ణయించిన ప్రకారం బీడి కార్మికులకు కనీస పెన్షన్ 6000 రూపాయలు పెంచాలని రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.గోవర్ధన్, సుతారి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. సమావేశంలో బి.గోవర్ధన్, సుతారి రాములు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. బీడి పరిశ్రమపై విధించిన ఆంక్షలను నిలిపివేసి పరిశ్రమను రక్షించి కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. బీడి పరిశ్రమపై జిఎస్‌టిని తగ్గించి, బీడీ కార్మికుల సంక్షేమ నిధి సెస్సును యధావిధిగా కొనసాగించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీడి కార్మికుల పిల్లలను ప్రోత్సహించే విధంగా ఉపకార వేతనాలు పెంచాలన్నారు. సంక్షేమదవఖానాలో డాక్టర్లను, సిబ్బందిని పెంచి, మందులు స్టాకు ఉంచాలన్నారు. బీడి కంపెనీలలో నెలలో 26 రోజులు పని కల్పించి, ఆకు, తంబాకు చేతినిండా ఇవ్వాలని, నాసిరకం తునికాకు సరఫరా చేయడంతో 1000 బీడిలకు సరిపోక సగం తొట్టి నింపడం జరుగుతుందని, దీంతో సగం కూలీ నష్టపోతున్నారన్నారు. నాసిరకం తునికాకు వాపస్ తీసుకోవాలని, కటింగ్ బేసిక్ పైకి కత్తిరించి ఆవరేజ్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం 2014 కట్ ఆఫ్ తేదీని ఎత్తివేసి 2016 రూపాయల జీవన భృతిని నాలుగు వేల రూపాయలకు పెంచాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని, స్థల ఉండి నిర్మించుకోలేని కార్మికులకు ఐదు లక్షల నుండి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం పెంచాలన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఆల్ ఇండియా బీడి సిగార్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ తీర్మానం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా కేంద్రం జాతీయ కమిటీ సమావేశం డిసెంబర్ 9.10 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బీడి వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభలు బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరుగుతాయన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ఎ స్టాలిన్, ఎఐటియుసి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయకార్యదర్శులు కొక్కుల శాంత, కెవి.అనసూయ, కె.గోదావరి, బత్తిని సదానందం, కడారి రాములు, ఎస్.భానుచందర్, తిరునారి లక్ష్మణ్, రాష్ట్ర కోశాధికారి ఎండి.ముక్రం, నాయకులు అనుకరి అశోక్, డి.మహేష్, ఎండి కాసిం, ఆది రంగారెడ్డి, గుంటి రాజేందర్, జగిత్యాల, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, అదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుండి రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు



సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

సిపిఐలో 50 కుటుంబాల చేరిక

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములలో ఎర్రజెండాల పాతి పేదల ఇండ్ల స్థలాలు కోసం భూపోరాటాలను ఉదృతం చేస్తామని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పేర్కొన్నారు. సోమవారం ధర్మసాగర్‌లో 50కుటుంబాలు సిపిఐలో చేరగా వారికి భిక్షపతితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజు సిపిఐ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ హనుమాకొండ జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతంగా కొనసాగుతున్నదని, వరంగల్ మహానగరంలె ఉపాధి అవకాశాలు లేక విద్యావంతులు, యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి ఉపాధి కల్పించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐలో చేరిన వారిలో భాగ్యమ్మ,ఆలకుంట్ల రాజయ్య, పల్లెపు కనకయ్య, రజిత, కుమార్, వల్లపు విజయ, కళ్యాణ్, లక్ష్మి , రంజిత్ కుమార్, మౌనిక, కళావతి, సాంబలక్ష్మి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పిఐ నాయకులు చిలుక బాబు, వల్లపు వెంకటయ్య, అల్వాల రాజు, పద్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి




సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా వినతి

కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆందోళన

**ప్రజాపక్షం/వరంగల్ :** పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా కోరారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ బాష్ మియా మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేసి, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు నీరు అందించాలన్నారు. రైతన్నకు కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాల తీరుతో కష్టాలు తప్పడం లేదన్నారు. సాగునీరు, తాగునీరు సకాలంలో అందించకుండా ప్రాజెక్టుల పేరుతో రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సాగునీరు, యూరియా కొరతతో తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులతో పాటు, పలు ప్రాజెక్టులకు మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు చివరి వరకు నీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆరుకాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, గుండే భద్రి, సంగీ ఏలేందర్, గన్నారపు రమేష్, తోట చంద్రకళ, ల్యాదల్ల శరత్, కందిక చెన్నకేశవులు, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, పార్థసారథి, సుంకరి భవాని, గోవర్ధన్, చిట్యాల సువర్ణ, పనికిరాల రమేష్, అయిత యాకయ్య, చిరంజీవి, శ్వేత, మహేష్ ,దస్రు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కరించండి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సిపిఐ ప్రతినిధుల బృందం

**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** కొత్తగూడెం కార్పొరేషన్, పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో ముంపుకుగురైన ఎస్‌సిబి నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సిపిఐ ప్రతినిధుల బృందం పర్యటించింది. బాధిత ప్రజలను కలుసుకొని జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల సమాచారం ఇచ్చి ప్రభావిత ప్రాంతాలకు రప్పించి పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భారీవర్షాలతో అంతర్గత రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ స్తంబాలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వర్షాలు కొనసాగితే మరింత ప్రమాదం పరిస్థితులు నెలకొంటాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, పునఃనిర్మాణపనులు చేపట్టాలని కోరారు. ఇండ్లు కోల్పోయిన పేదలకు నష్టపరిహారం, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచివుందని తక్షణమే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్లామని, అత్యవసర నిధులు మంజూరు చేయించి ముంపు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాతకొత్తగూడెంపెనుబల్లి బ్రిడ్జిని సందర్శించి ప్రమాదకర పరిస్థితులను పరిశీలించారు. కూనంనేని కృషితో పెనుబల్లి బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల రూ.6.50 కోట్లు సిఆర్ఆర్ మంజూరయ్యాయని, అక్టోబర్‌లో పనులు ప్రారంభం అవుతాయని, వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తయి పెనుబల్లి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రతినిధి బృందంలో సాబీర్ పాషా వెంట నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సందెబోయిన శ్రీనివాస్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.





## నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి : దండి సురేష్

**కొణిజర్ల :** భారీవర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ప్రతినిధి బృందం కొణిజర్ల మండలంలో భారీవర్షాలకు నీటమునిగిన ప్రాంతాలను పరిశీలించారు. తనికెళ్ల సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలించిన అనంతరం దండి సురేష్ మాట్లాడుతూ రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయారని తెలిపారు. నీటి పరివాహక ప్రాంతాలతో పాటు మెట్ట పంటలు, ముఖ్యంగా పెసర, పత్తిపంటలు ఎర్రబారి ఎదుగు బొదుగు లేకుండా పోయాయన్నారు. పెసర దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లాలో 50వేల ఎకరాల్లో వివిధ రూపా ల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, నష్టం అంచనా వేసి తక్షణం పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినిధుల బృందంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిడికంటి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, సిపిఐ, రైతుసంఘం నాయకులు మునిగ కోటేశ్వరరావు, యాసా వెంకటేశ్వరరావు, రత్తయ్య, నర్సింహారావు, సీతారాములు, నరేష్, బానోత్‌రాములు, బానోత్ రామయ్య పాల్గొన్నారు.

# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజావాణికి 86 దరఖాస్తులు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను పరిష్కరించాలి అని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , సుధీర్ , ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి , డాఆర్‌ఓ మంగ్లీ లాల్ ,ఆర్‌డిఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జనంలో అపశృతి... ప్రాణాలు విడిచిన తండ్రీకొడుకులు

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో రెండు నిండు ప్రాణాలు పోయాయనీ, నిమజ్జనానికి చెరువువద్ద కనీసం ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండిగల్ గ్రామ ప్రజలు దుండిగల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో కూరగాయలు అమ్ముకుంటూ వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని, శ్రీనివాస్‌కు 8 ఏళ్ళ క్రితం వివాహం జరగగా, అతనికి ముగ్గురు సంతానం. అందులో పెద్ద కొడుకు జాన్ వెస్లి, మరో ఇద్దరు పిల్లలు నిన్న రాత్రి ఆదివారం నిమజ్జనానికి వినాయక విగ్రహం తరలించిందేకు రెంట్ మాట్లాడుకున్న శ్రీనివాస్ పెద్దకొడుకు జాన్ వెస్లీ ని కూడా తీసుకెళ్లాడు.రాత్రి దుండిగల్ మోతి చెరువులో నిమజ్జనం చేసి ఆటోను వెనక్కి తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులోకి దూసుకు వెళ్లిందని ఆటో కనిపించకపోయేసరికి అందరూ ఇంటికి వెళ్లిపోయారనుకుని ఉదయం కావస్తున్నా, తండ్రి కొడుకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి చెరువు దగ్గరకి వచ్చి చూడగా,ఆటో చెరువులో పడి పోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు,డిఆర్ఎఫ్ సిబ్బంది చెరువులో 3 గంటలుగా గాలింపు చేపట్టి క్రేన్ సహాయంతో ఆటోను బైటికి తీశారు. అందులో శ్రీనివాస్ (35), అతని కొడుకు జాన్ వెస్లీ (7), ఆటో డోర్ ఓపెన్ తెరుచుకోకపోవడంతో నీటిలో మునిగి, ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయారని నిర్ధారించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



## చెరువులకూ వ్యర్థాల ముప్పు... భారీగా చేపలు మృత్యువాత

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** కలుషిత వ్యర్థ రసాయనాలు చెరువులోకి వదలడంతో చేపలు భారీగా మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో సోమవారం చోటుచేసుకుంది. వర్షాకాలం మొదలై వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల యాజమన్యాలు యథేచ్ఛగా కాలుష్య జలాలను వర్షపు నీటితో కలిపి బయటకు వదులుతున్నారు. దీంతో సమీపంలోని చెరువులు, కుంటలు కాలుష్య జలాలతో నిండిపోయి చేపలు పెంచి వాటిని విక్రయించి జీవనాన్ని సాగిస్తున్న మృత్స్యకారులకు కన్నీరు తెప్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీనారాయణ చెరువుని బిజెపి మేడ్చల్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి పరిశీంచారు.

ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విధంగా ప్రతి ఏడు మత్స్యకార సోదరులు లక్షలాది రూపాయల నష్టం జరగడం కలుషిత నీటి వల్ల పశువుల పాలుకూడా కలుషితం అవుతూ రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభు త్వం స్పందించి కంపెనీపై చర్యలు తీసుకుని బాధిత మత్స్యకారుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మత్స్యకారులు అధ్యక్షులు, సెక్రటరీలు, అధికారులు, ఎమ్మార్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## దసరా నాటికి కొత్త గ్రంథాలయాలు

### గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** వచ్చే దసరా కల్లా ఉమ్మడి శామీర్‌పేట మండలంలో రెండు కొత్త గ్రంథాలయాలను ప్రారంభిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట ప్రెస్ క్లబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌తో కలిసి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 18 గ్రంథాలయాలు నడుస్తునాయని చెప్పారు.

జిల్లాకు కొత్తగా 14 గ్రంథాలయాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. కీసరలో అర్థాంతరంగా ఆగిపోయిన లైబ్రరీ భవనాన్ని పూర్తి చేస్తామ ని అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాపై సిఎం రేవంత్‌రెడ్డికి మంచి అభిప్రా యం ఉందని ఖచ్చితంగా కొత్తగా ప్రతిపాదించిన గ్రంథాలయాలకు త్వరలో నే అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌కు మొదటిసారి విచ్చేసిన లైబ్రరీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ నర్సింహ్మాయాదవ్, దోసకాయల వెంకటేష్‌ను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండలంలో 69వ ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడా పోటీలు సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి జగ్గంగూడలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి శామీర్ పేట మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం 180 జట్లకు గాను 2200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, జీనియస్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ కల్పనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




# బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత తేవాలి

### జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసిల 42శాతం రిజర్వేషన్లకు తమిళనాడు తరహాలో చట్టబద్ధత కల్పించాలని పలువురు బిసి నేతలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షంతో సమావేశమే, ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లాలని కోరారు. అప్పుడే బిసిల రిజర్వేషన్లకు అడ్డంకులు తొలగుతాయన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 'బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు – సాధ్యాసాధ్యాల'పై చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ఆలిండి యా బిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపికి బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలు ఉన్నారని, అందుకే బిల్లును ఆమోదించడం లేదని కేంద్రం పెద్దలు చెప్తున్నారని పేర్కొన్నారు. కానీ, ముస్లింలు ఉన్న ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. చిరంజీవులు మాట్లాడుతూ ఇప్పటికే పది రాష్ట్రాల్లో 50శాతం సీలింగ్ పేరుతో బిసి రిజర్వేషన్ల పెంపును కోర్టులు కొట్టివేశాయని, అందుకే తాము మొదటి నుంచి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ఎంపిలు ఢిల్లీలో ధర్నాలు, నిరాహారదీక్షలుచేసి, బిసి రిజర్వేషన్లు సాధించాలని డిమాండ్ చేశారు.

బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అమలుకు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఉద్యమం చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె.వి.గౌడ్, చెన్న శ్రీకాంత్, నేతలు కిరణ్ కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, కర్నాటి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ నుంచి రాష్ట్రాన్ని కాపాడేది టిజిసిఎస్‌బి

* నేడు వ్యూహ ల్యాబ్‌ను ప్రారంభించనున్న డిజిపి జితేందర్
* హైదరాబాద్ ఐఐటితో పోలీసు శాఖ అవగాహన ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ క్రైమ్ నుంచి తెలంగాణ ప్రజలను రక్షించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) సిద్ధమైంది. ఇప్పటికే సైబర్ క్రైమ్‌లను చేధించడంలో దేశంలోనే నేంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ పోలీసులు సైబర్ క్రైమ్‌లో కొత్త కొత్తగా వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ ఐఐటి యాజమాన్యం సహకారం తీసుకోవాలని నిర్ణయించారు.

ఈ మేరకు వారితో తెలంగాణ పోలీసు శాఖ అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు గచ్చిబౌలి ఐఐటిలో వ్యూహా ల్యాబ్ (సైబర్ ఇన్నోవేషన్ హబ్)ను ఏర్పాటు చేశారు. ఈ వ్యూహ ల్యాబ్‌ను డిజిపి డాక్టర్ జితేందర్ మంగళవారం ప్రారంభిస్తారని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ ల్యాబ్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన అధికారులతో పాటు ఐఐటి విద్యార్థులు, నిపుణులు ఉంటారని తెలిపారు. ఆయా యాప్‌ల ద్వారా తెలంగాణ ప్రజలను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లకు గాలం వేసేందుకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు రోజుకోక కొత్త పద్దతిలో ప్రజల డబ్బును దోచుకుంటున్నారని వారి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు కనిపెట్టి అరికట్టేందుకు ఈ వ్యూహా ల్యాబ్ తమ సిబ్బంది, అధికారులకు శిక్షణ కూడా ఇస్తుందన్నారు. సైబర్ నేరగాళ్ల సవాళ్లను తిప్పికొట్టినప్పుడే బాధితులు నష్టపోకుండ ఉండటానికి తెలంగాణ పోలీసు శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నా రు. ఐఐటి, టిజిసిఎస్‌బి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వ్యూహ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐల్యాబ్ క్యాపిటల్ ఛైర్మన్ శ్రీనిరాజు, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కె శుక్లా, టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్, ఐఐటి హైదరాబాద్ ప్రొఫెసర్ పి.జె.నారామయణలు పాల్గొంటారు.

# యువ ఇంజనీర్లను తీర్చిదిద్దడమే లక్ష్యం

### టెక్ సెంటర్ ఇండియా హెడ్ కృష్ణస్వామి జంబునాథన్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** యువ ఇంజనీర్లకు శిక్షణ, మెంటార్ షిప్, అత్యాధునిక ఆటోమోటీవ్ టెక్నాలజీల అనుభవం ద్వారా తీర్చిదిద్దడమై తమ లక్ష్యమని జెడ్ ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ టెక్ సెంటర్ ఇండియా హెడ్ కృష్ణస్వామి జంబునాథన్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో డ్రైవ్ లైన్, ఛాసిస్ టెక్నాలజీలో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి జర్మనీకి చెందిన టెక్నాలజీ సంస్థ జెడ్ఎఫ్ నెక్స్‌జెన్ నెక్సెస్ 2025 రెండవ ఎడిషన్‌ని విఎన్ఆర్ విజెఐఈటితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్ఎఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫిలిప్ గాస్నియర్, విఎన్ఆర్ విజెఐఈటి ప్రిన్సిపల్ డాక్టర్ సిడి నాయుడులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా జెడ్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రతినిధి హూల్గర్ క్రాఫ్ట్, టెక్ సెంటర్ ఇండియా హెడ్ కృష్ణస్వామి జంబునాథన్‌లు మాట్లాడుతూ సంస్థ ప్రతినిధులు అకాడమిక్ రంగం మరియు పరిశ్రమ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి యువ ఇంజనీర్లను శిక్షణ, మెంటార్ షిప్ మరియు అత్యాధునిక ఆటోమోటివ్ టెక్నాలజీల అనుభవం ద్వారా తీర్చిదిద్ధడమై తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంతో భారతదేశంలోని విద్యాసంస్థల తో కలిసి పనిచేస్తూ, తదుపరి తరం ఇంజనీర్లు, ఆవిష్కర్తలను సాధన చేయాలన్న జెడ్ఎఫ్ దృష్టిని బలపరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్ఎఫ్ ఇండియా ఇంజనీరింగ్ డైరెక్టర్ అశోక్ కుమార్ ఝూ, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి : సిఐ



**ప్రజాపక్షం/వికారాబాద్:** వినాయక నిమజ్జానం సందర్భంగా ఎలాంటి అవాంయనీయ ఘటనలకు తవులేకుండా శాంతియుతంగా జరుపుకోవాలరి వికారాబాద్ సిఐ బీం కుమార్ సూచించారు. సోమవారం రాత్రి కమల్ నాగర్‌లో జరిగిన గొడవపై కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలు ఉల్లఘించి ,ప్రజల శాంతికి భంగం కలిగించిన లేదా డిజే లు వాడిన నిర్వహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అందరు కలిసిమెలిసి వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ కడ అభివృద్ధి పనులలో అధికారులు నిర్లక్ష్యం వీడి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులు సూచనలు చేశారు. సోమవారం కడ ప్రత్యేక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు కొడంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేటాయించి నిధులు మంజురు చేయడం జరిగిందన్నారు. మంజూరు అయిన పనులకు ప్రొసిడింగ్స్ ఇచ్చినప్పటికి ఎందుకు పనులు ప్రారంభించలేకపోతున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. పనులు వేగవంతం కాకుండా జాప్యం జరిగితే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తు పనులు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టవల్సిన మోడ్రన్ టాయిలెట్స్ నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా కెజిబివిలలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సౌకర్యవంతంగా ఉండేందుకు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో ముందస్తుగానే ఇరిగేషన్, విద్యుత్, మిషన్ భగీరథ, అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పనులకు పూనుకొవాలని సూచించారు. మున్సిపాలిటిల్లో చేపట్టే పనులు నాణ్యతతో ఆదర్శవంతంగా చేపట్టాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

# తాండూరులో యూరియా కోసం బారులు

* ప్రైవేటులో అధిక ధరలకు విక్రయాలు
* పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో వ్యాపారులు కుమ్మకై యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క ప్రజా ప్రతినిధులు తాండూరులో యూరియా కొరత లేదని చెబుతున్నారు. బ్లాక్ మార్కెట్‌లో మాత్రం కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రహిస్తూ రైతులను నిలువున దోచుకుంటున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం అధికారులకు తెలిసినా తమకేమీ పట్టన్నట్లుగా వ్యవహరిస్తు న్నారు. ప్రభుత్వం ఓ పక్క హెచ్చరిస్తున్నా తాండూరులో మాత్రం యూరియా కొరతను అధిగమించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రభుత్వం మరో పక్క వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియాను విక్రయిస్తూ రైతులకు అందుబాటులో పెట్టిన అది ఏ మాత్రం సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండూరులో వ్యవసాయ సాగు గణనీయంగా పెరగడంతో యూరియాను అధిక మొత్తంలో రైతులు వాడుతున్నారు. అందుకు తగ్గట్లుగా యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతులు మండిపడుతున్నారు. గత నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం రైతు సహకార సంఘాలకు యూరియాను సరఫరా చేసింది. అట్టి యూరియాను రైతులకు పంపిణీ చేయడంలో మాత్రం జాప్యం చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దేముల్‌లోని ఎఫ్‌ఎసిఎస్ రైతు సహకార సంఘంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. పొలం పనులు మానుకోని యూరియా క్యూలైన్‌లో నిలబడి టోకెన్లు తీసుకుంటున్నారు. టోకెన్లకు సైతం బారులు తప్పడం లేదు, ఎకరం నుండి నాలుగైదు ఎకరాల భూమి ఉన్న రైతుకు రెండు బస్తాల మించి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అది ఏ మూలకు సరిపోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

యూరియా కోసం క్యూలైన్‌లో నిలపడిన మల్లప్ప అనే రైతు సొమ్మసిల్లి కింద పడిపోడంతో రైతును ఆసుపత్రి కి తరలించారు. యూరియా పంపిణీకి టోకెన్లు ఇస్తున్నారన విషయం వివిధ గ్రామాల రైతులకు తెలియడంతో పెద్దఎత్తున్న రైతు సహకారం సంఘానికి చేరుకోవడంతో భారీగా బారులు తీరా రు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నియంత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతు లకు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి టియుడబ్ల్యుజె కృషి


### ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** జర్నలిస్టుల సంక్షేమానికి టియుడబ్ల్యుజె (ఐజెయు) యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని శామీర్‌పేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో టియుడబ్ల్యుజె సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ కమిటి పిలుపు మేరకు మండలంలోని జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు పూర్తి చేస్తామని చెప్పారు. టియుడబ్ల్యుజె యునియన్‌లో సభ్యత్వం ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు భూపాల్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు మంజాల శేఖర్, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, కార్యవర్గ సభ్యులు రవీందర్‌గౌడ్, చిన్నా, శ్రావణ్‌కుమార్, సలహాదారులు వెంకట్‌రెడ్డి, నర్సింహారావు, సభ్యులు ప్రభాకర్, బాలకృష్ణ, రవి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 88 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 88 అర్జీలను ధరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కల్సి జిల్లాస్థాయి ప్రభుత్వ శాఖాధికారుల సమక్షంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

### జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే బండారి వినతిపత్రం

**ప్రజాపక్షం/కాప్రా :** ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం ఆయన జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ పటేల్‌ను కల్సి వినతిపత్రాన్ని అందచేసారు. ఇటీవలి భారీ వర్షాలతో డివిజన్లలోని పలు ప్రాంతాల్లో రహదార్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయని, దీనివల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీంతోపాటు పలు చోట్ల డ్రైనేజీ పైపులు పగిలి మురికినీరు వరదల్లా పారుతూ అనారోగ్యాల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పాడైన రహదార్లతోపాటు అవసరం ఉన్నచోట సిసి రోడ్లు వేయాలన్నారు. స్థానికుల ఆహ్లాదకర పరిస్థితుల కోసం జిహెచ్‌ఎంసి పార్కులను సుందరీకరణ పనులుచేస్తూ వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలు పార్కుల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులకు గాను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పర్యటిస్తూ ప్రతిపాదనలకు అనుమతులిస్తూ అవసరమైన నిధులు మంజూరు చేసి వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.





## పదవీ విరమణ సహజం..

### పిఎసిఎస్ అధ్యక్షులు రాంచంద్రారెడ్డి

**ప్రజాపక్షం/బంట్వారం :** ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని పిఏసిఎస్ చైర్మన్ రాంచెంద్రా రెడ్డి సోమవారం అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సిఇఒగా విధులు నిర్వహిస్తున్నా వడ్ల బ్రహ్మం పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో పదవీ విరమణ సహజం అని, గత 20 యేళ్ళుగా పిఎసిఎస్ సంఘానికి ఆయన చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. సంఘానికి చేసిన సేవ బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారని ఆయనను అభినందించారు. చివరగా శాలువాతో పూలమాలతో సత్కరించి పదవీ వీరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ సుధకార్ గౌడ్, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు, ఆయా పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

**రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి :** రైతులు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించాలని పిఏసిఎస్ అధ్యక్షులు రాంచెంద్రా రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు తీసుకున్నా రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి చెందుతుందని పేర్కొన్నారు. బకాయిలు ఎక్కువ అయితే సంఘం నష్టాల్లో కూరుకుపోతుందని కావున ప్రతి రైతు సకాలంలో రుణం చెల్లించాలని కోరారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** సిఎం సహాయనిధి నిరుపేదలకు వరమని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవాని నగర్‌లో నివాసం ఉంటున్న తిరుమల మైతిలీ గుండెకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేక వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆపరేషన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 2,50,000 ఎల్‌ఒసి ని మంజూరు చేయించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సదానంద్ రెడ్డి, పల్లం శ్రీనివాస్, ఫనిష్ తదితరులు పాల్గొన్నారు..

## మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ ఆర్‌టిసి డిపోలో ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి బస్సును పునరుద్ధరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తామని అనేక మార్లు హామీ ఇచ్చామని, వాటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మంగులాల్ నాయక్, పురుషోత్తం రెడ్డి, శివ, సాయి, నర్సింలు, అరుణ్‌కుమార్, శ్రీకాంత్, సునీల్, నరసింహా, జాంగీర్, బసప్ప, రాఘవేందర్ గౌడ్, లింగారెడ్డిగూడ అశోక్‌పాల్గొన్నారు.

## నీళ్ల విషయంలో మోసపోవద్దు

పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేయడం తోపాటు నీళ్ల విషయంలో పాలమూరు ఎమ్మెల్యేలు మోసపోవద్దని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘవచారి మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతక పథకంలో భాగమే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ అనే విషయాన్ని పాలకులు గుర్తించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు అవుతున్న నేటిని నిధులు కేటాయించలేదని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు చెందిన వారే కాబట్టి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ విషయంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యాయన వేదిక కన్వీనర్ కె.రవీంధ్రనాథ్, మందారం నరసింహులు, వి.రామరావు, తిరుమలయ్య, అర్జునప్ప, జైపాల్ రెడ్డి, ఖాజా షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు

షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రశాంతంగా వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు భక్తులు కృషి చేయాలని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతరెడ్డి కోరారు. సోమవారం పట్టణ శివారులోని బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పనులను పరిశీలించారు. నాగులపల్లి రోడ్డులో విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ప్రతిష్టించిన విఘ్నేశ్వర మంటపం వద్ద షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కళాశాల కరస్పాండెంట్ విశ్వనాథ్, ప్రిన్సిపల్ భవాని శంకర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్ హాజరై గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం బొబ్బిలి చెరువుకు నిమజ్జనానికి తరలించారు. కమిషనర్ సునీతరెడ్డి మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు భక్తులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కరుణాకర్, అధ్యాపకులు రాఘవేందర్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

## అభ్యంతరాలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** ఓటరు లిస్టులో వచ్చిన అభ్యంతరాలను తక్షణమే పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారిణి రాధారాణి అన్నారు. సోమవారం ఎంపిడిఒ చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసంధర్బంగా ఆమె మాట్లాడుతూ 2 వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 గ్రామ పంచాయతీలలో ఓటరు లిస్టులో మరణించిన, డూబ్లికేటు ఓట్లు ఎవరేవరివి ఉన్నాయి పరిశీలించి తొలగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఓటర్ల జాబితా సమగ్రంగా ఉడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు అయ్యప్ప,ఎంపిఒ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు బాగున్నాయ్...

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల బృందం కితాబ్



**ప్రజాపక్షం/యాచారం :** రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాగున్నాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల బృందం కితాబ్ నిచ్చింది. సోమవారం మాల్ గ్రామంలో ఎక్స్ పోజల్ విజిట్‌లో భాగంగా సందర్శించారు. మాల్ గ్రామ పంచాయతీకి ఆత్మనిర్బన్ పంచాయతీ అవార్డు వచ్చిన సంధర్బంగా గ్రామ పంచాయతీ పరిపాలన, ట్యాక్స్ కలేక్షన్ ,నిదుల ఖర్చులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశువుల సంత, పల్లెపకృతి వనం పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులు ఏ విధంగా రాస్తున్నారనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారి అనిల్‌కుమార్, క్రీడా అధికారిణి స్మిత, ఎంపిడిఒ రాధారాణి, ఎంపిఒ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సిటి పనుల్లో తీవ్ర జాప్యం

## ట్రాఫిక్ కష్టాలు ఇంకా తప్పవా?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సిటీ) పనుల ప్రగతి మందకొడిగా సాగుతోంది. నిత్యం రద్దీగా ఉండే జూబ్లీహిల్స్, నానల్‌నగర్ వంటి కీలక ప్రాంతాల్లో చేపట్టిన ఈ పనులు టెండర్ల ప్రక్రియకే పరిమితమవుతున్నాయి తప్పా, క్షేత్రస్థాయిలో ముందుకు సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన స్ట్రాటెజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఎస్‌ఆర్‌డిపి)1కు కొనసాగింపుగా, హెచ్‌సిటీ2 కింద కొత్త పనులను ప్రతిపాదించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్‌ఆర్‌డిపి పేరును హెచ్‌సిటీగా మార్చి, ఈ ప్రాజెక్టుల కోసం రూ.5942 కోట్లు మంజూరు చేస్తూ గతేడాది డిసెంబర్ 5న జిఓ 627ను జారీ చేసింది. దీంతో పాటు, కెబిఆర్ పార్కు చుట్టూ చేపట్టాల్సిన రూ.1090 కోట్ల పనులకు కూడా ఆమోదం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఈపనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, ఆర్థిక సంక్షోభంలో ఉన్న జిహెచ్‌ఎంసికి నిధులు సిద్ధంగా ఉన్నా, పనులను ముందుకు



తీసుకెళ్లడంలో ఇంజనీరింగ్ విభాగం వైఫల్యంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**చీఫ్ ఇంజనీర్‌కు జోడు పదవుల భారం...** హెచ్‌సిటీ పనుల చీఫ్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ విభాగంలో కూడా ఇంజనీర్ ఇన్ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. హెచ్‌సిటీ పనుల పురోగతిపై దృష్టి పెట్టడం కంటే, తన రెండో పదవిని కాపాడుకోవడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శకులు అంటున్నారు. దీనివల్ల సిఎం శంకుస్థాపన చేసిన పనుల పర్యవేక్షణ లోపించిందని, అందుకే ప్రాజెక్టులు టెండర్ల దశలోనే నిలిచిపోయాయని వాదనలు వినిపిస్తున్నాయి. సిఎం శంకుస్థాపన చేసి దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా, చీఫ్ ఇంజనీర్ ఒక్క పనిని కూడా క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయకపోవడం జిహెచ్‌ఎంసి నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పవచ్చు.

**టెండర్లపై చూపిన శ్రద్ధ పనులపై ఏదీ?...** హెచ్‌సిటీ పనుల విషయంలో జిహెచ్‌ఎంసి వైఖరి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కెబిఆర్ పార్కు చుట్టూ నిర్మించాల్సిన ఆరు స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్ పాస్‌ల కోసం రూ.1090 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు నెలన్నర రోజుల క్రితం హడావుడిగా టెండర్ల ప్రక్రియను చేపట్టారు. తక్కువగా కోట్ చేసిన రెండు అంతర్జాతీయ ఏజెన్సీలను ఎంపిక చేసి, ప్రభుత్వం ఆమోదం కోసం పంపినప్పటికీ, ఈ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**కెబిఆర్ పార్కు పనులపై కోర్టు వివాదాలు...** కెబిఆర్ పార్కును ఎకోసెన్సిటివ్ జోన్‌గా పరిగణిస్తూ, ఈ పనులు పచ్చదనాన్ని ధ్వంసం చేస్తాయని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణను సవాలు చేస్తూ మూడు వివాదాలు కోర్టు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కోర్టు వివాదాలు లేని ప్రాంతాల్లోనైనా పనులు ప్రారంభించేందుకు జిహెచ్‌ఎంసి ఇంజనీర్లు గత నెలన్నరగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వీటితో పాటు, మెహిదీపట్నం నుంచి కర్ణాటక, ముంబై హైవేకు వెళ్లే ప్రధాన రహదారి అయిన నానల్‌నగర్‌లో రూ.400 కోట్లతో నిర్మించాల్సిన మల్టీలెవల్ ఫ్లైఓవర్ కోసం కూడా జిహెచ్‌ఎంసి హడావుడిగా టెండర్ల ప్రక్రియను చేపడుతోంది. మిలటరీకి చెందిన బసంతర్ హౌస్‌లో రక్షణ శాఖ స్థలంలో ఈ ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉండగా, భూసేకరణ ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. ఈ సమస్యలు పనుల వేగాన్ని మరింత తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ‘రోస్టర్ పాయింట్లలో అన్యాయం’



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని నేషనల్ అంబేద్కర్ సేన, మాల ఐక్య సంఘాలు తెలిపాయి. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షులు మన్నే శ్రీధర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసి, మాలలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మాల రాజకీయ జెఎసి చైర్మన్ డా.మంచాల లింగస్వామి మాట్లాడుతూ అసెంబ్లీలో గొంతెత్తని మాల ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కరణం కిషన్, అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులు తాలుకా రాజేశ్, దాసరి విశాల్, సుధామల్ల అంజలి మంగ పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో యూరియా అందజేయాలి

సిపిఐ, రైతు సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంతం మాధవరెడ్డి, ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని సిపిఐ, రైతు సంఘం కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు యూరియా కోసం వ్యవసాయ సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వర్ష కాలంలో సన్న, చిన్నకారు రైతులు ఉన్న కొద్ది పాటి పంట భూములలో వరి సాగు చేసుకుంటే యూరియా సక్రమంగా లభించక సహకార సంఘాల దగ్గర పడిగాపులు పడుతున్నారని వాపోయారు. యూరియా పంపిణీపై కేంద్ర, రాష్టా ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవటం సిగ్గు చేటని విమర్శించారు. రైతులకు సకాలంలో యూరియా అందించటంలో కేంద్రం ఘోరంగా విఫలం చెందాదన్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన వివిధ పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బాలపూర్ మండలం సిపిఐ కార్యదర్శి శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, బాలయ్య, పి నీలమ్మ, సిఎచ్ కుమార్, ఎం నర్సింహతో పాటు రైతులు పాల్గొన్నారు.

## యూరియా కోసం అన్నదాతలకు తప్పని అవస్థలు

సహకార కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సోమవారం కేశంపేట మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు ధర్నాకు దిగారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరం ఉన్న మేరకు యూరియా పంపిణీ చేయాలని ఎన్నిమార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట మండలంలోనే కాకుండా ఫరూక్‌నగర్, నందిగామ, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా ఇస్తే ఏమి సరిపోతుందని రైతులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మెన్ గంగ్ర జగదీశ్వర్ గౌడ్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు యత్నించారు. రైతులకు సరిపోయే యూరియా ఉందని, అందుకు ఒకేసారి వస్తే కొంతఇబ్బంది ఎదురవుతుందని, చిట్టిలు ఇస్తున్నాం..దాని అధారంగా ఇచ్చేందుకు కృషి చేస్తామని సూచించారు. దీంతో రైతులు ధర్నాకు దిగారు. పరిస్థితిని గమనించిన మండల వ్యవసాయ అధికారిణి శిరీష కేశంపేట మండలంలో నెలకొన్న పరిస్థితిని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. రైతులకు అవసరం ఉన్న మేరకు యూరియాను పంపిణీ చేయాలని కోరారు. మండలంలోని రైతులకు అవసరం ఉన్న మేరకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష తెలిపారు. దాంతో రైతులు శాంతించారు.

## ‘కార్మికశాఖలో అవినీతి రూపుమాపాలి’



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రత్యేక దృష్టిసారించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ శాఖలోని అధికారులను వెంటనే బదిలీ చేసి, అవినీతిని రూపుమాపాలని కోరింది. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సి కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, హరీశ్ మీడియాతో మాట్లాడారు. కార్మికశాఖ కార్యాలయంలో కొన్నేళ్లుగా సూపరింటెండెంట్ స్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారి తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ శాఖలో రూ.వెయ్యి కోట్ల వరకు అవినీతి చోటుచేసుకొన్నదని ఆరోపించారు. దీంతో అసంఘటిత కార్మికులకు సంక్షేమం అందక, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.

## అరెస్టులతో భయపడే ప్రసక్తే లేదు

-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య

**ప్రజాపక్షం/కొందుర్గు:** అరెస్టులతో భయపడే ప్రసక్తి లేదని, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పోరాటాలు చేస్తామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు. సోమవారం ఎలాంటి సమాచారం లేకుండానే కొందుర్గు మండల సిపిఐ కార్యదర్శి బాగాల నర్సింహులును మహదేవ్‌పూర్ గ్రామంలో హౌజ్‌అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ తమ పార్టీ ఎలాంటి పిలుపు ఇవ్వలేదని, కొందుర్గు పోలీసులు అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ కార్యక్రమం ఉంది..ఎందుకోసం అరెస్టు చేయాల్సి వస్తుంది అనేది పోలీసులు అవగాహన కలిగి ఉండాలని, సిపిఐ నేతల అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు వివరించారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రంగారెడ్డి జిల్లా జెఎసి కన్వీనర్ డాక్టర్ రామారావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రంగారెడ్డి జిల్లా జెఎసి కన్వీనర్ డాక్టర్ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ,కార్మిక, పెన్షనర్స్ జెఎసి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్‌లో నల్ల బ్యాడ్జెస్‌తో ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులన న్యాయమైన వివిధ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనేష్ కుమార్ నోరి, పిసి వెంకటేష్, గోపాల్ నాయక్, ఇస్మాయిల్, కుశాల్ జమ, నాగార్జునరావు, వెంకటప్ప, రాకేష్, రంగయ్య, శాంతి శ్రీ, మహేష్, సైదమ్మ, అలివేలు, పైలట్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల్లేకుండా తుది ఓటర్ల జాబితా



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఎలాంటి తప్పుల్లేకుండా తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ డివిజన్‌లకు చెందిన ఆర్‌డిఒలు, జెడ్‌పి సిఇఒ, డిపిఒ, ఎంపిడిఒలు, తహసీల్దార్లతో కలెక్టర్ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు జాబితా పరిశీలించి అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో డిపిఒ సురేష్ మోహన్, జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన అండర్–17 వుడ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచి బంగారం పథకం సాధించిన రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నంలో వాసవి జూనియర్ అండ్ ఒకేషనల్ కళాశాల క్రీడాకారులను కలెక్టర్ నారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల చైర్మన్ మదారం రమేష్, సీనియర్ అధ్యాపకుడు సుధాకర్, సురేష్, తెలంగాణ వుడ్ బాల్ కోఆర్డినేటర్ రహమత్, రంగారెడ్డి జిల్లా వుడ్ బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఆర్.కిరణ్, జె.రాజేష్ ఎం.మహేష్, బి.చరణ్, రిజ్వాన్, ధ్రువ చరణ్, అబ్దుల్ రెహమాన్, చంద్ర శేఖర్, జావిద్, సమీర్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

### ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఒ సంగీతతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

### విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ హాస్టల్స్, పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. గణేష్ నిమజ్జనంలో కావాలసిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

## ముష్కిచెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/గండిపేట:** మణికొండ పురపాలక సంఘం పరిధిలోని ముష్కి చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం సందర్శించారు. గతంలో ధ్రువాన్సు ఎన్జీవో మరియు తత్వ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి ఆగస్టు వరకు హైడ్రా అధికారులు గడువు ఇచ్చారు. ఆ గడువు ముగియడంతో సోమవారం హైడ్రా, ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువును సందర్శించి పరిశీలించారు. కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయని, రాబోయే రెండు వారాల్లో ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో పోసిన మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. ఇందుకు హైడ్రా నుంచి కూడా మిషన్‌ను పంపుతామని ఆయన తెలిపారు. అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర చర్చలు జరిపి, దానికి కావాల్సిన సహకారం హైడ్రా నుంచి లభిస్తుందని తత్వ సంస్థ వారికి ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు చెరువు పచ్చదనాన్ని, ప్రకృతి పరిరక్షణను, అలాగే మంచినీటితో నిండి ఉండే చెరువు అవసరాన్ని స్థానికులు హైడ్రా కమిషనర్ ప్రస్తావించారు. ప్రజలతో కలసి కమిషనర్ బైపాస్ ఛానల్ ద్వారా చెరువులోకి వస్తున్న మంచినీటిని పరిశీలించిన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం హైడ్రా కమీషనర్ సంకటహరణ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఇరిగేషన్ డిఇ రమాదేవి, ఎఇ నరేంద్ర, ఇతర అధికారులు, చుట్టుపక్కల అపార్ట్మెంట్ నివాసితులు, మహిళలు స్థానిక యువకులు పాల్గొన్నారు.





# 'మదరాసి' ప్రీ రిలీజ్

శివకార్తికేయన్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మదరాసి', ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టీజర్, ట్రైలర్, రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న థియేటర్స్ లోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ మాట్లాడుతూ ఈ సినిమాలో లవ్ యాక్షన్ రెండు పిల్లర్స్. అందులో లవ్ పోర్షన్ అద్భుతంగా రావడానికి కారణం తనే. ఈ సినిమాలో మరో పిల్లర్ విలన్ విద్యుత్ జమ్వాల్. ఆయనతో యాక్షన్ సీక్వెన్స్ చాలా క్రేజీగా ఉంటాయి. అందరూ సెప్టెంబర్ 5 థియేటర్స్‌కి వెళ్లి మద్రాసి చూడండి.




## నేడు 'ఉస్తాద్ భగత్ సింగ్' పోస్టర్ విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. పుట్టినరోజు (సెప్టెంబర్ 2) సందర్భంగా తాజాగా ఈ చిత్రం నుండి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. త్రీ పీస్ సూట్, టోపీతో పూర్తిగా నల్లటి దుస్తులు ధరించి పవన్ కళ్యాణ్ చాలా అందంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



# అంగరంగ వైభవంగా 'గామా' అవార్డ్స్



దుబాయ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో టాలీవుడ్ పరిశ్రమ నుండి పలువురు సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు, సీఈఓ సౌరభ్ కేసరి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా అత్యంత వైభవంగా ఈ అవార్డుల కార్యక్రమం ఘనంగా జరిగింది. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ సినీ దర్శకులు బి.గోపాల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్ కళాకారులకు, సినిమాలకు గామా అవార్డ్స్ బహుకరించారు. ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం స్పెషల్ అవార్డును అందుకున్నారు. వీరితోపాటు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును నిర్మాత అశ్వినీ దత్ అందుకున్నారు. హీరో సత్యదేవ్ హీరోయిన్ కూడా స్పెషల్ అవార్డును అందుకున్నారు.




# 12న తెలుగులో 'టన్నెల్' విడుదల

కోలీవుడ్ హీరో అథర్వా మరోసారి తనకు కలిసి వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో 'టన్నెల్' అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడులో ఈ ట్రైలర్ సెన్సేషన్‌గా మారింది.

# అక్టోబర్ 16న మిత్ర మండలి విడుదల



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'మిత్ర మండలి' చిత్రం హాస్యం, రహస్యం, యవ్వన శక్తి మిశ్రమంగా ప్రేక్షకులకు అపరిమిత వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వీరు వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చబోతున్నారు. అక్టోబర్ 16న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతగా సోమరాజు పెన్మెత్స వ్యవహరిస్తున్నారు.

# 'నేను రెడీ' షూటింగ్ షురూ



హీరో హవీష్, డైరెక్టర్ త్రినాథరావు నక్కిన క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'నేను రెడీ'. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక టాకీ పార్ట్ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైయింది. హీరోతో పాటు ప్రధాన నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. నేను రెడీ కోసం త్రినాథరావు నక్కిన తన మార్క్‌లో అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ స్క్రిప్ట్‌ని రెడీ చేశారు. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, వీటి గణేషన్, అజయ్, మురళి గౌడ్ గోపరాజు లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

# ఈ సినిమా బాగుంటుంది : బన్నీవాస్



'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా సెప్టెంబర్ 5న థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. సోమవారం బన్నీ వాస్, వంశీ నందిపాటి మీడియాతో మాట్లాడారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ ఈ మూవీ బాగుందని వంశీ నందిపాటి చెప్పాడు. ఆ తర్వాత ఆదిత్య హాసన్ వచ్చి మూవీ గురించి వివరించాడు.

## హాలీవుడ్ కొలాబరేషన్‌లో

# 'ది ప్యారడైజ్'

నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్'లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని ఇంటెన్స్, ఫియర్లెస్ క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. 'ది ప్యారడైజ్'ను గ్లోబల్ సినిమా విజన్‌తో చాలా గ్రాండ్ స్కేల్‌లో రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్‌తో మేకర్స్ యూనివర్సల్ విజన్ అందరికీ అర్థమైయింది. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్, బోల్డ్ ప్రమోషన్స్ అన్నీ గ్లోబల్ మూవీ దిశగానే సాగుతున్నాయి. లేటెస్ట్ అప్డేట్ ఏమిటంటే.. ది ప్యారడైస్ టీం హాలీవుడ్‌లోని #కనెక్ట్ మొబ్ సెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ అలెగ్జాండ్రా విస్కోంటినితో కలసి సినిమా కోసం కొలాబరేషన్ అవుతున్నారు. ఈ సినిమా 2026 మార్చిలో వరల్డ్ రిలీజ్‌కి రెడీ అవుతుంది



# బిల్లులు ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

పెంపుకు అడ్డంకిని తొలగించిన ఈ బిల్లులను ఆమోదించాలని ప్రతినిధి బృందం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరింది. రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న చట్ట సవరణ బిల్లులను ఆమోదిస్తే,బిసి రిజర్వేషన్లను పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని, సభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని వారు గవర్నర్‌ను విజ్ఞప్తి చేశారు.

### బిజెపి,ఎంఐఎం గైర్హాజరు

బిసి రిజర్వేషన్ల అమలులో భాగంగా శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించాలని అఖిలపక్షం గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో కోరారు. ఈ మేరకు ఆయన అన్ని రాజకీయ పార్టీల శాసనసభాపక్ష నాయకులకు లేఖ కూడా రాశారు. అయితే గవర్నర్‌ను కలిసేందుకు ఎంఐఎం, బిజెపి నుంచి ఎవ్వరూ హాజరుకాలేదు.

### బిసి రిజర్వేషన్లకు సానుకూలంగా స్పందించండి: మహేష్‌కుమార్ గౌడ్

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ ఉండడంతో బిసిలకు అన్యాయం జరుగుతుందని, తద్వారా వారి రిజర్వేషన్లను పెంచుకునే వెసులుబాటు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో 56.33 శాతం బిసిలు ఉన్నట్టు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో వెల్లడైందని, అందుకే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, బిసి సంఘాలు, మేధావులు కూడా రిజర్వేషన్లను పెంచాలని కోరుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో గవర్నర్ సానుకూలంగా స్పందించాలని కోరారు.

### ఇక బిసిల ఆవేశాన్ని ఆపడం సాధ్యం కాదు: నారాయణ

డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందిన, ఇప్పటికైనా బిల్లులను ఆమోదిస్తే, బిసిలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బిసి రిజర్వేషన్ల పెంపు అంశంలో పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నదని, బిసిల ఆవేశాన్ని ఆపడం ఇక సాధ్యం కాదని సూచించారు.

### బిజెపి కుంటిసాకులతో అడ్డుకోవద్దు : నెల్లికంటి సత్యం

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలు బలపడుతున్నాయని, బిసిలకు దక్కాల్సిన వాటాను ఇవ్వాలని, రిజర్వేషన్లను పెంచాలని సూచించారు. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను, 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను ఎత్తివేసే చట్ట సవరణ బిల్లును గవర్నర్ ఆమోదించాలని కోరారు. బిసి రిజర్వేషన్ల అమలుకు శాసనసభలో మద్దతు ప్రకటించిన బిజెపి, రాజ్‌భవన్‌లోని గవర్నర్‌ను కలిసేందుకు మాత్రం రాలేదని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లను కుంటిసాకులతో ఆడ్డుకోవద్దన్నారు.

### సిఎం పోరాటం ద్వారానే రిజర్వేషన్లు సాధ్యం: కె.పి.వివేకానంద

కె.పి.వివేకానంద మాట్లాడుతూ బిల్లులను గవర్నర్ ఆమోదించినప్పటికీ బిసి రిజర్వేషన్ల విషయంలో న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. 9వ షెడ్యూల్‌లో పొందుపర్చడం ద్వారానే బిసి రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందన్నారు. ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఢిల్లీలో పోరాటం చేయాలన్నారు. తమపైన నెపం పెట్టి చేతులు దులుపుకుంటే కుదరబోదన్నారు

# ఎన్నికల ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. రాజకీయాలతో సంబంధాలు ఉన్న లేకపోయినా ఓటు వేసే ప్రతి ఒక్కరికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం ఉన్నట్లేనన్నారు. తాను ఏ పార్టీ అభ్యర్థిని కాదని, తనకు ఏ పార్టీలో సభ్యత్వం లేదని, భవిష్యత్‌లో కూడా ఏ పార్టీలో సభ్యున్ని కాబోనని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గల పౌరుడిగా మాత్రమే తాను కేవలం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆయన వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా తనకు ఓటు వేసి గెలిపించాలని అన్ని పార్టీల ఎంపిలకు తాను విజ్ఞప్తి చేస్తూ లేఖలు రాయనున్నట్లు వెల్లడించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి పోటీలో ఉన్న తన ప్రత్యర్థి మధ్య చర్చలు, సంభాషణలు జరిగి ఉంటే ఈ దేశ ప్రజలకు ఎవరూ ఏమిటి అనేది తెలిసి ఉండేదని, కానీ తనకు ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు. గతంలో ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు ఏమిటి? పలానా అధికారం వారికి లేదని, మరీ ఎలా నిర్వహిస్తున్నారన్న ప్రశ్న వచ్చినప్పుడు ప్రపంచ న్యాయ కోవిదులైన జస్టిస్ కృష్ణఅయ్యర్ 'రిజర్వాయర్ ఆఫ్ పవర్' అని వ్యాఖ్యానించారన్నారు. రిజర్వాయర్ ఆఫ్ పవర్' అంటే ఎన్నికలను పారదర్శకంగా అత్యంత జవాబుదారితనంగా నిర్వహించేందుకు చట్టంలో లేని, రాజ్యాంగంలో లేని అధికారాన్ని వినియోగించుకునేందుకు మాత్రమేన తప్ప తమ ఇష్టానుసారంగా చట్టవిరుద్ధంగా వినియోగించుకునేందుకు కాదని గుర్తు ంచుకోవాలన్నారు.

**53ఏళ్ల న్యాయశాస్త్రంతో పెనవేసుకున్న పేగుబంధంలోని అంతర్భాగంగానే ఉపరాష్ట్రపతిగా పోటీ**

తాను 53 ఏళ్లుగా న్యాయవ్యవస్థతో పెనవేసుకున్న పేగు బంధమని, ఆ అంతర్ ప్రయాణంలో భాగంగానే ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్నానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి పదవి అనేది రాజకీయ పదవి కాదని, ఇది రాజ్యాంగబద్ధ పదవి అని, ఇప్పటికే 6 సార్లకు పైగా రాజ్యాంగానికి విధేయుడిగా ఉంటానని ప్రమాణం చేశానని, కానీ ఉపరాష్ట్రపతిగా అవకాశం లభిస్తే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేస్తానన్నారు. కొందరు తాను ఇచ్చిన తీర్పుల గురించి మాట్లాడారని, తనకంటే ముందు, తన తర్వాత 11 మంది న్యాయమూర్తులు ఆ కేసును విచారించారని, ఆ తీర్పు తనది కాదని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అని, తాను కేవలం ఆ బాధ్యతను మాత్రమే నిర్వర్తించానని ఆయన స్పష్టం చేశారు. ఆ తీర్పులో తాన ఏ ఒక్కరిని సమర్థించినట్లుగా ఉంటే శిరస్సు వంచి నమస్కరిస్తానని, సుప్రీంకోర్టు తీర్పులను పూర్తిగా చదివిన తర్వాతే మాట్లాడితే బాగుంటుందని హితువు పలికారు. తన తీర్పుపై దేశ వ్యాప్తంగా చర్చ ప్రారంభం కావడాన్ని తాను స్వాగతిస్తున్నానని, ఆలాంటి వ్యాఖ్యలతో తాను భయపడి ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పుకుంటానని భావించారని, కానీ ఏలాంటి సవాల్‌నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.

**తెలుగు వ్యక్తికి మద్దతు ఇవ్వండి : సిఎం**

'ప్రస్తుతం జరుగుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్‌డిఏ అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ తెలుగు వ్యక్తికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మాజీ సిఎంలు కెసిఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపిలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశం హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. సి సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్ రెడ్డి గౌరవించారని అన్నారు. అందరూ ఒక తాటిపైకి వచ్చి తెలుగు వారందరూ సుదర్శన్ రెడ్డికి అండగా నిలబడాలని నిర్ణయించామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 42మంది ఎంపిలు, 18 మంది రాజ్యసభ సభ్యులు ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేస్తున్నానని సిఎం చెప్పారు. సుదర్శన్ రెడ్డి పోటీ వల్ల ఎన్‌డిఏ కూటమికి ఇండియా కూటమి గట్టి పోటీ ఇస్తోందన్నారు. నీలం సంజీవరెడ్డి, వివిగిరి, పి.వి.నరసింహారావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, ఎన్‌టి రామారావు వంటి తెలుగు నేతలు గతంలో జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించారని, నేడు తెలుగు నాయకులు జాతీయ రాజకీయాల్లో అంత కీలకంగా లేరని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు భాష రెండో స్థానంలో ఉన్నప్పుడు తెలుగువారు కూడా ఆ స్థాయిలో ఉండాలని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలిస్తే తెలుగు వారి ప్రతిష్ట పెరుగుతుందన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామా చేయడం ఆశ్చర్యకరమని, ఆయన రాజీనామాను దేశప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలో 18 ఏళ్లకు ఓటు హక్కు ఇచ్చిన రాజీవ్ గాంధీ ఆలోచన ఒక వైపు, ఓట్ చోర్ ఆలోచనతో మరో పార్టీ ఇంకో వైపు దేశంలో ఉన్నాయని, పెద్దల సభ రాజ్యసభ చైర్మన్ సీటులో గౌరవమైన వ్యక్తులు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విధానాలపై సంపూర్ణ విశ్వాసం ఉన్నవారు కూర్చుంటే పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించే పార్టీలో ఆయన మొదటి సభ్యత్వం తీసుకున్నారని, రాజ్యాంగాన్ని రక్షించడమే ఆయన పార్టీ అన్నారు. ఎజెండా, జెండా లేకుండా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంతా మద్దతు ఇవ్వాలన్నారు. రాజ్యాంగాన్ని రక్షిస్తే దేశాన్ని రక్షించినట్లేనని, లేకుంటే దేశానికి నష్టం జరుగుతుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఒక జాతీయ నాయకుడు నక్సలైట్ అని అంటున్నారని సిఎం గుర్తు చేస్తూ 'నక్సలిజం ఒక విధానం మాత్రమే. నక్సలిజం ఫిలాసఫీ నచ్చవచ్చు లేదా నచ్చకపోవచ్చు. మనకు నచ్చని ఫిలాసఫీతో వాదించి గెలవాలి. కానీ అంతం చేస్తానంటే కుదరదు' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని పరిరక్షించేందుకు సుదర్శన్ రెడ్డిని గెలిపించండి**

రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని పరిరక్షించి కోవాలంటే ఉపరాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గెలుపించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కోరారు. తెలంగాణ ఉద్యమం పునాదులను పటిష్టం చేసేందుకు ఏనలేని కృషి చేసిన తెలంగాణ బిడ్డ అయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి పార్టీలకు అతీతంగా ఎంపిలందరూ ఓటు చేసి గెలిపించాలన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా జస్టిస్ సుభాష్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, విధానాలపై జరుగుతున్న ఈ ఎన్నికలో రాజ్యాంగ భక్షకుల వైపు ఉంటారా, రాజ్యాంగ పరిరక్షకుల వైపు ఉంటారా అనేది ఎంపిలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని ముందుకు తీసుకురావాలనే కేంద్రంలోని అధికారంలో ఉన్న బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఉపరాష్ట్రపతి ఎన్నికలు ప్రధాన అంశంగా ఉండనుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ తరుణంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పూర్తిగా రాజ్యాంగ హక్కులను పరిరక్షించే ప్రతినిధిగా భావించి ఆయనను ప్రతిపక్ష పార్టీలన్నీ అభ్యర్థిగా నిలబెట్టాయన్నారు. దేశంలో రాజ్యాంగంలో పేర్కొనబడిన అంశాలను, ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని భావించే శక్తులన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గలిపించాలన్నారు.

# తప్పక ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అడ్మిషన్లకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం విధించిన నివా స నిబంధనలను అత్యున్నత న్యాయస్థానం స మర్థించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూ ర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌ను అనుమతించింది. 2024 లో సవరించిన తెలంణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ ( ఎంబిబిఎస్, బిడిఎస్‌ల్లోకి అడ్మిషన్) రూల్స్ 2017ను 2024లో సవరించడాన్ని సమర్థించింది. ఈ నిబంధనలు రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు మాత్రమే రాష్ట్ర కోటా కింద వైద్య కళాశాలలు, దంత కళాశాలల్లో ప్రవేశం కల్పించాయి.తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రకారం.. రాష్ట్ర శాశ్వత నివాసితులు కొంతకాలం రాష్ట్రం వెలుపల నివసించిన కారణంగా వారికి మెడికల్ కాలేజీల్లో ప్రవేశ ప్రయోజనాలను తిరస్కరించలేరని స్పష్టంచేసింది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నివాస నియమాన్ని రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తో సహా దాఖలైన పిటిషన్‌లపై ఆగస్టు 5న సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్‌చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, న్యాయవాది శ్రవణ్‌కుమార్ కర్ణం తమ వాదనలను వినిపించారు. వివరణాత్మక (డీటైల్డ్) తీర్పు రావాల్సి ఉంది.

## జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన

# విధానం చెప్పండి

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియపై వివరణ ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సలీమ్, మరొకరు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడినS ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1996లో జారీ చేసిన జివొ 570 ప్రకారం జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన జరగాల్సి ఉందని పిటిషనర్ న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న వార్డు విభజన విధానం రాజ్యాంగం ఆర్టికల్ 243S, డిలిమిటేషన్ చట్టంలోని సెక్షన్ 8లకు వ్యతిరేకమన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టంలోని సెక్షన్ 6లో జనాభా స్థానంలో ఓటర్ల సంఖ్య అని ఉండటం చెల్లదన్నారు. ఢిల్లీ, ఎంపీ, అరుణాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో మున్సిపల్ చట్టాల ప్రకారం జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన ఉంటుందన్నారు. ఇక్కడ మాత్రం అందుకు వ్యతిరేకంగా ఉందన్నారు. జీహెచ్‌ఎంసీలో మొత్తం 150 వార్డులు ఉన్నాయని, వాటిలో 117 వార్డులు అశాస్త్రీయంగా ఉన్నాయని చెప్పారు. కొన్ని వార్డుల్లో 78 వేల ఓటర్లు ఉండగా, మరికొన్నింటిలో 28 వేలే ఉన్నాయన్నారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల గడువు కోరింది. అందుకు హైకోర్టు అనుమతిచ్చింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# అవినీతి మరక

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్‌పైన సిబిఐ విచారణ చేసే పరిస్థితి వచ్చిందంటే ఇక ఆ పార్టీ ఉంటే ఎంత? లేకపోతే ఎంత ? అని అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తనపైన హరీష్ రావు,సంతోష్ రావు ఎన్ని కుట్రలు చేసినా భరించానని, కానీ కెసిఆర్‌పైన అవినీతి ఆరోపణలు వస్తుంటే మాత్రం తాను తట్టుకోలేపోతున్నానని భావోద్వేగానికి గురయ్యారు. తన వెనకాల బిజెపి, కాంగ్రెస్ ఉన్నదని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనది కెసిఆర్ బ్లడ్ ఉన్నదని, తాను ఇండిపెండెంట్‌గా ఉంటానని, తాను ఎవరో ఆడిస్తే ఆడే ఆటబొమ్మను కాదని, ఇక నుంచి తనపై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే 'మీ తోలు' తీస్తానని కవిత హెచ్చరించారు. కెసిఆర్ పక్కన ఉన్నవారి వల్లనే ఆయనకు అవినీతి మరక వచ్చిందని, ఈ విషయాన్ని బిఆర్‌ఎస్ శ్రేణులు ఆలోచించాలన్నారు. కాళేశ్వరం అవినీతిలో హరీశ్ రావు పాత్ర లేదా ?, వారి స్వార్థం కోసమే అవినీతికి పాల్పడ్డారని, అందుకే రెండవ సారి అధికారంలోనికి వచ్చిన తర్వాత హరీశ్‌రావుకు నీటి పారుదల శాఖ నుంచి తప్పించారన్నారు. ఇటీవల ఎసిబి అధికారులు అరెస్ట్ చేసిన నీటి పారుదల శాఖకు చెందిన అధికారులను విచారిస్తే, వారి వెనకాల ఎవరు ఉంటారో తెలుతుందన్నారు. హరీష్ రావు,సంతోష్ రావు వెనకాల సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, వారి మధ్య ఒప్పందాలు కూడా ఉన్నాయని, అందుకే కెసిఆర్‌ను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తాను నేరుగా పేర్లను వెల్లడించానని, వారిపై విచారణ చేపట్టాలన్నారు. సిబిఐ విచారణలో కెసిఆర్ కడిగినముత్యంలా బయటకు వస్తారన్నారు. బిహార్ ఎన్నికల కోసం తెలంగాణ బిసిలను బలి చేస్తున్నారని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని కవిత ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com